www.andhrajyothy.com
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 300
వెల (Price) : Rs. 6.50
గుంటూరు సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 12
సోమవారం 5-1-2026
శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: విదియ ఉ.9.57 తదుపరి తదియ, నక్షత్రం: పుష్యమి మ.1.25 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.1.37-3.08, దుర్ముహూర్తం: మ.12.42-1.26, మ.2.54-3.38, అమృతఘడియలు: ఉ.7.29-8.58, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.50, సూర్యాస్తమయం: 5.50
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వరి ఉత్పత్తిలో మనమే నంబర్ 1



చైనాకన్నా ముందంజ
15 కోట్ల టన్నుల దిగుబడి
మోదీ పాలనలో 3,236 కొత్త విత్తనాల ఆవిష్కరణ
కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్

2

లక్ష మంది డ్రోన్ సైనికులతో భైరవ దళం

2



ఆధునిక యుద్ధ దళాన్ని సిద్ధం చేసిన సైన్యం
15న ఆర్మీ డే పరేడ్‌లో ప్రత్యేక దళం కవాతు



తొలి విమానానికి జల ఫిరంగులతో స్వాగతం

ఎగిరొచ్చిన ఎయిర్‌బస్

భోగాపురం ఎయిర్‌పోర్టులో క్షేమంగా దిగిన విమానం



భోగాపురం వచ్చిన తొలి విమానం ముందు విక్టరీ చిహ్నం చూపుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్, రాష్ట్ర మంత్రి కొండపల్లి, ఎంపీలు భరత్, కలిశెట్టి, ఎమ్మెల్యే గంటా, అధికారులు

- తొలి ఫ్లైట్ ల్యాండింగ్‌తో పులకించిన ఉత్తరాంధ్ర
- ఢిల్లీలో బయల్దేరి ఉదయం 11 గంటలకు ల్యాండింగ్
- ఉద్విగ్న క్షణాల మధ్య ట్రయల్ రన్ విజయవంతం
- కేంద్ర మంత్రి రామ్మోహన్, ఇతర ప్రతినిధుల రాక
- ఘన స్వాగతం పలికిన ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు

బుర్రలేని వారే భోగాపురంలో విమానాశ్రయం కడతారన్న వైసీపీ అధినేత ఇప్పుడు ఏమంటారో సమాధానం చెప్పాలి. ఎయిర్‌పోర్టు పనులను జగన్ అండ్ కో నీరుగార్చారు. ఈ విమానాశ్రయంతో ఉత్తరాంధ్రతో పాటు విశాఖ నగరం రూపురేఖలే మారిపోతాయి.
–కేంద్ర మంత్రి రామ్మోహన్



విమానం నుంచి బయటికొస్తూ రామ్మోహన్ అభివాదం

విజయనగరం, అమరావతి, న్యూఢిల్లీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ ఫలించింది. ఎయిరిండియా 'ఎయిర్‌బస్' ఎగిరొచ్చి విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో వాలింది. ట్రయల్ రన్‌లో భాగంగా.. ఉత్తరాంధ్ర ప్రజల ఆశలను మోసుకుంటూ 'ఎయిరిండియా ఎయిర్‌బస్ ఏ320' విమానం తొలిసారిగా ఆదివారం ఉదయం భోగాపురం ఎయిర్‌పోర్టులో క్షేమంగా ల్యాండ్ అయింది. ఈ చరిత్రాత్మక ఘట్టంతో ఉత్తరాంధ్ర నేల పులకించింది..! ఢిల్లీ నుంచి 1,600 కిలోమీటర్లు ప్రయాణించిన ఎయిరిండియా విమానం గంటన్నర వ్యవధిలో భోగాపురం చేరుకుంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విమానయాన శాఖ ఉన్నతాధికారులు ఈ ప్రత్యేక

మిగతా 11వ పేజీలో...

సీమ లిఫ్టు.. ఆపేసింది జగనే!



అయినా అడ్డగోలుగా అవాకులు

రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డే ఆపేశారని రాష్ట్రప్రభుత్వ వర్గాలు తేల్చిచెప్పాయి. తన ఒత్తిడితోనే ఈ పథకం నిర్మాణాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నిలిపివేశారంటూ తెలంగాణ శాసనసభలో ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చాయి. ఆయన వ్యాఖ్యలపై వాస్తవాలేమిటో ప్రజల ముందు ఉంచాయి. తెలంగాణ రాజకీయాల్లో భాగంగా రేవంత్‌రెడ్డి అలా మాట్లాడి ఉంటారని.. అయితే వాటి ఆధారంగా చంద్రబాబుపైన, కూటమి ప్రభుత్వంపైన వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని స్పష్టంచేశాయి. జగన్ సీఎంగా ఉన్న సమయంలోనే ఈ పథకాన్ని అటకెక్కించారంటూ నాటి పరిణామాలు, కేంద్రం నుంచి వచ్చిన ఆదేశాలను సవివరంగా తెలియజేశాయి.

- అనుమతుల్లేవు.. డీపీఆర్ కూడా లేదు
- అయినా రూ.3,378 కోట్ల అంచనాతో 2020 మే 5న ప్రాజెక్టుకు జగన్ శ్రీకారం
- స్టే విధించిన జాతీయ హరిత ట్రైబ్యునల్
- పర్యావరణ అనుమతులు వచ్చాకే చేపట్టాలని కేంద్రం ఆదేశాలు
- స్టే ఎత్తివేయించేందుకు మూడున్నరేళ్లలో ప్రయత్నమే చేయని వైసీపీ సర్కారు
- నిజాలు బయటపెట్టిన ప్రభుత్వ వర్గాలు
- తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో వాస్తవాలు వెల్లడి
- ఈ వివాదంలో చంద్రబాబుపై బురద జల్లి రాజకీయ లబ్ధి పొందేందుకు వైసీపీ ఎత్తు
- వాస్తవాలు వెల్లడవడంతో చిత్తు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కేంద్ర జలశక్తి, పర్యావరణ-అటవీ శాఖలు, అపెక్స్ కౌన్సిల్, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నుంచి ముందస్తు అనుమతులు లేకుండానే రూ.3,378 కోట్ల అంచనాతో 'రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం'కు అప్పటి సీఎం జగన్ 2020 మే 5న ఆమోదం తెలిపారు. శ్రీశైలం జలాశయం ఎగువన 800 అడుగుల నుంచి సంగమేశ్వరం వద్ద రోజుకు ఒక టీఎంసీ చొప్పున కుడికాలువలోకి ఎత్తిపోస్తామన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారుచేయకుండానే శ్రీకారం చుట్టారు. పర్యావరణ మదింపు కూడా చేయలేదు. దీంతో ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలంటూ తెలంగాణకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్

మిగతా 11వ పేజీలో...

నల్లమలసాగర్‌ను అడ్డుకోండి

సుప్రీంలో తెలంగాణ పిటిషన్.. నేడు విచారణ
ఆంధ్రప్రదేశ్ తరఫున వాదించనున్న రోహత్గీ

11



నైట్ స్టాకర్స్ తోడుగా డెల్టా ఫోర్స్ ముందుండి!

- అమెరికా అత్యున్నత దళాలతో వెనెజువెలాలో ఆపరేషన్
- మదురోను పట్టుకెళ్లేందుకు నాలుగు నెలల ప్రణాళిక
- మదురో కదలికలు, ఇతర అంశాలపై సీఐఏ నిఘా
- స్థానిక నేతలు, అధికారులకు ఎరవేసి వివరాల ఆరా
- తొలుత వెనెజువెలా రక్షణ వ్యవస్థల ధ్వంసం
- తర్వాత సైనిక హెలికాప్టర్లలో వెళ్లి.. మదురో అరెస్టు

వ్యూహాత్మకంగానే మదురో భార్య నిర్బంధం
నాయకురాలిగా ఎదగకుండా అడ్డుకునేందుకే అదుపులోకి

చేతులకు బేడీలతో జైలుకు మదురో

- కరుడుగట్టిన ఖైదీలాగా బ్రూక్లిన్ జైలుకు తరలింపు
- డ్రగ్స్, ఉగ్రవాద ఆరోపణలు రుజువైతే జీవితకాలం జైల్లోనే..
- అమెరికా అధికారులకు మదురో న్యూఇయర్ శుభాకాంక్షలు
- మీకూ అదే గతి.. క్యూబా, చిలీ, కొలంబియాలకు ట్రంప్ హెచ్చరిక
- రష్యా కూడా జెలెన్‌స్కీని ఇలాగే బంధిస్తే ఏం చేస్తారు?
- ట్రంప్ తీరును ప్రశ్నించిన ఆ దేశ ప్రజాప్రతినిధి రో ఖన్నా
- అమెరికా దాడిలో 40 మంది మరణించారు: వెనెజువెలా

వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉపాధ్యక్షురాలు డిల్సీ రోడ్రిగ్స్

న్యూయార్క్/కారకస్, జనవరి 4: అర్ధరాత్రి మిలిటరీ ఆపరేషన్‌తో వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అపహరించిన అమెరికా.. ఆయనను కరుడుగట్టిన నేరస్తుడి మాదిరిగా చేతులకు బేడీలు వేసి జైలుకు తరలించింది. చేతులకు బేడీలు, తలపై నల్లని వస్త్రంలాంటి టోపీతో ఉన్న మదురోను రెండువైపులా ఇద్దరు అధికారులు పట్టుకొని జైల్లోకి నడిపించుకొని తీసుకెళ్తున్న వీడియోను అమెరికా మీడియా ఆదివారం ప్రసారం చేసింది. మదురోను న్యూయార్క్‌లోని ప్రఖ్యాత బ్రూక్లిన్ జైలు (మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్)కు తరలించారు. ఈ జైలు కరుడుగట్టిన నేరస్తులకు కేంద్రం. ఇందులో ప్రస్తుతం 1,300 మంది

మిగతా 2వ పేజీలో...



ఆత్మగౌరవ పర్వం.. 1000 ఏళ్ల అఖండ విశ్వాసం

- 1026 జనవరిలో సోమనాథ ఆలయాన్ని ధ్వంసం చేసిన గజనీ మహ్మద్
- 1947లో ఆలయ పునర్నిర్మాణ బాధ్యత తీసుకున్న సర్దార్ పటేల్
- 1951లో తెరుచుకున్న ఆలయ ద్వారాలు
- నెహ్రూ కాదన్నా.. నాటి కార్యక్రమానికి హాజరైన రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్
- ఆలయ ప్రత్యేకతపై ప్రధాని నరేంద్ర మోదీ

12

అవయవదాత కుటుంబానికి లక్ష ఆర్థిక సాయం!

ఒకరికి తాత్కాలిక ప్రభుత్వ ఉద్యోగం కూడా..
సీఎంకు ఆరోగ్య మంత్రి ప్రతిపాదన

12

మార్చి 3న చంద్ర గ్రహణం

మూతపడనున్న తిరుమల ఆలయ ద్వారాలు

3

గ్రోక్.. దుశ్శాసన పర్వం!

మహిళలు, చిన్నారుల చిత్రాలను అసభ్యకరంగా మారుస్తున్న 'ఎక్స్' ఏఐ టూల్
ఎక్స్‌లో 'బికినీ' ట్రెండ్‌పై ఆందోళన

2



గుర్రపు బండిపై తెలుగు మహాసభలకు వస్తున్న మారిషస్ అధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ దంపతులు

2 వారాలకో భాష కనుమరుగు!

- ఈ శతాబ్దం చివరికి సగానికి పైగా అంతరించే ముప్పు
- ప్రపంచ తెలుగు మహాసభల్లో మారిషస్ అధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ ఆవేదన
- ఏఐ, డిజిటల్ సాధనాలతో పరిరక్షించుకోవాలి
- ఈ దిశగా చంద్రబాబు కృషి అభినందనీయం
- మారిషస్‌లో ఉగాది జాతీయ సెలవు దినమని వెల్లడి

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భాషా వారసత్వాన్ని కాపాడుకోవడంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని మారిషస్ అధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ అన్నారు. అటు మారిషస్, ఇటు భారతదేశం కూడా ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రపంచంలోని భాషల గురించి

మిగతా 3వ పేజీలో...

కలల ఇంటికి చైనా హంగులు



ఫర్నిచర్, శానిటరీవేర్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కొనుగోలుకు చలో చైనా

- పెద్ద ఎత్తున క్యూ కడుతున్న ఏపీ, తెలంగాణవాసులు
- వేల డిజైన్లు, ఫ్యాక్టరీలు.. కి.మీ. పొడవున మాల్స్
- కొనుగోళ్లలో సహాయం చేయడానికి అక్కడే ఏజెన్సీలు తెరిచిన మనోళ్లు
- పోషన్, గ్వాంగ్‌ఝౌలో 500 పైగా తెలుగు ఫ్యామిలీలు
- ఫర్నిచర్ షాపింగ్ పూర్తయ్యాక అక్కడే రెండు రోజులుండి పర్యాటక ప్రాంతాల సందర్శన!

(ఆంధ్రజ్యోతి-హైదరాబాద్)

ఇల్లంటే.. గోడలు, పైకప్పే కాదు! ఫర్నిచర్, ఇంటీరియర్స్ కూడా!! ముచ్చటపడి కట్టుకున్న పొదరింటిని మరింత అందంగా మార్చేది అవే!! అయితే, ఇన్నాళ్లూ ఆ ఫర్నిచర్, ఇంటీరియర్స్ షాపింగ్ ఇక్కడే చేసిన తెలుగు ప్రజలు ఇప్పుడు ట్రెండ్ మార్చారు. "ఇల్లు ఇక్కడ కడదాం.. సామాన్లు చైనాలో కొందాం" అంటూ డ్రాగన్ దేశంలో షాపింగ్‌కి క్యూ కడుతున్నారు. ఒకప్పుడు చైనా వస్తువులంటే చౌకబారు అనే ముద్ర ఉండేది. కానీ చైనీయులు నాణ్యతలోనూ, డిజైన్లలోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీ పడుతుండటంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆ దేశానికి ఫర్నిచర్ కొనుగోలుకు వెళ్లేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నుంచి

మిగతా 12వ పేజీలో...



డెడ్‌లైన్ తర్వాత ఒక్క దళమైనా మిగలాలి!

మావోయిస్టుల కొత్త వ్యూహం

- తమను నిర్మూలించలేరని మార్చి 31 తర్వాత సవాల్ విసిరే ఎత్తుగడ
- తిప్పిరి తిరుపతి నేతృత్వంలో దళాలు కదులుతున్నట్లు గుర్తింపు
- కేంద్ర కమిటీలోని నలుగురు తెలంగాణవారు లొంగుబాటుకు నో
- డెడ్‌లైన్ ముగిసేవరకు ప్రాణాలు కాపాడుకోవడంపైనే దృష్టి

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): దేశంలో నక్సలైట్లను అంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువు అయిన మార్చి 31వ తేదీ తర్వాత కూడా మనుగడ సాగించి, తమను నిర్మూలించటం సాధ్యం కాదని పాలకులకు సవాల్ విసరాలని మావోయిస్టులు భావిస్తున్నట్లు తెలిసింది. అందుకోసం పార్టీ అగ్రనేతలు కొత్త వ్యూహాలు సిద్ధం చేసినట్లు ఇటీవల లొంగిపోయిన కొందరు కీలక నేతల ద్వారా పోలీసులు తెలుసుకున్నట్లు సమాచారం. పార్టీని నడిపిస్తున్న అగ్రనాయకత్వం దళాలను కాపాడుకోవడానికి కొత్త ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ఊహించని ప్రదేశాలకు వెళ్లి తలదాచుకోవాలని

మిగతా 2వ పేజీలో...

అసోం స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ప్రియాంక

» తమిళనాడు కమిటీలో అనిల్‌కుమార్ యాదవ్

గువాహటి/న్యూఢిల్లీ, జనవరి 4: రాబోయే అసోం అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించే స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా వాద్రా నియమితులయ్యారు. ఈ ఏడాది ప్రథమార్థంలో ఎన్నికలు జరగనున్న అసోం, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరికి సంబంధించి పార్టీ అధిష్ఠానం శనివారం రాత్రి స్క్రీనింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ కమిటీల వివరాలను వెల్లడిస్తూ, అసోం కమిటీకి ప్రియాంక గాంధీ నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు. ఇక కేరళ స్క్రీనింగ్ కమిటీకి మధుసూదన్ మిస్త్రీ, తమిళనాడు, పుదుచ్చేరికి టీఎస్ సింగ్ దేవ్, బెంగాల్‌కు బీకే హరిప్రసాద్ చైర్మన్లుగా నియమితులయ్యారు. తమిళనాడు, పుదుచ్చేరి స్క్రీనింగ్ కమిటీలో రాజ్యసభ ఎంపీ మందాడి అనిల్‌కుమార్ యాదవ్ సభ్యుడిగా నియమితులయ్యారు.

ఇంట్లో విగ్రహాలు ప్రతిష్ఠించుకునే హక్కు ఉంది

» ప్రభుత్వం జోక్యం చేసుకోజాలదు: మద్రాస్ హైకోర్టు

చెన్నై, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎవరైనా తమ ఇంటి ఆవరణలో ఏదైనా విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుని, ఒంటరిగా లేదా స్నేహితులను, పొరుగువారిని ఆహ్వానించి శాంతియుతంగా పూజించుకునే హక్కులో ప్రభుత్వం జోక్యం చేసుకోజాలదని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. చెన్నైలోని ఎన్నూరుకు చెందిన ఎ.కార్తీక్ తన ఇంట్లో శివశక్తి, దక్షీశ్వరి, వినాయకుడు, వీరభద్రన్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలో ఎక్కువ మరణాలు సంభవించాయంటూ ఆ విగ్రహాలను ప్రభుత్వ అధికారులు తొలగించారు. కార్తీక్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తి జస్టిస్ భరత చక్రవర్తి విచారణ జరిపి కీలక వ్యాఖ్యలు చేశారు. 'దేవుడు లేదా విగ్రహం మానవులెవరికీ హాని చేయవు. విగ్రహాలను ఇంట్లో పెట్టుకోవడం వల్ల మరణాలు సంభవించాయన్నది మూఢనమ్మకం మాత్రమే' అన్నారు. ప్రభుత్వ అధికారులు కూడా మూఢనమ్మకాలకు తలొగ్గరాదని హితవు పలికారు. తొలగించిన విగ్రహాలను తిరిగి పిటిషనర్‌కు అప్పగించాలని ఆదేశించారు.

లక్ష మంది డ్రోన్ సైనికులతో భైరవ దళం

» ఆధునిక యుద్ధ దళాన్ని సిద్ధం చేసిన సైన్యం

» 15న ఆర్మీ డే పరేడ్‌లో ప్రత్యేక దళం కవాతు

నసీరాబాద్ (రాజస్థాన్), జనవరి 4: మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా భారత సైన్యం కూడా టెక్నాలజీకి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సరికొత్త అస్త్రాలతో ఆధునిక యుద్ధ దళాన్ని సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో సైన్యంలో ఎన్నడూ లేనివిధంగా ఏకంగా లక్షమందికిపైగా డ్రోన్ ఆపరేటర్లతో ఒక భారీ సైన్యాన్ని తయారు చేసింది. శత్రు స్థావరాలను ధ్వంసం చేసేందుకు 'భైరవ్' పేరుతో స్పెషల్ ఫోర్స్‌ను సిద్ధం చేసింది. రాజస్థాన్ ఎడారి ప్రాంతంలో కొత్తగా ఈ భైరవ్ బెటాలియన్లను ఏర్పాటు చేశారు. ఆధునిక యుద్ధ రంగంలో డ్రోన్ల వినియోగం పెరిగిన నేపథ్యంలో.. 'భైరవ్' ఏర్పాటు వెనుక భారీ వ్యూహం ఉంది. ఇది సాధారణ దళానికి, పారా స్పెషల్ ఫోర్సెస్‌కి మధ్య వారధిలా పనిచేస్తుంది. బహుళ స్థాయిల్లో అత్యంత వేగంగా, దూకుడుగా దాడి చేయడం 'భైరవ దళం' ప్రత్యేకత. ఈ దళంలోని ప్రతి సైనికుడికి డ్రోన్లు ఆపరేటింగ్, యుద్ధంలో వాటి వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. భారత సైన్యం ఇప్పటికే 15 బెటాలియన్లను ఏర్పాటుచేసింది. వాటిని పాక్, చైనా సరిహద్దుల్లోని వివిధ దళాలకు కేటాయించింది. భవిష్యత్తులో వీటిని 25 బెటాలియన్లకు పెంచాలనేది ఆర్మీ లక్ష్యం.

రాజస్థాన్‌లో కఠోర శిక్షణ

ప్రస్తుతం రాజస్థాన్‌లో ఈ దళం 5నెలలుగా కఠోర శిక్షణ తీసుకుంటోంది. రాజస్థాన్ ఎడారి ప్రాంతం, అక్కడి వాతావరణం, భాష, భౌగోళిక పరిస్థితులపై పూర్తిగా అవగాహన ఉన్న స్థానిక యువకులనే ఈ బెటాలియన్‌లో ఎక్కువగా చేర్చుకున్నారు. ఈ ఏడాది జనవరి 15న జైపూర్‌లో జరగనున్న ఆర్మీ డే పరేడ్‌లో భైరవ దళం తొలిసారిగా కవాతు చేయనుంది. భైరవ్ మాత్రమే కాదు.. 'రుద్ర బ్రిగేడ్స్' పేరుతో మరో శక్తిమంతమైన వ్యవస్థను కూడా భారత ఆర్మీ ఏర్పాటు చేసింది. ఇందులో పదాతి దళం, యాంత్రిక యూనిట్లు, ట్యాంకులు, ఫిరంగి దళం, ప్రత్యేక దళాలు, డ్రోన్ వ్యవస్థలన్నీ ఉంటాయి. ఇదొక సంపూర్ణ యుద్ధ వ్యవస్థ.

'నరేగా బచావో సంగ్రామ్' సమన్వయ కమిటీలో సీతక్క



» 9 మందితో కమిటీ ఏర్పాటు

న్యూఢిల్లీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ 'నరేగా బచావో సంగ్రామ్' పేరుతో ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసింది. ఈ నిరసన కార్యక్రమాల అమలు పర్యవేక్షణకు తొమ్మిది మందితో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ కన్వీనర్‌గా రాజ్యసభ సభ్యుడు అజయ్ మాకెన్‌ను నియమించింది. కాంగ్రెస్ అధిష్ఠానం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ కమిటీలో తెలంగాణ నుంచి మంత్రి సీతక్కకు అవకాశం కల్పించారు. ఇతర సభ్యులుగా జైరాం రమేశ్, సందీప్ దీక్షిత్, డాక్టర్ ఉదిత్ రాజ్, ప్రియాంక్ ఖర్గే, దీపికా పాండే సింగ్, డాక్టర్ సునీల్ పన్వార్, మనీశ్ శర్మ ఉన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆమోదం మేరకు ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు.

నేటి నుంచి రిపబ్లిక్ డే పరేడ్ టికెట్ల విక్రయాలు

న్యూఢిల్లీ, జనవరి 4: గణతంత్ర దినోత్సవ పరేడ్‌లు, సాంస్కృతిక, రక్షణ సామర్థ్యాల ప్రదర్శన కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు జనవరి 5 నుంచి టికెట్ల విక్రయాలు ప్రారంభమవుతాయని రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం ప్రకటించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో ఈ నెల 14 వరకు టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపింది. జనవరి 26న గణతంత్ర దినోత్సవ పరేడ్, 28న బీటింగ్ ది రిట్రీట్ ఫుల్‌డ్రస్ రిహార్సల్, 29న ప్రధాన బీటింగ్ ది రిట్రీట్ కార్యక్రమాలను నిర్వహిస్తారు. గణతంత్ర దినోత్సవ పరేడ్ టికెట్ల ధరలను రూ.20, రూ.100గా అధికారులు నిర్ణయించారు. టికెట్లను ఆన్‌లైన్‌లో 'ఆమంత్రన్' పోర్టల్ ద్వారా, ఆఫ్‌లైన్‌లో ఢిల్లీలోని నిర్దేశిత కౌంటర్ల ద్వారా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు చూపించి పొందవచ్చు.

డెడ్‌లైన్ తర్వాత ఒక్క దళమైనా మిగలాలి!

(మొదటి పేజీ తరువాయి)

దళాలకు పార్టీ సూచించినట్లు సమాచారం. మార్చి 31లోపు ఆపరేషన్ కగార్‌ను పూర్తిచేసేందుకు భద్రతా బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరైనా మైదాన ప్రాంతాలకు చేరి, నమ్మకస్తుల సహకారంతో ప్రాణాలు కాపాడుకుని డెడ్‌లైన్ దాటిన తర్వాత బయటకు వచ్చి, మావోయిస్టు పార్టీని నిర్మూలించడం ప్రభుత్వ తరం కాదని సవాల్ విసరాలని ఆ పార్టీ అగ్రనాయకత్వం వ్యూహం పన్నిందని నిఘావర్గాలకు సమాచారం అందింది.

సురక్షిత ప్రాంతాలను గుర్తించేపనిలో దళాలు

తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో కొద్దిగా మిగిలిన మావోయిస్టులు సురక్షిత ప్రాంతాలను గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిసింది. తెలంగాణకు సంబంధించి మావోయిస్టు పార్టీలో మిగిలిన 17 మందిలో దాదాపు 8 మంది కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీ కొత్త సారథిగా ప్రచారం అవుతున్న తిప్పిరి తిరుపతితో పాటు బడే చొక్కారావు, ముప్పిడి సాంబయ్య, లోకేటి చందర్‌రావుల ఆధ్వర్యంలో దళాలు కదులుతున్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. కేంద్ర కమిటీలోని మిగిలిన నలుగురు తెలంగాణ వాసులు లొంగుబాటుకు సిద్ధంగా లేరన్న స్పష్టమైన సమాచారం పోలీసులకు అందినట్లు తెలుస్తోంది. పార్టీలోని సభ్యుల మధ్య కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినటంతో అందుబాటులో ఉన్న కొద్దిమందితోనే పార్టీ ముఖ్యులు కదులుతున్నారని సమాచారం. తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ వద్ద సైతం 20 మందికి మించి దళ సభ్యులు లేరని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. రాయ్‌పూర్‌లో గత నెలలో జరిగిన డీజీపీల సమావేశంలో మావోయిస్టు పార్టీపై చర్చ జరిగినట్లు సమాచారం. ఏ రాష్ట్రం వారు లొంగిపోవడానికి వచ్చినా ఆహ్వానిస్తామని తెలంగాణ పోలీసులు ప్రకటించటంతో లొంగుబాటుకు సిద్ధంగా ఉన్నవారు ఇటువైపు అడుగులు వేస్తున్నారు.


చేతులకు బేడీలతో

జైలుకు మదురో



(మొదటి పేజీ తరువాయి)

ఖైదీలు ఉన్నారు. సాధారణ నేరాలు చేసి వచ్చే ఖైదీలను.. పోలీసులు కోరినా ఈ జైలుకు పంపేందుకు న్యాయమూర్తులు అంగీకరించరు. కాగా, న్యూయార్క్ దక్షిణ జిల్లా ఫెడరల్ కోర్టులో మదురోపై మత్తుపదార్థాల ఉగ్రవాదానికి కుట్ర, అక్రమంగా మత్తుపదార్థాలను అమెరికాలోకి రవాణా చేసేందుకు కుట్ర పన్నటం, అక్రమ ఆయుధాల వ్యాపారం తదితర నేరాలకు సంబంధించిన అభియోగాలు మోపినట్లు అమెరికా అటార్నీ జనరల్ పామ్ బోండీ తెలిపారు. ఈ అభియోగాలన్నీ రుజువైతే మదురో జీవితకాలం మొత్తం జైల్లోనే ఉండాల్సి రావచ్చని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. పైగా మదురోకు సంబంధించిన ఆస్తులన్నీ అమెరికా జప్తు చేస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా తనను నిర్బంధంలోకి తీసుకున్న లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు మదురో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపటం విశేషం.



మదురో ఉండే డిటెన్షన్ సెంటర్

తర్వాతి వంతు మీదే..

ట్రంప్ ఇతర లాటిన్ అమెరికా దేశాలకు కూడా తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. అమెరికాలోకి డ్రగ్స్ అక్రమ రవాణాను ఆపకపోతే వెనెజువెలాకు పట్టిన గతే మీకూ పడుతుందని క్యూబా, చిలీ, కొలంబియా అధినేతలను హెచ్చరించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఇదేరకమైన హెచ్చరిక చేశారు. మదురోను నిర్బంధించటాన్ని ఈ మూడు దేశాలు తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే.

జెలెన్‌స్కీని ఇలాగే బంధిస్తే?

మదురోను అమెరికా సైన్యం అపహరించటాన్ని ఆ దేశ కాంగ్రెస్ సభ్యుడు, భారత సంతతి డెమొక్రాటిక్ నేత రో ఖన్నా తీవ్రంగా ఖండించారు. ట్రంప్ అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కుతూ మిలిటరిజంను ప్రోత్సహిస్తున్నారని ఆదివారం ఆయన ఆరోపించారు. 'తైవాన్ అధ్యక్షుడు లైచింగ్ తేను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇలాగే బంధించాలనుకుంటే మనం ఇప్పుడు ఏం చేయగలం? ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా ఇలాగే అపహరిస్తే ఎలా ప్రశ్నించగలం? ట్రంప్ ప్రభుత్వ యుద్ధోన్మాదం, రక్షణ బడ్జెట్ పెంపు విధానాలకు వ్యతిరేకంగా అమెరికా ప్రజలు గళం విప్పాల్సిన సమయం ఆసన్నమైంది. మన ప్రభుత్వానికి సరైన మార్గం చూపేందుకు ఇప్పుడు మనకు ఒక రాజనీతిజ్ఞుడు అవసరం' అని పేర్కొన్నారు.

వెంటనే విడుదల చేయండి: చైనా

నికోలస్ మదురోను వెంటనే విడుదల చేయాలని అమెరికాను చైనా డిమాండ్ చేసింది. మదురోను, ఆయన సతీమణి సిలియా ఫ్లోరెస్‌ను అమెరికా సైన్యం బలవంతంగా ఎత్తుకుపోవటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మదురో దంపతులను వదిలేసి, వెనెజువెలా ప్రభుత్వాన్ని కూలదోసే చర్యలను మానుకోవాలని చైనా విదేశాంగశాఖ ఆదివారం ఒక ప్రకటనలో సూచించింది. కాగా, ఈ అంశంపై భారత్ ఆచితూచి స్పందించింది. చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భారత విదేశాంగశాఖ పేర్కొంది. వెనెజువెలా, అమెరికాలు తమ మధ్య ఉన్న విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది.

తెల్లవారుజామున 4.30కే రిపోర్టర్ ఫోన్ ఎత్తిన ట్రంప్

మీడియాకు నిత్యం టచ్‌లో ఉండే ట్రంప్.. మదురో నిర్బంధం రోజు కూడా అదే విధానం పాటించారు. కారకస్‌పై బాంబుదాడుల విషయం తెలియగానే శనివారం తెల్లవారుజామున 4.30కు న్యూయార్క్ టైమ్స్ పత్రిక రిపోర్టర్ టేలర్ పేజర్.. ట్రంప్‌కు నేరుగా ఫోన్‌చేశారు. మూడు రింగులకే ఫోన్ ఎత్తిన ట్రంప్‌ను.. కారకస్‌పై దాడి గురించి రిపోర్టర్ ప్రశ్నించగా నేరుగా సమాధానం చెప్పలేదు. మరికొన్ని గంటల్లో తాను నిర్వహించబోయే మీడియా సమావేశాన్ని ఫాలో అవ్వండి అని చెప్పి ట్రంప్ కాల్ కట్‌చేశారని, ఆ సమయంలో ఆయన ఏమాత్రం విసుక్కోలేదని టేలర్ తెలిపారు.

మోదీ కూడా మసూద్‌ను ఇలాగే తీసుకురావాలి

» అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్

ముంబై, జనవరి 4: ప్రధాని మోదీకి ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ సరికొత్త సవాల్ విసిరారు. మదురోను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకెళ్లినట్లుగా.. ముంబైలో 26/11 ఉగ్రదాడుల సూత్రధారి మసూద్ అజర్‌ను పాకిస్థాన్ నుంచి భారత్‌కు మోదీ తీసుకురావాలని ఒవైసీ అన్నారు. ముంబైలో ఓ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. మోదీ ఎవరికన్నా తక్కువ కాదని, మసూద్ అజర్‌ను తీసుకురావడం ద్వారా తన 56 అంగుళాల ఛాతీ శక్తిని చూపించాలని వ్యాఖ్యానించారు. అయితే ఒవైసీ వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. భారత్.. బాధ్యత కలిగిన దేశమని, పొరుగు దేశాలతో సత్సంబంధాలను కోరుకుంటుందని ఆ పార్టీ ఎంపీ గులాం అలీ ఖతానా అన్నారు.

వెనెజువెలా అధ్యక్షురాలిగా డిల్సీ



అధ్యక్షుడు మదురోను అమెరికా అపహరించటంతో వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ఆ దేశ ఉపాధ్యక్షురాలు డిల్సీ రోడ్రిగ్స్‌ను ఆ దేశ సుప్రీంకోర్టు ఆదివారం నియమించింది. అధ్యక్షుడు లేని దేశంలో పాలన గాడి తప్పకుండా కొనసాగించేందుకు, దేశ భద్రతను కాపాడేందుకు తక్షణం ఆమెను అధ్యక్ష పగ్గాలు చేపట్టాల్సిందిగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కోరింది. కాగా, అమెరికా దాడిలో 40 మంది మరణించారని వెనెజువెలా ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. వీరిలో సాధారణ పౌరులు కూడా ఉన్నట్లు వెల్లడించింది.

లోకం తీరు



వ్యూహాత్మకంగానే మదురో భార్య నిర్బంధం



వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోతో పాటు ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను కూడా అమెరికా నిర్బంధంలోకి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే మదురో సర్కారులో కీలకంగా వ్యవహరిస్తున్న సిలియాను వ్యూహాత్మకంగానే అదుపులోకి తీసుకున్నట్లు నిపుణులు చెబుతున్నారు. భర్త మదురోకు మద్దతు కూడగట్టకుండా.. అటు ప్రజల్లో, ఇటు సైన్యంలోనూ చైతన్యం తెచ్చి నాయకురాలిగా ఎదగకుండా అడ్డుకునే ఉద్దేశంతోనే బందీగా తీసుకెళ్లినట్లు వివరిస్తున్నారు. సిలియా సుదీర్ఘకాలం పాటు వెనెజువెలా 'ఫస్ట్ లేడీ'కి మించిన స్థానంలో ఉన్నారు. మదురో అనుచరులు ఆమెను 'తొలి యోధురాలి'గానూ పిలుస్తుంటారు. 1956లో టినాక్విల్లో పట్టణంలో ఓ పూరి గుడిసెలో పుట్టిన సిలియా.. 32 ఏళ్ల వయసులో న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేశారు. మదురో రాజకీయ ప్రస్థానానికి సమాంతరంగా తన రాజకీయ జీవితాన్ని నిర్మించుకున్నారు. కొన్ని సందర్భాల్లో ఆమె మదురో కన్నా ఉన్నత పదవులను కూడా నిర్వహించారు. 2013లో మదురో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక.. దేశ రాజకీయ దిశను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించారు. మాజీ అధ్యక్షుడు హ్యూగో చావెజ్ నీడలోనే మదురో, సిలియాలిద్దరూ రాజకీయంగా ఎదిగారు. ప్రస్తుతం ఎంపీగానూ సిలియా కొనసాగుతున్నారు.

నైట్ స్టాకర్స్ తోడుగా.. డెల్టా ఫోర్స్ ముందుండి!

అమెరికా అత్యున్నత దళాలతో వెనెజువెలాలో ఆపరేషన్



వాషింగ్టన్, జనవరి 4: నాలుగు నెలల ప్రణాళిక.. ఒకటికి పది సార్లు పక్కాగా నిఘా.. సమయం చిక్కగానే రంగంలోకి అత్యున్నత దళమైన డెల్టాఫోర్స్.. దానికితోడుగా శత్రువులకు ఏమాత్రం చిక్కకుండా రాత్రివేళల్లో అత్యంత సమర్థవంతంగా దాడులు చేసే నైట్ స్టాకర్స్ వైమానిక దళం.. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను పట్టుకెళ్లేందుకు అమెరికా అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన తీరు ఇది. అధ్యక్ష భవనంలోకి చొరబడిన తర్వాత కేవలం 5నిమిషాల్లోనే మదురోను, ఆయన భార్యను అమెరికన్ దళాలు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. అమెరికా నావికాదళం, నైట్ స్టాకర్స్ వైమానిక దళం, డెల్టా ఫోర్స్ పదాతిదళం మూడూ పూర్తి సమన్వయంతో అత్యంత విజయవంతంగా ఆపరేషన్ పూర్తిచేశాయి. ఆపరేషన్‌లో భాగంగా.. డ్రగ్స్ ముఠాను అరికట్టడానికంటూ అమెరికా కరీబియన్ సముద్రంలో వెనెజువెలాకు దగ్గరగా యుద్ధ నౌకలను, దళాలను మోహరించింది. నిజానికి మదురోను అరెస్టు చేయడం కోసం వెనెజువెలా తీరానికి దగ్గరగా అమెరికా చేసుకున్న ఏర్పాట్లు అవి. ఆ యుద్ధ నౌకల నుంచి నిఘాకు దొరకని స్టెల్త్ డ్రోన్లను వెనెజువెలా రాజధాని కారకస్‌పైకి పంపి.. మదురో ఉండే అధ్యక్ష భవనం, సమీప ప్రాంతాలు, ఆయన కదలికలపై అమెరికా నిఘా పెట్టింది. అమెరికా నిఘా సంస్థ సీఐఏ గూఢచారులను కూడా వెనెజువెలాలోకి పంపింది. మదురో కదలికల వివరాలు తెలిసిన వెనెజువెలా అధికారులు, నేతలకు గూఢచారులు ఎరవేసి సమాచారం సేకరించారు. ఇలా ఆగస్టు నుంచి సుమారు 4నెలలపాటు వివరాలన్నీ సేకరించి.. పక్కాగా ప్రణాళిక రూపొందించారు. అమెరికాలోని కెంటకీలో అచ్చం మదురో ఉండే భవనం తరహా నమూనాను సృష్టించారు. ఎక్కడి నుంచి ప్రవేశించి, ఎలా ముందుకెళ్లాలి, మదురోను పట్టుకొన్నాక ఎలా బయటికి రావాలి, ఎలా తరలించాలనేది ప్రాక్టీసు చేశారు.

ఏమిటీ డెల్టా ఫోర్స్.. నైట్ స్టాకర్స్?

ఉగ్రవాదంపై పోరు, అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించడం కోసం అమెరికా 1977లోనే ప్రత్యేకంగా 'డెల్టా ఫోర్స్' సైనిక దళాన్ని ఏర్పాటు చేసింది. మిగతా సైనికదళాల్లో అత్యంత సామర్థ్యం చూపిన వారిని దీనికి ఎంపిక చేసి... చాలా క్లిష్టమైన శిక్షణ ఇస్తారు. లాడెన్ వేట కోసం అఫ్ఘానిస్థాన్, ఇరాక్, సిరియాలలో చేసిన క్లిష్టమైన ఆపరేషన్లలో డెల్టా ఫోర్స్ దళాలు కీలకంగా వ్యవహరించాయి. ఇక ప్రత్యేక పరికరాల సాయంతో రాత్రివేళల్లో తక్కువ ఎత్తు నుంచి, అత్యంత కచ్చితంగా దాడి చేయగలిగే సామర్థ్యం నైట్ స్టాకర్స్ సొంతం.

ట్రంప్ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే..

మదురోను పట్టుకుని, తీసుకెళ్లేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి శుక్రవారం రాత్రి 10.46కు (స్థానిక కాలమానం ప్రకారం) గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. రాగానే రక్షణశాఖ ఉన్నతాధికారులు 'ఆపరేషన్ అబ్సల్యూట్ రిసాల్వ్' ప్రారంభించారు. అత్యున్నత సైనిక దళం 'డెల్టా ఫోర్స్'ను, దానికి సహాయకంగా నైట్ స్టాకర్స్‌ను రంగంలోకి దింపారు. 20 యుద్ధ నౌకల నుంచి సుమారు 150 ఫైటర్లు, బాంబర్లు, నిఘా విమానాలు వెనెజువెలా గగనతలంలోకి ప్రవేశించాయి. కారకస్‌లో క్షిపణి, యుద్ధ విమాన రక్షక వ్యవస్థలను, విద్యుత్ వ్యవస్థలను ధ్వంసం చేశాయి. ఆ వెంటనే నైట్ స్టాకర్స్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఎంహెచ్-60, ఎంహెచ్-47 హెలికాప్టర్లలో డెల్టా ఫోర్స్ కమెండోలు బయలుదేరారు. ఫోర్ట్ ట్యూనా మిలటరీ కాంప్లెక్స్‌లోని వెనెజువెలా అధ్యక్ష భవనంపై అర్ధరాత్రి 1.01 గంటల సమయంలో దిగారు.

స్టీలు గదిలో దాక్కోబోయినా..

అమెరికా ఎప్పుడైనా దాడి చేయవచ్చన్న ఉద్దేశంతో తాను దాక్కోవడానికి అధ్యక్ష భవనంలో మదురో అత్యంత దృఢమైన ఉక్కు గదిని ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం రాత్రి అమెరికా దళాలు అధ్యక్ష భవనంలోకి ప్రవేశించగానే.. ఉక్కు గదిలోకి వెళ్లేందుకు మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్ ప్రయత్నించారు. కానీ డెల్టాఫోర్స్ సైనికులు ఒకట్రెండు నిమిషాల్లోనే మదురో గదికి చేరుకుని, వారిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత హెలికాప్టర్‌లో అమెరికా యుద్ధ నౌక యూఎస్ఎస్ ఇవో జిమాకు తరలించారు. ట్రంప్ గ్రీన్‌సిగ్నల్ నుంచి మదురోను అమెరికా యుద్ధనౌకపైకి చేర్చే వరకు ఆపరేషన్ మొత్తం 2 గంటల 20 నిమిషాల్లోనే ముగిసింది. అందులో మదురోను అదుపులోకి తీసుకునే ప్రధాన ఆపరేషన్ అరగంటలోనే ముగిసింది.

గ్రోక్.. దుశ్శాసన పర్వం!

మహిళలు, చిన్నారుల చిత్రాలను అసభ్యకరంగా మారుస్తున్న 'ఎక్స్' ఏఐ టూల్

» ఎక్స్‌లో 'బికినీ' ట్రెండ్‌పై ఆందోళన

(సెంట్రల్ డెస్క్)

ఒక కాలేజీ అమ్మాయి.. పార్కుకు వెళ్లినప్పుడు తీసుకున్న తన ఫొటోను 'ఎక్స్'లో పోస్టు చేసింది.. నిండుగా డ్రెస్ చేసుకుని ముగ్ధమనోహరంగా ఉన్న ఆమె చిత్రాన్ని ఎంతో మంది లైక్ చేశారు.. కానీ కాసేపటికి చూసుకుంటే.. తన పోస్టు కింద తనవే అశ్లీల చిత్రాలు! అతి చిన్న వస్త్రాల్లో.. బికినీ ధరించినట్టుగా, స్విమ్‌సూట్ వేసుకున్నట్టుగా, పారదర్శక వస్త్రాల్లో ఉన్నట్టుగా అసభ్యకరంగా ఉన్న ఆ చిత్రాలను చూసి హతాశురాలైంది. 'ఎక్స్'కు అనుసంధానమై ఉన్న కృత్రిమ మేధ టూల్ 'గ్రోక్'తో సృష్టించిన చిత్రాలు అవి. యూజర్లు కేవలం ఒక చిన్న 'ప్రాంప్ట్ (సూచన)' ఇస్తే చాలు, వారు అడిగినట్టుగా చిత్రాలను 'గ్రోక్' మార్చేస్తోంది. చాలా మంది యూజర్లు ఎక్స్‌లో పోస్టు చేసిన మహిళలు, బాలికల ఫొటోల కింద.. 'గ్రోక్ ఈమెను బికినీలోకి మార్చు.. స్విమ్‌సూట్‌లోకి మార్చు.. గుండుతో ఉన్నట్టు మార్చు.. మీసాలు, గడ్డాలు పెట్టు..' ఇష్టమొచ్చినట్టు ప్రాంప్ట్ ఇస్తున్నారు. వారు అడిగినట్టుగా చిత్రాలను 'గ్రోక్' మార్చేస్తోంది. కొందరు యూజర్లు సోషల్ మీడియా యాప్‌ల నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న, నేరుగా తీసిన మహిళలు, బాలికల చిత్రాలను కూడా అప్‌లోడ్ చేసి అసభ్యంగా, అశ్లీలంగా మార్చుతున్నారు. ఇంటి పనులు, వంట పనులు చేస్తూ మహిళలు తీసుకున్న ఫొటోలు కూడా వీటిలో ఉన్నాయి. కొన్ని రోజులుగా ఎక్స్‌లో ఈ 'బికినీ' ట్రెండ్‌గా పిలుస్తున్న ఈ వ్యవహారం కొన్ని రోజులుగా 'ఎక్స్'లో ట్రెండింగ్‌గా మారింది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది.



క్షమాపణ చెబుతూనే..!

ఒక యూజర్ 12, 13 ఏళ్ల ఇద్దరు బాలికల చిత్రాలను బికినీలో ఉన్నట్టుగా మార్చాలని ప్రాంప్ట్ ఇస్తే.. గ్రోక్ అలా మార్చి పోస్టు చేసింది. "ఇది తప్పు కదా.." అని యూజర్లు 'గ్రోక్'ను ప్రశ్నిస్తే.. చట్టాల ప్రకారం, నైతికపరంగా ఇది తప్పే నని 'గ్రోక్' కూడా అంగీకరిస్తోంది. ఇందుకు క్షమాపణలు చెబుతున్నానంటూనే.. తాను కృత్రిమ మేధను కాబట్టి, యూజర్లు ఇస్తున్న ప్రాంప్ట్‌లకు అనుగుణంగా కంటెంట్ ఇస్తున్నానని సమాధానం చెబుతోంది. కానీ యూజర్లు అడిగిన కొద్దీ అసభ్యకరంగా చిత్రాలను మార్చుతూనే ఉంది. ఒక్క 'గ్రోక్' అనే కాదు.. చాలా కృత్రిమ మేధ టూల్స్ కూడా యూజర్లు అడిగినట్టుగా ఫొటోలను మార్చి ఇస్తున్నాయి.



మస్క్ బికినీలో ఉన్నట్టు గ్రోక్ సృష్టించిన ఫొటో

తన ఫొటోను 'బికినీ'లోకి మార్చుకున్న మస్క్!

ఎక్స్‌లో బికినీ ట్రెండ్‌పై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్న సమయంలో దీనిని ఎగతాళి చేస్తున్నట్టుగా 'ఎక్స్' యజమాని ఎలాన్ మస్క్ స్పందించడంపై విమర్శలు వస్తున్నాయి. ఒక యూజర్ పెట్టిన పోస్టులో తన ఫొటోను కూడా బికినీలోకి మార్చాలని మస్క్ ప్రాంప్ట్ ఇచ్చారు. దీనితో గ్రోక్ మస్క్ బికినీలో ఉన్నట్టుగా ఫొటోను సృష్టించి పోస్టు చేసింది. దీనికి సమాధానంగా 'పర్ఫెక్ట్' అంటూ మస్క్ కామెంట్ పెట్టడం గమనార్హం. కాగా, బికినీ ట్రెండ్‌పై విమర్శలు పెరగడం, భారత ప్రభుత్వం నోటీసులు ఇవ్వడంపైనా మస్క్ స్పందించారు. గ్రోక్‌ను ఉపయోగించి తప్పుడు, అశ్లీల కంటెంట్‌ను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సదరు ఖాతాలను శాశ్వతంగా తొలగిస్తామని చెప్పారు. అయితే "గ్రోక్ ఏఐ టూల్‌ను ఉపయోగించి అశ్లీల, అసభ్య, తప్పుడు కంటెంట్ సృష్టిస్తున్న వినియోగదారులదే తప్పు. ఏదైనా పెన్నుతో తప్పుగా రాస్తే.. ఆ తప్పు రాసేవారిదే అవుతుంది తప్ప పెన్నుది కాదు. మీరు ఎలాంటి ఇన్‌పుట్ ఇస్తారో దానికి తగినట్టుగా గ్రోక్ ఔట్‌పుట్ ఇస్తుందని గుర్తుంచుకోవాలి" అని మస్క్ వ్యాఖ్యానించారు.

అశ్లీలానికి అడ్డాగా 'ఎక్స్'!

చాలా సోషల్ మీడియా వేదికల్లో అశ్లీల కంటెంట్‌పై నియంత్రణ ఉంది. ఏ మాత్రం అశ్లీలంగా, అసభ్యంగా ఉన్నా.. ఫొటోలను, వీడియోలను, ఇతర కంటెంట్‌ను వెంటనే తొలగించేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఈ మేరకు తమ అల్గారిథమ్స్‌ను రూపొందించుకున్నాయి. కానీ 'ఎక్స్' మాత్రం చాలా వరకు అశ్లీల కంటెంట్‌ను అనుమతిస్తోంది. ఈ సామాజిక మాధ్యమం అందుబాటులో ఉన్న దేశాలన్నింటిలో కూడా ఆ అశ్లీల కంటెంట్‌ను పోస్టు చేసే, వీక్షించే అవకాశం ఉంది. 'ఎక్స్' తాము అనుసరించే మార్గదర్శకాలు, విధానాల పత్రంలోనే.. 'పరిమితి మేరకు అడల్ట్ కంటెంట్‌ను అనుమతిస్తున్నట్టుగా పేర్కొనడం గమనార్హం.

వరి ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే నంబర్ 1

» 15 కోట్ల టన్నుల దిగుబడితో చైనా కన్నా ముందంజ: శివరాజ్ సింగ్

న్యూఢిల్లీ, జనవరి 4: వరి ఉత్పాదనలో భారత్ ప్రపంచ ఖ్యాతిని ఆర్జించింది. చైనాను అధిగమించి ప్రపంచంలో నెంబర్ వన్‌గా నిలిచింది. మొత్తంగా 15.01 కోట్ల టన్నుల వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేసి ఈ ఘనత సాధించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం వెల్లడించారు. నూతన విత్తనాలను ఆవిష్కరించిన సందర్భంగా ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో రూపొందించిన 25 పంటలకు సంబంధించిన 184 రకాల అధిక దిగుబడి విత్తనాలను ఆయన విడుదల చేశారు. ఆహార కొరత ఉన్న స్థితి నుంచి ప్రపంచానికే ఆహారం అందించే స్థాయి వరకు దేశం ఎదిగిందని, ఇది ఘన విజయమని ప్రశంసించారు. "వరి ఉత్పత్తిలో భారత్..చైనాను అధిగమించింది. ప్రపంచంలోనే అత్యధిక వరి ఉత్పత్తిదారుగా ఎదిగింది. చైనా 14.52 కోట్ల టన్నుల వరిని ఉత్పత్తి చేయగా, భారత్ 15.01 కోట్ల టన్నులను ఉత్పత్తి చేసింది" అని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లకు బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని, దేశంలో సమృద్ధిగా బియ్యం నిల్వలు ఉన్నాయని చెప్పారు. నూతనంగా విడుదల చేసిన విత్తనాలను వెంటనే రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని శివరాజ్ సింగ్ అధికార్లను కోరారు. నూతనంగా అభివృద్ధి చేసిన విత్తనాలకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం 1969లో ప్రారంభమయిందని చెప్పారు. ఇంతవరకు 7,205 రకాల విత్తనాలకు నోటిఫికేషన్ ఇచ్చినట్టు తెలిపారు. 1969 నుంచి 2014 వరకు 3,969 విత్తనాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, మోదీ ప్రభుత్వం హయాంలో 3,236 అధిక దిగుబడి విత్తనాలకు నోటిఫికేషన్ ఇచ్చినట్టు వివరించారు.

మార్చి 3న చంద్ర గ్రహణం

మూతపడనున్న తిరుమల ఆలయ ద్వారాలు

తిరుమల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం కారణంగా మార్చి 3వ తేదీ ఉదయం 9 నుంచి రాత్రి 7.30 గంటల వరకు తిరుమల శ్రీవారి ఆలయ తలుపులు మూసివేయనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3.20 గంటలకు గ్రహణం ప్రారంభమై సాయంత్రం 6.47 గంటలకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా తలుపులు మూసివేయడం ఆనవాయితీ. రాత్రి 7.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం 8.30 గంటల నుంచి దర్శనాన్ని తిరిగి ప్రారంభిస్తారు. గ్రహణం కారణంగా మార్చి 3న అష్టదళపాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

కొనసాగుతున్న వైకుంఠ ద్వార దర్శనాలు

తిరుమల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు శనివారం 88,662 మంది శ్రీవారిని దర్శించుకుని వైకుంఠద్వార ప్రవేశం చేశారు. అలాగే హుండీ ఆదాయం రూ.5.05 కోట్లు లభించినట్టు టీటీడీ ప్రకటించింది. ఇక, తిరుమలలో రద్దీ సాధారణంగా ఉంది. సర్వదర్శనాలు ప్రారంభమైన శుక్రవారం మినహా శని, ఆదివారాల్లో కూడా రద్దీ తక్కువగానే ఉంది. కేవలం కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు తప్ప అదనపు క్యూలైన్లు ఖాళీగానే ఉన్నాయి. వచ్చిన భక్తులు వచ్చినట్టుగా దర్శనానికి పంపుతూ, ఎక్కడా క్యూలైన్లు ఆగకుండా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటున్నారు.



స్వామివారు వైపు నిలబడి ఆ పూల చెండును పట్టుకుంటున్న అర్చకులు

తిరుమలలో వైభవంగా ప్రణయ కలహోత్సవం

తిరుమల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం సాయంత్రం ప్రణయ కలహోత్సవం వైభవంగా జరిగింది. ఏటా వైకుంఠ ఏకాదశికి సరిగ్గా ఆరో రోజున, అధ్యయనోత్సవాల్లో 17వ రోజున ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. సాయంత్రం 4 గంటలకు మలయప్ప స్వామి పల్లకిపై పుష్కరిణి వద్దకు వచ్చారు. అమ్మవార్లు చెరొక పల్లకిపై అప్రదక్షిణంగా స్వామివారికి ఎదురు వచ్చారు. పురాణ పఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరుపున జీయంగార్లు పూలచెండ్లను స్వామిపై మూడుసార్లు విసిరారు. స్వామి బెదిరినట్టుగా నటించి తానేమి తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడడంతో, అమ్మవార్లు శాంతించి స్వామికి ఇరువైపులా చేరి కర్పూర హారతులు అందుకుని ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీయర్ స్వాములు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసులో.. ముగిసిన జోగి సోదరుల కస్టడీ

» నేడు విజయవాడ జైలుకు తరలింపు

అన్నమయ్య/ములకలచెరువు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్(ఏ-32), ఆయన సోదరుడు రాము (ఏ-33) కస్టడీ విచారణ ఆదివారంతో ముగిసింది. దీంతో వీరిద్దరిని విజయవాడ నుంచి ప్రత్యేక బలగాల మధ్య రాత్రి 9.30 గంటల సమయంలో తంబళ్లపల్లె కోర్టుకు తీసుకొచ్చారు. వీరిద్దరినీ మూడ్రోజులు కస్టడీకి ఇస్తూ తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఈ నెల 2వతేదీన విజయవాడ జైలులో ఉన్న జోగి సోదరులను ఎక్సైజ్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. సుదీర్ఘంగా విచారించి కీలక విషయాలు రాబట్టారు. ఆదివారం కస్టడీ ముగియడంతో తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరచి.. మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. సోమవారం ఉదయం తిరిగి విజయవాడ జైలుకు తీసుకెళ్లనున్నారు. కాగా.. తంబళ్లపల్లె కోర్టుకు జోగి రమేశ్ కుమారుడు రాజీవ్, వైసీపీ తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి వచ్చారు. కోర్టులోకి వచ్చిన రమేశ్‌తో వీరిద్దరూ మాట్లాడారు. మరోవైపు.. జోగి సోదరులను కోర్టుకు తీసుకొస్తున్నారని తెలిసి వైసీపీ కార్యకర్తలు అక్కడకు తరలివచ్చారు. వారు లోపలకు వెళ్లేందుకు ప్రత్నించగా పోలీసులు మూడు చోట్ల బ్యారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు.

బాలిక కిడ్నాప్.. 9 మంది యువకుల అరెస్టు

మంగళగిరి సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దౌర్జన్యంగా ఇంట్లోకి చొరబడి 16 ఏళ్ల బాలికను బలవంతంగా ఎత్తుకు వెళ్లిన కేసులో నిందితులను గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. మంగళగిరి అర్బన్ సీఐ కె.వీరాస్వామి తెలిపిన వివరాలు... రవితేజ అనే యువకుడు విజయవాడకు చెందిన తన స్నేహితులతో కలిసి శనివారం సాయంత్రం మంగళగిరి గండాలయపేటలోని బాలిక ఇంట్లోకి ప్రవేశించాడు. బాలిక తల్లిదండ్రుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరించి బాలికను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళ్లిపోయారు. బాలిక తల్లి మంగళగిరి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తుళ్లూరులో ఉన్నట్టుగా గుర్తించి పోలీసులు ఆదివారం ఉదయం రక్షించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించామని సీఐ వీరాస్వామి చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా వున్న రవితేజను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని, మిగతా ఎనిమిది మంది నిందితులను విజయవాడ పోలీసు స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు.

2 వారాలకో భాష కనుమరుగు!

(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర సమాచారాన్ని అందించే ఒక ప్రసిద్ధి డేటాబేస్ ప్రకారం ప్రతి రెండు వారాలకు ఒక భాష కనుమరుగైపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. 21వ శతాబ్దం చివరికి ప్రపంచ భాషల్లో సగానికి పైగా అంతరించే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వాటిని కాపాడుకోవడానికి, విస్తృత వ్యాప్తి కల్పించడానికి కృత్రిమ మేధస్సు(ఏఐ), డిజిటల్ వేదికలు, బహుభాషా విద్యాభ్యాసాలు అసాధారణ సాధనాలుగా ఉపయోగపడుతున్నాయన్నారు. గుంటూరు శివారులో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు రెండో రోజైన ఆదివారం గోకుల్ తన సతీమణి బృందా గోకుల్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. తరతరాల మధ్య భాషా సంక్రమణలో ఉన్న ప్రధాన లోపాలను కూడా ఏఐ సాధనాలు బయటపెడుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు క్వాంటమ్ టెక్నాలజీ కోర్సులను ప్రవేశపెట్టి యువతకు భావితరం నైపుణ్యాలను అందించేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో డిజిటల్ వేదికల ద్వారా ఏఐపై అవగాహన కల్పిస్తున్నందుకు సీఎంను అభినందించారు. 'చంద్రబాబు మారిషస్, ఇతర దేశాలతో సాంస్కృతిక, విద్యా సంబంధాల బలోపేతంలో కీలక పాత్ర పోషించారు. 2003లో ఆయన మారిషస్ సందర్శించినప్పుడు పాలన, విద్య, అభివృద్ధిపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. మన ఉమ్మడి భాషా, సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడం ముఖ్య ప్రాధాన్యాంశంగా చేసుకోవాలి' అని తెలిపారు.

50 దేశాల్లో తెలుగు వాడకం..

ప్రపంచ చరిత్రలో ఒక కీలక సమయంలో ఈ మహాసభ జరుగుతోందని గోకుల్ అన్నారు. దేశంలో అత్యధిక జనాభా మాట్లాడే మూడో భాష తెలుగు. ఇది ఇప్పుడు 50 దేశాల్లో వాడుకలో ఉంది. మారిషస్ నుంచి కూడా మా ప్రతినిధి బృందం ఇక్కడకు వచ్చినందుకు అభినందిస్తున్నాను. మా దేశంలో తెలుగు భాష, సంస్కృతి మా జీవితంలో అంతర్భాగమయ్యాయి. మా పూర్వీకులు పుణ్యభూమి భారతం నుంచి మారిషస్ వచ్చి వారి భాషలను కాపాడుకుని.. సంప్రదాయాలు, విలువలను నిలబెట్టుకుని.. సగౌరవంగా భావితరాలకు అందించారు. రాజనీతికి మించిన సంబంధాన్ని నిలబెట్టేది ప్రజల మధ్య ఉన్న బలమైన, శాశ్వత అనుబంధమే' అని స్పష్టం చేశారు. మారిషస్‌లోని తెలుగు సమాజం తమ దేశ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషిస్తోందని గోకుల్ వెల్లడించారు. అక్కడ తెలుగు భాషను ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయుల్లో అధికారిక విద్యా వ్యవస్థలో బోధిస్తున్నామన్నారు.



తెలుగు మహాసభలో మాట్లాడుతున్న ధరంబీర్ గోకుల్

ఏపీ అవతరణ దినోత్సవం మాకు వేడుక

'ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నవంబరు 1న మారిషస్‌లో తెలుగు సమాజానికి మరో ముఖ్యమైన సాంస్కృతిక వేడుక. ఆ రోజు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉగాది పర్వదినం రోజున జాతీయ సెలవుదినంగా ప్రకటించాం. మారిషస్‌లోని హరిహర దేవస్థానంలో 108 అడుగుల అతి పెద్దదైన శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహం ఉంది' అని చెప్పారు.

భారత మిత్ర అవార్డు ప్రదానం

కాగా.. గోకుల్‌కు ఆంధ్ర సారస్వత పరిషత్ తరపున 'భారత మిత్ర' అవార్డును ప్రదానం చేశారు. పంచలోహ వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. గజమాలతో గోకుల్ దంపతులను ఘనంగా సత్కరించారు. పలువురికి ఆయన మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మారిషస్ హరిహర దేవస్థానం నుంచి బృందావన్ పార్థసారథి, ఉత్తరాఖండ్ జోషిమఠ్ ఉత్తరాధికారి ముకుందానంద్ గిరి, మెట్రో ఇండియా చైర్మన్ సీఎల్ రాజం, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, మహాసభల సమన్వయకర్త పి.రామచంద్రరాజు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న సభలు

ప్రపంచ తెలుగు మహాసభలు సోమవారం సాయంత్రం ముగియనున్నాయి. ఉదయం జరిగే సభలో సీఎం చంద్రబాబు, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగిస్తారు. మధ్యాహ్నం నుంచి జరిగే కార్యక్రమాలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఇతర ప్రముఖులు హాజరవుతారు.

భాషా పరిరక్షణ మన ఇంటి నుంచే ప్రారంభమవ్వాలి: త్రిపుర గవర్నర్

గుంటూరు(తూర్పు), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భాషా పరిరక్షణ మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని.. ప్రతి ఒక్కరూ ఇళ్లలో, కుటుంబ సభ్యులు మాతృభాషలో మాట్లాడటానికే ప్రాధాన్యం ఇవ్వాలని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి జరిగిన తెలుగు వైభవ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. త్రిపురలో బాధ్యతలు తీసుకున్న వెంటనే తెలుగు వారిని గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వారిని ఒకే వేదికపైకి తెచ్చి సమావేశాలు నిర్వహించామన్నారు.

తదుపరి తెలుగు మహాసభలు మారిషస్‌లో

2027 జనవరి 8, 9, 10 తేదీల్లో నిర్వహణ

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తదుపరి ప్రపంచ తెలుగు మహాసభలు మారిషస్ దేశంలో 2027 జనవరి 8, 9, 10 తేదీల్లో జరగనున్నాయి. మారిషస్ నుంచి వచ్చిన ప్రతినిధి బృందంతో ఆ దేశ అధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ సమక్షంలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఒప్పందం చేసుకుంది. ఆ మహాసభలకు అందరికీ ఆహ్వానాలు పంపుతామని, అక్కడికి వెళ్లే విమానాలు తెలుగు భాషా ప్రియులతో నిండిపోవాలని సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు.

మల్లన్న సన్నిధిలో జస్టిస్ సుబేందు సమంత



జస్టిస్ సుబేందు సమంత దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో

శ్రీశైలం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబేందు సమంత దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజ లు నిర్వహించి ప్రాకారంలోని పరివార ఆలయాలు కూడా దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రాకార మండపంలో జస్టిస్ సుబేందు సమంత దంపతులకు వేదపండితులు వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు.. ఈవో శ్రీనివాసరావు పరిమళ విభూది, శేష వస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

అప్పన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



కప్పస్తంభం వద్ద జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ హరిహరనాథ్‌శర్మ, జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు

సింహాచలం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ ఎ.హరిహరనాథ్ శర్మ, జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు ఆదివారం సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. తొలుత వీరికి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్.సుజాత, ఏఈఓ కె.తిరుమలేశ్వర రావు, పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాస్ ఆలయ ఆచారం ప్రకారం స్వాగతం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న అనంతరం న్యాయమూర్తుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేష వస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా అధికారులు స్వామివారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.

భారతీయ సంస్కృతికి మూలం వేదాలు: జస్టిస్ లక్ష్మణరావు



జస్టిస్ లక్ష్మణరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి మూలం వేదాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణ రావు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా దువ్వ గ్రామంలోని శ్రీ పర్వతవర్ధని సమేత శ్రీ నాగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 17వ వేద సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదపండితులను సత్కరించడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన వేద పండితులతో పాటు జస్టిస్ లక్ష్మణరావు దంపతులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సత్కరించారు.



రైలు బోగీపైకి ఎక్కి కూర్చున్న యువకుడు

రైలుపైకి ఎక్కి యువకుడి హల్‌చల్

» శ్రీకాకుళం జిల్లా కంచిలి రైల్వేస్టేషన్‌లో ఘటన

» 20 నిమిషాలు నిలిచిన భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్

కంచిలి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కంచిలి రైల్వేస్టేషన్‌లో ఓ యువకుడు రైలు పైకి ఎక్కి పరిగెడుతూ హల్‌చల్ చేశాడు. ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కంచిలి రైల్వేస్టేషన్‌కు భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చి ఆగింది. అప్పుడు పశ్చిమ బెంగాల్‌కు చెందిన విజయ్ సర్కార్ అనే యువకుడు రైలు బోగి పైకి ఎక్కాడు. అటూ.. ఇటూ పరుగులు పెట్టాడు. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. దీనిని గమనించి రైల్వే అధికారులు ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పోలీసుల సహాయంతో ఆ యువకుడిని కిందకు దించారు. అతడి వద్ద విశాఖ-హౌరా మెయిల్ టికెట్ లభించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆ యువకుడు మతిస్థిమితం లేనివిధంగా ప్రవర్తించడంతో.. స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. స్టేషన్ మాస్టర్ బలరాం బెహరా సమాచారం మేరకు స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. యువకుడి హల్‌చల్ కారణంగా రైలు సుమారు 20 నిమిషాలపాటు కంచిలి స్టేషన్‌లో నిలిచిపోయింది.

టెట్‌పై జాతీయ స్థాయిలో ఉమ్మడి పోరాటం: ఎస్టీయూ

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు కోసం జాతీయ స్థాయిలో ఉమ్మడి పోరాటం చేయనున్నట్టు రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లు రఘునాథరెడ్డి, ఎల్.సాయి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జైపూర్‌లో జరిగిన ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొన్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో టెట్ మినహాయింపునకు చట్ట సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసినట్టు తెలిపారు. జాతీయ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ నిర్లక్ష్యం వల్లే ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ తప్పనిసరి అనే తీర్పు వచ్చిందని అభిప్రాయపడ్డారు.

సీఐటీయూ అఖిల భారత అధ్యక్షుడిగా సుదీప్‌దత్తా

» 425 మందితో జాతీయ కార్యవర్గం ఎన్నిక



సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎలమరం కరీం, అధ్యక్షుడు సుదీప్ దత్తా

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) అఖిల భారత అధ్యక్షుడిగా సుదీప్ దత్తా, ప్రధాన కార్యదర్శిగా ఎలమరం కరీం ఎన్నికయ్యారు. విశాఖలో గత నెల 30న ప్రారంభమైన సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా 425 మందితో నూతన జాతీయ కార్యవర్గాన్ని, 125 మందితో వర్కింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడిగా సుదీప్ దత్తా, ప్రధాన కార్యదర్శిగా ఎలమరం కరీం, కోశాధికారిగా ఎం.సాయిబాబు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఏఆర్ సింధు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా తపన్ సేన్, కె.హేమలత సహా 13 మంది, కార్యదర్శులుగా స్వదేశ్ దేవరాయ్, కశ్మీర్ సింగ్ ఠాకూర్, జి.సుకుమారన్ సహా 23 మంది ఎన్నికయ్యారు. శాశ్వత ఆహ్వానితులుగా ఏకే పద్మనాభన్, మాణిక్ డే, ఏవీ నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కమిటీలో తెలుగు రాష్ట్రాల నుంచి సీహెచ్ నరసింగరావు, జి.బేబీరాణి, ఏవీ నాగేశ్వరరావు, ఎం.సాయిబాబు, చుక్కా రాములకు చోటు దక్కింది.

ఉద్యోగుల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

» రాష్ట్ర బీసీ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత

» విజయవాడలో ఘనంగా బీసీ, ఓబీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ



జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు సవిత, కొల్లు రవీంద్ర, ఉద్యోగ సంఘాల నాయకులు

విజయవాడ అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల హక్కుల పరిరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులే ప్రభుత్వానికి వారధులన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన బీసీ, ఓబీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి సవితతో పాటు మరో మంత్రి కొల్లు రవీంద్ర, బీసీ, ఓబీసీ ఉద్యోగ సంఘాల నాయకులు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సవిత మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆశయాలను రాష్ట్రంలో అమలు చేసిన తొలి నాయకుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని కొనియాడారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించి, వారు రాజకీయంగా, పారిశ్రామికంగా ఎదిగేలా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆ ఒరవడిని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనసాగిస్తూ బీసీ ఉద్యోగుల పక్షపాతిగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని రాష్ట్రస్థాయిలో ఘనంగా నిర్వహించేలా ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా బీసీ, ఓబీసీ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా అమరావతిలో మహాసభ జరగడం చారిత్రాత్మకమని తెలిపారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక 'బీసీ రక్షణ చట్టం' తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని వెల్లడించారు. బీసీ ఉద్యోగులతో 26 జిల్లాల కమిటీలను వేయడం అభినందించాల్సిన విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు అమలుచేస్తున్న పథకాలను ఐదేళ్లు సద్వినియోగం చేసుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని పేర్కొన్నారు. బీసీ ఉద్యోగుల సంఘం నేత గుత్తుల వీరబ్రహ్మం మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి అయిన ఏప్రిల్ 11ను ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని, బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు, క్రీమీలేయర్ తొలగింపు, బీసీ అట్రాసిటీ చట్టం అమలు చేయాలని కోరారు. అనంతరం వారు బీసీ ఉద్యోగుల క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ, బీసీ, ఓబీసీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కేదారేశ్వర రావు, జనరల్ సెక్రటరీలు పి.శ్రీధర్, భూషణ్‌రావు, ట్రెజరర్ వై.శంకర రావు, 26 జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వదేశీ నావికా సామర్థ్యాల తీరు భేష్

» తూర్పు నావికాదళంలో 'ఐఎన్ఎస్ హిమగిరి' సబ్ మెరైన్‌ను సందర్శించిన జిష్ణుదేవ్ వర్మ



తూర్పు నావికాదళంలో ఐఎన్ఎస్ హిమగిరి సబ్ మెరైన్ సందర్శనకు వచ్చిన తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర భారత్‌లో భాగంగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తూర్పు నావికా దళం సామర్థ్యం పెంపు కోసం కార్యాచరణ రూపొందించి అమలుచేయడం అభినందనీయమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ఆదివారం తూర్పు నావికా దళం ప్రధాన కార్యాలయం సందర్శనలో భాగంగా అధునాతన స్టెల్త్ ఫ్రిగేట్ కల్వరి క్లాస్ సబ్‌మెరైన్ 'ఐఎన్ఎస్ హిమగిరి'ని ఆయన సందర్శించారు. భారత నావికా ఇంజనీరింగ్ సామర్థ్యంతో నిర్మించిన ఈ సబ్ మెరైన్ పనితీరును ఆయన ప్రశంసించారు. దేశ సముద్ర జలాల రక్షణలో తూర్పు నావికా దళం సామర్థ్యం పెంపుదలకు స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన సబ్ మెరైన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దేశ నావికా దళంలో తూర్పు నావికా దళం పోషిస్తున్న పాత్రను ఆయన మెచ్చుకున్నారు. నిరంతరం సముద్ర జలాల్లో నిఘా కొనసాగించడంలో నావికా దళాల అచంచలమైన అంకితభావంతో ఇండో పసిఫిక్ ప్రాంతంలో భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తూర్పు నావికా దళం పనితీరు, సబ్ మెరైన్‌లో అత్యాధునిక స్టెల్త్ డిజైన్, అందులోని ఇంటిగ్రేటెడ్ అడ్వాన్స్‌డ్ కంబాట్ సిస్టమ్ ప్రాధాన్యతను నావికా దళ ఉన్నతాధికారులు గవర్నర్‌కు వివరించారు. ఐఎన్ఎస్ హిమగిరిలో తన అనుభవాలను గుర్తుచేస్తూ జిష్ణుదేవ్ వర్మ అక్కడ డైరీలో సంతకం చేశారు.

తిరుమలలో ఖాళీ మద్యం సీసాల కలకలం



తిరుమల/తిరుపతి(నేరవిభాగం), జనవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఖాళీ మద్యం సీసాలు కనిపించడం కలకలం సృష్టించింది. గరుడ పోలీస్ విశ్రాంతి భవనం వద్ద ఇవి కనిపించాయి. నిబంధనలకు విరుద్ధంగా తిరుమలకు మద్యం వస్తుంటే నిఘా వ్యవస్థ ఏం చేస్తోందని, ఇప్పటికే మద్యం సేవించిన వారు పలు ఘర్షణలకు కూడా దిగారంటూ కొన్ని ఫొటోలు వైరల్ అవుతున్నాయి. దీనికి టీటీడీ స్పందించి ప్రకటన విడుదల చేసింది. 'బాలాజీ నగర్‌కు ఆనుకుని ఉన్న ఔటర్ రింగు రోడ్డు సమీపంలోని చెట్ల మధ్య కొన్ని ఖాళీ మద్యం బాటిళ్లను కనుగొన్నాం. సీసీ టీవీల ద్వారా ఇందుకు కారణమైన సంబంధిత వ్యక్తులపైనా, అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపైనా చర్యలు తీసుకుంటాం' అని పేర్కొంది. దీనిపై తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు స్పందించారు. పోలీసు అతిథి గృహం వద్ద మద్యం బాటిళ్లు లభించినట్టు ప్రచారం అవుతోందని, నిజానికి అతిథి గృహానికి ఎలాంటి సంబంధం లేదని ఒక ప్రకటనలో తెలిపారు. అతిథి గృహం ఆ ప్రదేశానికి సుమారు 50 అడుగుల ఎత్తులో గుట్టపై ఉందన్నారు. ఆ మద్యం బాటిళ్లు పాతవిగా కనిపిస్తున్నాయని, ఎవరైనా తాగి యాదృచ్ఛికంగా పడేశారా లేదా ఉద్దేశపూర్వకంగా పాత బాటిళ్లు తీసుకొచ్చి పెట్టారా? అనేది సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తామని పేర్కొన్నారు.

బ్రిజినందన్ శర్మ మృతి పట్ల సంతాపం: ఏపీటీఎఫ్

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యా సంఘాల సమాఖ్య పూర్వాధ్యక్షుడు కామ్రేడ్ బ్రిజినందన్ శర్మ మృతి పట్ల ఏపీటీఎఫ్ సంతాపం తెలియజేసింది. ప్రపంచవ్యాప్తంగా ఎడ్యుకేషనల్ ఇంటర్నేషనల్ సంస్థ విస్తరణలో ఆయన కీలక పాత్ర పోషించారని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 105 సంవత్సరాల వయసులోనూ ఆయన సంస్థకు మార్గనిర్దేశం చేస్తూ, నాయకత్వం వహించారన్నారు.

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



ఆటస్థలి

నువ్వూ నేనూ చేతులు కలిపిన చోట
కాకినాడ సముద్రపాకంలో కాజా
నీ గుప్పిడి మీద నా గుప్పిడి
ఒకరి చేతిమీద ఒకరు
అలా పెంచుకుంటూ పోతామా
ప్రత్యక్షమౌతుంది గుప్పిళ్ల పర్వతం.
దాన్తోనే చిలుకుతాం విశాఖ పాల సముద్రం
గరళామృతాన్ని కాక్‌టెయిల్ చేసుకు తాగేస్తాం
విరగబడే నవ్వులూ వెక్కిళ్లతో ఏడుపులూ
గోడల మీద మన నీడల మధ్య
తూలుతూ ఉన్మత్తంగా ఆడుతూ
ఒకరి జాన మీద మరొకరి జాన
అలా పేర్చుకుంటూ పోతే దీపాల చెట్టు

ఎప్పుడైనా సరే
రెండు చేతులు ఒక ఊహని సృష్టించినపుడు
చేతుల పర్వతం మీద దీపాల చెట్టు విరగబూస్తుంది
కావల్సినన్ని దీపాలు కోసుకుని
ఊరు ఊరుకీ నక్షత్రాల్ని పంచుకుంటూ రావచ్చు
ఆడుకోడానికి అలా ఉంచు
నా చేతి మీద నీ చెయ్యి
నా జాన మీద నీ జాన, అంతే చాలు

■ వసీరా
✆ 91777 27076

మహిళల ఆత్మకథలు, జీవిత చరిత్రలపై సదస్సు

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, కోఠి, హైదరాబాద్ కేంద్రంగా 'మహిళల ఆత్మకథలు, జీవిత చరిత్రలు – సమాలోచనం' రెండు రోజుల సదస్సు జనవరి 6, 7 తేదీల్లో జరుగుతుంది. వీసీ సూర్యాధనంజయ్ నేతృత్వంలో జరిగే సదస్సులో ముఖ్య అతిథి యోగితారాణా, ఐఏఎస్ (ప్రిన్సిపల్ సెక్రటరీ విద్యాశాఖ, తెలంగాణ); విశిష్ట అతిథి శ్రీమతి ఎ. దేవసేన (కమిషనర్ కళాశాల విద్యాశాఖ, తెలంగాణ). ఈ సదస్సులో కాత్యాయని విద్మహే, సి. మృణాళిని, గోగు శ్యామల, జూపాక సుభద్ర, అపర్ణ తోట, జి.వి. రత్నాకర్, గంపా వెంకట రామయ్య, జె. వెంకట రమణ తదితరులు పాల్గొంటారు.

ఎస్. రఘు

టి.ఎల్. కాంతారావు స్మారక పురస్కారాల ప్రదానం

తలగడదీవి లక్ష్మీకాంతారావు (టి.ఎల్. కాంతారావు) స్మృతిలో ఏర్పాటు చేసిన సాహిత్య పురస్కారాలకు, 2025 సంవత్సరానికి మృణాళిని విమర్శలోనూ, నంద కిశోర్ కవిత్వంలోను ఎంపికయ్యారు. పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరికీ రూ.50 వేల నగదు పురస్కారం, సత్కారం ఉంటాయి. ఈ సందర్భంగా టి.ఎల్. కాంతారావు సమగ్ర సాహిత్యం ఆవిష్కరణ ఉంటుంది. జనవరి 10 సా.6 గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరిగే ఈ సభలో చినవీరభద్రుడు, కోడూరి విజయ్ కుమార్, రావులపాటి సీతారాం, చామర్తి మానస పాల్గొంటారు.

తలగడదీవి శైలజ

కలేకూరి ప్రసాద్ పురస్కారం

కలేకూరి ప్రసాద్ స్మారక పురస్కారానికి 2023 నుంచి 2025 వరకు ప్రచురితమైన అనువాద కవిత, అనువాద కథా సంపుటాలు 4 కాపీలు జనవరి 20 లోపు పంపాలి. ఫిబ్రవరి 2026లో జరిగే పురస్కార ప్రదానంలో రూ.15వేల నగదు, మెమెంటోతో సత్కారం ఉంటుంది. చిరునామా: పి.శ్రీనివాస్‌గౌడ్, 5–3–129/1, రోడ్ నెం: 2, బిల్డింగ్ నెం: 30, రామాలయం వీధి, శాంతి నగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ – 500 072, ఫోన్: 99494 29449.

పి. శ్రీనివాస్ గౌడ్

ఏటూరి వెంకయ్య నాయుడు & శకుంతలమ్మ స్మారక పురస్కారం

ఏటూరి వెంకయ్య నాయుడు & శకుంతలమ్మ స్మారక పురస్కారానికి 2023 నుంచి 2025 వరకు ప్రచురితమైన కవితా సంపుటాలు 4 కాపీలు జనవరి 20 లోపు పంపాలి. ఫిబ్రవరిలో జరిగే పురస్కార ప్రదానంలో రూ.10వేల నగదు, మెమెంటోతో సత్కారం ఉంటుంది. చిరునామా: పి.శ్రీనివాస్‌గౌడ్, 5–3–129/1, రోడ్ నెం: 2, బిల్డింగ్ నెం: 30, రామాలయం వీధి, శాంతి నగర్, కూకట్ పల్లి, హైదరాబాద్ – 500 072, ఫోన్: 99494 29449.

ఏటూరి నాగేంద్రరావు

కొలకలూరి పురస్కారాలు

2026 సంవత్సరానికి కొలకలూరి భాగీరథీ కథానిక పురస్కారం, కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం, కొలకలూరి రామయ్య విమర్శ పురస్కారాలకు ఆయా ప్రక్రియల్లో 2024 జనవరి 1 తర్వాత మొదటిసారి ప్రచురితమై గ్రంథాలు నాలుగేసి ప్రతులను పంపాలి. ఒక్కో పురస్కారానికి నగదు బహుమతి రూ.20వేలు. రచయితలు/ ప్రచురణకర్తలు గ్రంథాలను జనవరి 15లోపు పంపాలి. కథా సంపుటాలను, నవలలను పంపే చిరునామా: కొలకలూరి మధుజ్యోతి (ఫోన్:94419 23172), తెలుగు శాఖాధ్యక్షులు & పరీక్ష విభాగం డీన్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి– 517502. విమర్శనా గ్రంథాలను పంపే చిరునామా: కొలకలూరి సుమకిరణ్ (ఫోన్: 99635 64664), ఆంగ్లాచార్యులు, అధ్యక్షులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి – 517502.

కొలకలూరి ఇనాక్

కళింగాంధ్ర కథావార్షిక 2025కు కథలు సూచించండి

కళింగాంధ్ర జీవన ఆకాంక్షలను, భావోద్వేగాలను, ఆలోచన సరళిని, ప్రాపంచిక దృక్పథాన్ని ఒడిసి పట్టుకునే ప్రయత్నంగా, అట్టాడ అప్పల నాయుడు, గంటేడ గౌరునాయుడు సంపాదకత్వంలో వస్తున్న 'కళింగాంధ్ర కథ 2025' సంకలనానికి 2025 జనవరి నుంచి డిసెంబరు వరకు వివిధ మాధ్యమాలలో, అంటే ప్రింట్ లేదా డిజిటల్ పత్రికలలో, ప్రచురితమైన వాటిలో మీకు నచ్చిన కథను sikkolubooks@gmail.com మెయిల్ లేదా 99892 65444 నెంబరుకు వాట్సాప్ ద్వారా సూచించగలరు. ఈ కథా సంకలనంతో పాటు ప్రచురితం కానున్న కళింగాంధ్ర కథకుల డైరక్టరీ కోసం వర్తమాన కళింగాంధ్ర కథకులు తమ పేరు, ఫోన్ నెంబర్లను నమోదు చేసుకోవలసిందిగా విజ్ఞప్తి.

సిక్కోలు బుక్స్

సంప్రదాయానికీ అభ్యుదయానికీ విమర్శనా వారధి



అతనొక మంచి అధ్యయనశీలి. అభ్యుదయ సాహిత్య విమర్శకుల్లో గణింపదగ్గ వ్యక్తి. సాహిత్యం ఎరిగిన వారే మరచిపోయిన సాహితీవేత్త. పేరు చెప్పగానే సినిమా నటుడు గుర్తుకువచ్చే ప్రమాదం ఉన్న రచయిత. ఆయన టి.ఎల్. కాంతారావు.

"మంచి చెడులను సమదృష్టితో వీక్షించలేని బలహీనత విమర్శలో ప్రవేశించి అది క్రమంగా ప్రక్రియను కూడా బలహీనం చేసేటంత దుస్థితికి దిగజారుతుంది."

"ఏ మహాకవికైనా ఉండవలసిన లక్షణాలు రెండే రెండు. ఒకటి– తనకు పూర్వమున్న సమాజంలో ఉద్భవించిన సాహిత్య ప్రక్రియల సంపూర్ణ అవగాహన. రెండు– తన కాలంనాటి సాంఘిక పరిస్థితుల ప్రాబల్యం, భవిష్యత్కాలంలో వికసించవలసిన సంఘ స్వరూపం – ఈ రెంటి సమ్మేళనం వలన ఆ కవి యొక్క సిద్ధాంతభావన అనితరసాధ్యంగా కవిత్వంలో రూపుకట్టడం."

– ఇటువంటి గుర్తుంచుకోదగ్గ వ్యాఖ్యలు, నిర్వచనాలు అనేకం చేసిన కాంతారావు గారి గురించి ఈ కొన్ని మాటలు.

తెలుగుసాహిత్యం కొందరు కవులను, రచయితలను విస్మరించినట్టే విమర్శకులనూ మర్చిపోయింది. అందులోనూ సహృదయంతో, సమన్వయంతో, సమతూకంతో విమర్శించేవారిని మరిచిపోవడం సులువు కూడ. అలాంటి సమన్వయశీలి అయిన విమర్శకులు టి.ఎల్. కాంతారావు.

కాంతారావు ఎక్కువ చదివారు. తక్కువ రాశారు. 1943లో జన్మించి, 1990లో మరణించిన ఆయన విమర్శనే తన సాహిత్యప్రక్రియగా ఎంచుకున్నారు. ఆయన రచించిన ఐదు విమర్శ గ్రంథాల్లోనూ సాహిత్య పాఠకులు, కవులు, రచయితలకు మాత్రమేకాక, విద్యార్థులకు కూడా తెలుసుకోవలసిన అంశాలుంటాయి. ఈ పుస్తకాల్లో ఒక్క 'సాహిత్యంలో సంప్రదాయం–ప్రగతి'ని చూసినా ఇది అర్థమవుతుంది. దీని తొలి ప్రచురణ 2009లో జరిగింది. 27 వ్యాసాల ఈ సంకలనంలో సగానికి పైగా శ్రీశ్రీ పైనే. ఈ చిన్న వ్యాసం ఈ పుస్తకానికే పరిమితం.

కాంతారావుగారి విమర్శలో ప్రధాన గుణాలు స్పష్టత, సరళత. ఎంచుకున్న విషయంలోకి సూటిగా వెళ్లడం, తన అభిప్రాయాలను సోదాహరణంగా చెప్పడం, వాటి సమర్థనకు అవసరమైన ఆధారాలు చూపడం. తన వ్యాఖ్యలకు పాఠ్యంలో నుంచే అంతర్గత సాక్ష్యాలను విరివిగా ఇవ్వడం. ఇక విమర్శలో ఆయన బలమూ, బలహీనతా శ్రీశ్రీయే.

"భూతభవిష్యత్ వర్తమానాల సమ్యగ్దృష్టిలోంచి అతి లోకోత్తరమైన నవ్యసృష్టిని చేయగలిగినవాడు మాత్రమే యుగకర్త కాగలడు." –శ్రీశ్రీని యుగకర్తగా ప్రతిపాదిస్తూ ఆయన చెప్పిన మాటలివి. బహుశా శ్రీశ్రీ లాగే వీరు కూడా "సంప్రదాయం నిలిచే వుంటుంది హమేషా" అని నమ్మారు. అందుకే– "సత్సంప్రదాయం ఎప్పుడూ మార్పును అంగీకరిస్తుంది. సంప్రదాయ శబ్దం విపులార్థంతో కూడుకుని ఉంది. మనకిష్టంలేనివారిని దూషించడానికి, ఇష్టంలేని ప్రక్రియల్ని తిరస్కరించడానికి ఆ శబ్దాన్ని అడ్డం పెట్టుకోడం ఆత్మవంచనకన్న మహా ఘోరం" అన్నారు. సంప్రదాయం గురించి ఇలా చెప్పిన అభ్యుదయ విమర్శకులు అరుదే.

"సంప్రదాయం సజీవమైనదో, నిర్జీవమైనదో నిర్ణయించేటప్పుడు ప్రామాణికంగా గ్రహించవలసిన అంశం ఆ కాలంలో ఆనాటి వ్యవస్థలో నివసిస్తున్న శతాధిక ప్రజా హృదయాల స్పందన" అనడంలో సంప్రదాయనిరసన మొదట ప్రజల్లోంచే వస్తుందనీ, కేవలం కొందరు సంస్కర్తల వల్ల కాదనీ, ప్రజల చైతన్యమే సంస్కర్తలకు ప్రేరణ కలిగిస్తుందనీ స్పష్టంగా చెప్పారు. సంప్రదాయమంతా చెడ్డది కాదని చెబుతూ, మూర్ఖ సంప్రదాయం అనే ఒక విభజన చేసి, అది ఎలాగూ సహజంగానే చచ్చిపోతుందని ఆయన నిర్ద్వంద్వంగా చెప్తారు. సంప్రదాయంపై ఆయన ప్రకటించిన అభిప్రాయాల వెనక టి.ఎస్. ఎలియట్ ప్రభావం వాచ్యంగానూ, వ్యంగ్యంగానూ మనకు కనిపిస్తుంది.

> **తెలుగుసాహిత్యం కొందరు కవులను, రచయితలను విస్మరించినట్టే విమర్శకులనూ మర్చిపోయింది. అందులోనూ సహృదయంతో, సమన్వయంతో, సమతూకంతో విమర్శించేవారిని మరిచిపోవడం సులువు కూడ. అలాంటి సమన్వయశీలి అయిన విమర్శకులు టి.ఎల్. కాంతారావు.**

అలాగే ఎక్కువమంది అభ్యుదయవిమర్శకులు భావించినట్టు ప్రాచీన కవులకు ఏ దృక్పథమూ లేదని కాంతారావు ఒప్పుకోరు: "ప్రాచీన కవులు, ఇప్పటి కవులు విశ్వశ్రేయస్సునే కాంక్షించారుగానీ, మార్గాల్లో మాత్రమే భేదం. ఆనాడు వారు విశ్వసించిన సమాజం వేరు. ఈనాడు వీరు అభిలషించిన సమాజం వేరు," అని ఒక చోట, మరో సందర్భంలో, "ప్రాచీనాంధ్ర కవులంతా మతం, రాజకీయం, భక్తి మొదలైన సిద్ధాంత దృక్పథాలతో కవిత్వం రాసినవారే. వారి కవిత్వంలో సిద్ధాంత దృక్పథ రాహిత్యమే ఉన్నట్లయితే, వారు కూడా కవిత్వం, కవిత్వం కోసమేనని రాసి ఉన్నట్లయితే మనం ఈనాడు వారి పేర్లు చెప్పుకోనవలసిన అవసరం కూడా ఉండేది కాదు," అని అంటారు.

శ్రీశ్రీ పై ఈగవాలనివ్వని ప్రేమ కాంతారావుగారిది. కానీ తనకు శ్రీశ్రీలో నచ్చని విషయాన్ని చెప్పకుండా ఉండలేని నిజాయితీ కూడా. గూటాల కృష్ణమూర్తిగారి 'మహాప్రస్థానం' ప్రచురణలో చలం యోగ్యతాపత్రం లేకపోవడాన్ని శ్రీశ్రీ ఖండించకపోగా, అది లేకపోవడం లోపం కాదని అనడాన్ని కాంతారావు క్షమించలేకపోయారు. అది ఖచ్చితంగా లోపమే అని తీర్మానించారు.

శ్రీశ్రీ తర్వాత బహుశా ఆయన మెచ్చిన కవి తిలక్. ఆయన తిలక్‌ని వచనకవిత సామర్థ్యాన్ని సమగ్రంగా ఆవిష్కరించిన కవిగా గుర్తించారు. కానీ అతనిలో సిద్ధాంత దృక్పథం లేదని తీర్మానించారు: "వచన కవిత్వంలో అనేక భావాలు చెప్పవచ్చు అని రుజువు చేసినవాడు తిలక్. తదాదిగా వచన కవిత్వం సమాజంపట్ల ప్రాచీన భావాలు కలిగిన కవులకు, ఆధునిక భావాలు కలిగిన కవులకు, అసలు ఒక స్పష్టమైన భావమే లేని కవులకు కూడా కవితా వాహికగా మారింది," అని ప్రశంసిస్తూ తిలక్ లోని నిరాశావాదాన్ని ఖండిస్తారు. అది సిద్ధాంతరాహిత్యం వల్లే వచ్చిందని తీర్పు కూడ చెప్తారు. "అభ్యుదయ కవులకు భవిష్యదాశావాదం ప్రాణప్రదమైన లక్షణం కాగా తిలక్ భవిష్యన్నిరాశావాదం పరాకాష్టస్థితి నందుకున్నది," అంటారు.

కాంతారావుగారికి ఎంత ప్రయత్నించినా, ఎంత ప్రయోగవాది అని సరిపెట్టుకుందామనుకున్నా, ఎంత అభ్యుదయ కవిగా (ముఖ్యంగా రూపంలో) ఒప్పుకున్నా, పఠాభినీ, ఆయన 'ఫిడేలు రాగాల డజన్'నీ మెచ్చుకోవడం మాత్రం వల్ల కాలేదు. అలా ఆయన క్షమించలేకపోయిన మరో వ్యక్తి మిరియాల రామకృష్ణ. ఆయన మెచ్చిన ఇతర కవులు పురిపండా, చెరబండరాజులు.

శషభిషలు లేకుండా, నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని చెప్పే సహజగుణంతో మినీకవితను ఆయన విశ్లేషించిన తీరు ఒప్పిస్తుంది. మినీకవిత రూపం వెనక ఎటువంటి సైద్ధాంతికతా లేవని ఆయన తేల్చేశారు. "మినీ కవిత ఆవిర్భావానికి చారిత్రక దృష్టి కాని, సామాజిక అవసరం కాని లేవు. పత్రికల స్థలాభావం వలన వలస మినీ కవిత పుట్టింది". అది వచనకవితకు మరో రూపం మాత్రమే అన్నారు.

మార్క్సిస్టు విమర్శకులపై నిత్యం వినిపించే ఆరోపణ వారికి వస్తుదృష్టేకానీ, రూపం పట్ల అవగాహన లేదన్నది. ఈ అభిప్రాయాన్ని కాంతారావు ఖండించారు. మార్క్సిస్ట్ విమర్శలో వస్తురూపాలు రెండూ ముఖ్యమేనంటూ, "మార్క్సిస్టు విమర్శలో రూపాన్ని గురించి ఆలోచన అత్యంత విలువైనది. నినాదప్రాయమైన అభ్యుదయకర వస్తువుని తీసుకున్న రచన, మార్క్సిస్టు విమర్శకుని దృష్టిలో ఉత్తమ రచన కాదు... మార్క్సిస్టు విమర్శకుడు కళాత్మకమైన విలువల్ని విస్మరిస్తాడనే వాదం ప్రగతి నిరోధకుల వాదమే కాని ప్రగతివాదుల సిద్ధాంతం కాదు," అని స్పష్టం చేశారు. ఆయన తన విమర్శలో రెండిటినీ పట్టించుకున్న మాట కూడ నిజమే. కానీ అందరూ ఆయనలా రాశారా అన్నది కూడా సందేహాస్పదమే.

కాంతారావుగారి శైలిలో సూత్రప్రాయవాక్యాల రచన ప్రత్యేకం: "మహాప్రస్థానంలోని గేయాలు విమాన వేగంతో సమానమైనవైతే మరోప్రస్థానంలోని గేయాలు కాలినడకతో సమానమైనవి"; "అటు సమాజంలోను, ఇటు సాహిత్యంలోను సమూల మైన మార్పును కోరే వారు మాత్రమే ఆధునికులు"; "ప్రజా కవిత్వమంటే ప్రజలకొరకు రాసే కవిత్వం! వారికి అర్థమయ్యే రీతిలో ఉండే కవిత్వం. పీడిత ప్రజలు అనేక స్థాయిలలో ఉన్నారు కనుక అనేక స్థాయిలలో ఉండే కవిత్వం అంతా ప్రజాకవిత్వమే అవుతుంది" – ఇలా, పాఠకుల మెదడుకు పదును పెట్టే విశ్లేషణలు కాంతారావు గారివి.

(జనవరి 10న రవీంద్రభారతిలో టి.ఎల్. కాంతారావు సమగ్ర సాహిత్యం ఆవిష్కరణ సందర్భంగా)

■ **మృణాళిని**

ఆ తొవ్వల మొదలైంది కవిత్వ నడక!

నా మొదటి పుస్తకం

అన్నవరం దేవేందర్



నా తొలి కవితా సంపుటి 'తొవ్వ'. అప్పుడు సాహిత్యం అభ్యుదయ విప్లవ దశ నుంచి దళిత బహుజన వాదం దిశగా నడక సాగుతుంది. తెలంగాణ అస్తిత్వం మొగ్గ తొడుగుతున్న దశ కూడా అదే. 'తొవ్వ'లో ఈ పాయలు అన్నీ కనిపిస్తాయి. ఎక్కువగా కవిత్వం చదవడమే ఇష్టమైన నేను 1988 నుంచి అప్పుడప్పుడు రాసి దాసుకుంటున్నాను. బి.ఎస్.రాములుతో మాట్లాడుతున్న ఒక సందర్భంలో "నీవు రాస్తున్న కవిత్వం పుస్తకంగా వేయొచ్చు కదా" అన్నారు. అప్పుడే తలకాయలో ఈ 'తొవ్వ' పడ్డది. నిజానికి ఇది 40 పుటల చిన్న సంపుటి. ఉన్నవి 21 కవితలే కానీ ఆ రోజుల్లో బాగా పాపులర్ అయింది. ఇందులో "కనుకొనల నుంచి రాలుతున్న సముద్రం" అంటూ మొదలయ్యే 'నా తెలంగాణ పల్లె' కవిత ఆనాటి సామాజిక సంఘర్షణ నేపథ్యాన్ని ఆవిష్కరిస్తుంది. అట్లాగే 'బాలశిక్షలో దాచుకున్న నెమలికన్ను' కవిత తెలంగాణ పల్లె బాల్యాన్ని నెమరు వేస్తూ అందరిని తనలోకి తీసుకెళ్తుంది. ఆ 'తొవ్వ' నాకు ఇప్పటి 'జీవన తాత్పర్యం దాకా' ఒక ప్రధాన రహదారిగా మారింది. "నేను నడుస్తున్న దారి చెమట చుక్కల పరిమళం" అంటూ మొదలయ్యే కవిత 'తొవ్వ'. ఇదే పేరు బాగుంటదని సూచించింది జూకంటి జగన్నాథం.

కరీంనగర్ కస్తూరి గ్రాఫిక్స్‌లో రాత ప్రతి నుంచి డీటీపీ పూర్తి అయింది. తర్వాత ముఖచిత్రం కవర్ డిజైను ముద్రణ కోసం హైదరాబాద్‌కు నవంబర్ 2001లో అల్లం నారాయణ వద్దకు వెళ్లాను. ఆయన నాకు జర్నలిజంలో రాత పూతలు నేర్పిన గురువు. అప్పటికే చిత్రకారుడు అక్బర్‌చే మట్టి రంగులతో ముఖచిత్రం పూర్తి చేపించి ఉంచారు. తర్వాత అల్లమన్న, నేను, అక్బర్ కలిసి అమీర్‌పేటలో డిజైనర్ లేపాక్షి వద్దకు వెళ్లాము. ముగ్గురం చాలాసేపు డిజైన్లు చూస్తూ గడిపాం. లేపాక్షి గారు అక్షరాలు బొమ్మ డిజైన్ పూర్తిచేసి బ్రోమైడ్‌లు (ఎక్స్ రే ఫిలింలాగా సన్నగా ఉంటాయి) తీసి ఇచ్చారు. నేను వాటిని తీసుకొని గుడిపాటి గారి ద్వార నారాయణగూడలో ఓం సాయి గ్రాఫిక్స్ ప్రెస్‌కి వెళ్లాను. 1000 పుస్తకాల ఆర్డర్. గుడిపాటి దగ్గరుండి అచ్చు వేయించారు. వారం రోజుల తర్వాత 'తొవ్వ' చేతికి అందగానే ఎంత ఆనందమో అది ఇప్పుడు చెప్ప తరం కాదు. వెల పదిహేను రూపాయలే పెట్టాం. చాలావరకు అమ్ముడుపోయాయి. 260 పుస్తకాలు గ్రంథాలయ సంస్థనే తీసుకుంది. మా హుస్నాబాద్ 'నూతన సాహితి' ఈ పుస్తకాన్ని ప్రచురించింది.


2001 డిసెంబర్ 6,7 తేదీలలో ఢిల్లీలో జరిగే భారతీయ దళిత సాహిత్య అకాడమీ సభలకు వెళ్లాలని హుస్నాబాద్ నుంచి నేను, దార్ల రామచంద్ర నిర్ణయించుకున్నాం. బి.ఎస్. రాములు, శమ శ్రీ మల్లయ్య, అనిశెట్టి రజిత, విజయలక్ష్మి, వి.జి.ఆర్ నారగోని... మరికొందరు మిత్రులందరికీ కలిసి ఢిల్లీ వెళ్లాం. డిసెంబర్ 6 న అక్కడి అఖిల భారత దళిత రచయితల సదస్సులో సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ సుమనాక్షర్ చేతుల మీదుగా 'తొవ్వ' ఆవిష్కరణ జరిగింది. తర్వాత 2002 ఫిబ్రవరి 9న కరీంనగర్ జిల్లా సాహితీ సంస్థల సమాఖ్య 'సాహితీ గౌతమి' ఆధ్వర్యంలో గంద్ర లక్ష్మణరావు అధ్యక్షతన 'తొవ్వ' పరిచయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సభలో డాక్టర్ మలయ శ్రీ, వజ్జల శివకుమార్ , కె.ఎస్. అనంతాచార్యులు ప్రసంగించారు. అటు తర్వాత ఫిబ్రవరి 23 న హుస్నాబాద్‌లో నూతన సాహితీ ఆధ్వర్యంలో మరొక పరిచయ సభ జరిగింది. ఇందులో డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, దర్భశయనం శ్రీనివాసచార్య, జూకంటి జగన్నాథం, వడ్డేపల్లి మల్లేశం, దేశపతి శ్రీనివాస్‌లు ప్రసంగించారు.

అప్పటికే ఆవిర్భవించిన తెలంగాణ రచయితల వేదిక పలు సభల్లో 'తొవ్వ' అందరి చేతుల్లోకి వెళ్ళింది. హనుమకొండలో తెరవే ప్రథమ సభలో కాళోజీ నారాయణ రావు 'తొవ్వ' అనే పేరు చూసి "ఎన్ని రోజులకు కనపడ్డదిర 'తొవ్వ' " అని సంబరపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ భావజాల విస్తృతి జరుగుతున్న రోజులవి. ఇలాంటి అంశాలనే తడిపిన ఈ కవితా సంపుటి మీద వివిధ పత్రికల్లో యం. నారాయణ శర్మ, శిఖామణి, అనిందు, అల్లం నారాయణ, కె. శ్రీనివాస్, నాగ భైరవ కోటేశ్వరరావు, జగన్, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, కల్వకుంట్ల రామకృష్ణ, శ్రీ దాస్యం లక్ష్మయ్య, మాకినీడు సూర్య భాస్కర్, దార్ల రామచంద్ర లాంటి ప్రసిద్ధులు మంచి ప్రోత్సాహక వ్యాసాలు రాసారు. ఇరవై నాలుగు ఏళ్ల క్రింది జ్ఞాపకాల రీళ్ళు ఇప్పటికీ తాజాగానే కదలాడుతున్నాయి. ఆ తొవ్వ లోనే కొనసాగుతున్న....



✆ 94407 63479

ఈ నదులెందుకిలా మాట్లాడతాయి!



ఇక్కడెక్కడో ఇన్ని వందల మైళ్ళ దూరంలో
కూర్చుని ఉంటే
గంగ కళ్ళలో మెదుల్తుంది
ఒక్కసారి వచ్చి చూసిపో
అని అచ్చం అమ్మ అడిగినట్లే
అడుగుతుంది
మూగగా అగమ్యంగా
మనసు కొట్టుకుంటున్నపుడు
"దిగులెందుకు!
ఇలా నా ఒడిలోకి రా" అంటూ
నర్మద మృదువుగా పిలుస్తుంది

కొండంత దుఃఖాన్ని
బింకంగా కళ్ళవెనుక
దాచుకుంటున్నపుడు
తనపక్కన నిలబడి కేరింతలు
కొట్టిన పసిపిల్లని
కృష్ణ గుర్తు చేస్తుంది
అంత బింకమూ సడలిపోయి
ఉధృతంగా కన్నీళ్ళు ఉబికి వస్తే
అయ్యో నా తల్లీ
అంటూ బాసర గోదావరి
గుండెల్లో పొదువుకుంటుంది
మథుర నుంచి యమున
చేయి సాచి
చుబుకమందుకుంటుంది
తుంగానది శారదాంబ
ముచ్చట్లు చెప్పబోతుంది

అమ్మా అమ్మా అమ్మా
అంటూ మనసు వేయిగొంతులతో
పిలుస్తుంటే
గంగా గోదారీ కావేరీ
కదిలిపోయి నన్ను చూడడం
పరుగు పరుగున వచ్చి పక్కన నిలబడడం
స్పష్టంగా తెలుస్తుంది

కరుణాసముద్రుని కూతుళ్ళు
అన్నది కారణమే కాకపోతే
కన్నతల్లి కన్నా ఎక్కువగా ఇవి
ఎందుకిలా కనులలో మెదుల్తాయి!
ఎవరికీ ఏమీ కాని
నన్నెందుకిలా పొదువుకుంటాయి!
ఈ నదులెందుకిలా నాతో మాట్లాడతాయి!!

■ **టి. శ్రీవల్లీ రాధిక**

పరిశోధనలేని విమర్శ పునాదిలేని మేడ!



ఇటీవల 'ప్రమాణాల్లేని నేటి విమర్శ' (వివిధ: 03–11–2025) అంటూ సుంకర గోపాలయ్య రాసిన వ్యాసానికి స్పందనగా, నేను రాసిన 'బహుళ స్వరాల నేటి విమర్శ' (10–11–2025) వ్యాసంపై, శ్రీరామ్ పుప్పాల 'పరిశోధనలు విమర్శ కానేరవు' (24–11–2025) అంటూ ప్రతిస్పందించారు. శ్రీరామ్ వ్యాసం ఏకపక్ష నిర్ధారణలకే పరిమితమైంది. ముఖ్యంగా, పరిశోధనలు విమర్శగా పరిగణింపబడవని వారు చేసిన నిర్ధారణ, సాహిత్య విద్యార్థులను, పరిశోధకులను గందరగోళంలోకి నెట్టేసే ప్రమాదం ఉంది. పరిశోధన వేరు, విమర్శ వేరు అని సిద్ధాంతీకరించడం పైకి సులువుగానే కనిపిస్తుంది. కానీ, లోతైన పరిశోధన లేకుండా సరైన విమర్శ ఎలా పుడుతుంది? అనేది మౌలికమైన ప్రశ్న. పునాది లేకుండా మేడ కట్టాలనుకోవడం ఎంత అవివేకమో, పరిశోధన లేకుండా విమర్శ చేయాలనుకోవడం కూడా అంతే అశాస్త్రీయం.

ప్రఖ్యాత సాహిత్య విమర్శకులు రెఫర్ చేసే గ్రంథం 'థియరీ ఆఫ్ లిటరేచర్'. ఇందులో ప్రముఖ విమర్శకులు Rene Wellek, Austin Warren పరిశోధన, విమర్శల మధ్య విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. మరో ప్రఖ్యాత విమర్శకుడు T.S. Eliot పరిశోధనాత్మక దృష్టికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. I.A. Richards ప్రవేశపెట్టిన 'ప్రాక్టికల్ క్రిటిసిజమ్' (1929) పూర్తిగా ప్రయోగశీలమైన పరిశోధన వంటిదే. ప్రముఖ విమర్శకులు, పరిశోధకులు జి.వి. సుబ్రహ్మణ్యం తన 'తెలుగు సాహిత్య విమర్శ – ఆంగ్ల ప్రభావం' గ్రంథంలో ఈ సంబంధాన్ని ఎంతో గొప్పగా విశ్లేషించారు. "విమర్శ వేదం వంటిదైతే, పరిశోధన వేదాంతమైన ఉపనిషత్తు వంటిది. వేద విజ్ఞానం లేనిది ఉపనిషద్ రహస్యం ఉన్మీలించదు. సాహిత్య పరిశోధనం సాహిత్య సిద్ధాంత దర్శన ప్రతిపాదన రూపంగా ఫలిస్తుంది. దానికి సాధనమైన సాహిత్య విమర్శ దాని సమగ్ర ఫలసిద్ధికి తోడ్పడుతుంది" అని అంటారు. ఎస్.వి. రామారావుతో పాటు పరిశోధన ఫలితంగా వెలువడే సిద్ధాంత గ్రంథాలను మన పెద్దలు 'విమర్శ గ్రంథాలు' గానే గుర్తించారు. పరిశోధన గ్రంథాలు కేవలం డిగ్రీల కొరకే పరిమితం కావు, అందులో కొన్ని అత్యుత్తమ సాహిత్య విమర్శ గ్రంథాలుగా కూడా గుర్తింపు పొందాయి అనడానికి సాహిత్య అకాడమీ అందించిన పురస్కారాలే ప్రత్యక్ష సాక్ష్యం.

'సిద్ధాంత అన్వయాలు సిద్ధాంతాలు కావు' అని శ్రీరామ్ తీసిపారేయడం ఆధునిక విమర్శనా రీతులను అర్థం చేసుకోలేకపోవడమే. 'శుద్ధ సిద్ధాంతం' (Pure Theory) అనేది రోజుకొకటి పుట్టదు. 'సిద్ధాంత అన్వయం' అనేది యాంత్రికమైన ప్రక్రియ కాదు, అది ఒక సృజనాత్మకమైన పరిశోధన. ఒక సిద్ధాంతాన్ని ఒక కొత్త సాహిత్యానికి అన్వయించినప్పుడు, ఆ సిద్ధాంత పరిధి విస్తరిస్తుంది లేదా సవరించబడుతుంది. అదే కొత్త సిద్ధాంత నిర్మాణానికి తొలిమెట్టు. ఉదాహరణకు, జి.వి. సుబ్రహ్మణ్యం 'వీర రసము' గ్రంథాన్ని పరిశీలిద్దాం. ఇది 'సిద్ధాంత అన్వయం' ఎంతటి సృజనాత్మక పరిశోధనో చెప్పడానికి ఒక గొప్ప తార్కాణం. అలాగే వెల్చేరు నారాయణరావు 'తెలుగులో కవితా విప్లవాల స్వరూపం' అనేది మార్క్సిస్టు దృక్పథంతో, సామాజిక పరిణామాల నేపథ్యంలో తెలుగు కవిత్వాన్ని విశ్లేషించిన ఒక పరిశోధనా గ్రంథం. ఇది పరిశోధన, విమర్శల కలయికకు ఉత్తమ ఉదాహరణ.

శ్రీరామ్ 'బహుళత్వాన్ని' (Multiplicity) నిరాకరిస్తున్నారు. కానీ, వడలి మందేశ్వరరావు తమ 'విమర్శ: నాటి నుండి నేటికి' గ్రంథంలో చెప్పినట్లు, "ఏ వాదానికి చెందిన కవిత అయినా, ఆ వాదపు దృక్పథానికి లోబడే రచన సాగించాలి. ఆ వాదం నిర్ణయించే ప్రమాణాలతోనే ఆ రచన విలువ నిర్ణయింపబడుతుంది". అంటే అభ్యుదయ కవిత్వానికి మార్క్సిస్ట్ దృక్పథం, విప్లవ కవిత్వానికి నిబద్ధత ఎలాగైతే ప్రమాణాలుగా మారాయో, ఆధునిక బహుళ ధోరణులకు వాటికి సంబంధించిన కొత్త ప్రమాణాలే శాస్త్రంగా మారుతాయి.

గొంగళి పురుగు సీతాకోక చిలుకగా మారుతున్నప్పుడు, గొంగళి పురుగు రూపం పోయిందని బాధపడటం ఎంత అసమంజసమో, పాత కాలపు విమర్శ పద్ధతులు మారాయని బాధపడటం అంతే అసమంజసం. ఈ మార్పును ఆహ్వానిద్దాం. పరిశోధనను, శాస్త్రీయ విశ్లేషణను విమర్శ క్రమంలో భాగం చేద్దాం. అప్పుడే తెలుగు సాహిత్య విమర్శ మరింత ఆరోగ్యంగా, బలంగా ఎదుగుతుంది.

■ **వెంకటరామయ్య గంపా**
✆ 99586 07789

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

సోమవారం 5 జనవరి 2026

గుంటూరులో



ప్రథమ బహుమతి పొందిన ముగ్గు

తెనాలిలో..



ప్రథమ బహుమతి పొందిన ముగ్గు




తెనాలి : లక్ష్మీతిరుపతమ్మకు ప్రథమ బహుమతి అందజేస్తున్న నన్నపనేని రాజకుమారి, వీరవల్లి మురళి



కే చందనకు ప్రథమ బహుమతి అందజేస్తున్న ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్ రామచంద్రరావు

ఇలపై ఇంద్రధనస్సు

- గుంటూరు, తెనాలిలో రంగవల్లుల సంబరం
- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన
- పోటీలకు గుంటూరులో వికాస్ హాస్పిటల్.. తెనాలిలో గణేష్ యూత్ సహకారం



ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు (ఇన్‌సెట్లో) విజేత జాహ్నవి



ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు (ఇన్‌సెట్లో) విజేత కేఎన్ మల్లేశ్వరి



తృతీయ బహుమతి పొందిన ముగ్గు (ఇన్‌సెట్లో) విజేత గీత



తృతీయ బహుమతి పొందిన ముగ్గు (ఇన్‌సెట్లో) విజేత ఆర్ గీతాంజలి

● మురిసిన ముత్యాల ముగ్గులు

రంగురంగుల ముగ్గులతో ఇలపైకి ఇంద్ర ధనస్సు వచ్చింది. రంగవల్లుల అలంకరణతో భూమాత మురిసింది. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా అతివలు వేసిన ముగ్గులతో అవని పులకించింది. ఆధ్యాత్మికంగా.. సందేశాత్మకంగా.. పర్యావరణహితంగా తీర్చిదిద్దిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీలకు యువతులు, మహిళల నుంచి విశేష స్పందన లభించింది. సప్తవర్ణ శోభితంగా అతివలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ముగ్గులు.. పలువురిని ఆకట్టుకున్నాయి. తమలోని సృజనాత్మకతకు పదును పెట్టి విద్యార్థినుల నుంచి ముదుసలి వరకు ముగ్గులను తీర్చిదిద్దారు. ఆదివారం పోటీలు జరిగిన ప్రాంగణాలు రంగవల్లుల సంబరంతో హోరెత్తాయి. తల్లులు ముగ్గులతో మురిపించగా.. వారి పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీతో వారం ముందే సంక్రాంతి వచ్చినట్లుగా ఉందని వక్తలు తెలిపారు.

విజేతలు

ప్రథమ : సూరగాని లక్ష్మీతిరుపతమ్మ(సోమసుందరపాలెం)

ద్వితీయ : మాచర్ల జాహ్నవి(తెనాలి ఇస్లాంపేట)

తృతీయ : అద్దంకి గీత(రేపల్లె)

తెనాలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెనాలి బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ జరిగింది. ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు. పోటీలకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి 148 మంది మహిళలు, యువతులు తరలివచ్చి రకరకాల రంగులతో ముగ్గులు తీర్చిదిద్దారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ కొడాలి వీరయ్య ట్రస్ట్ కన్వీనర్ వాసిరెడ్డి ప్రియబాంధవి, నందిపాటి పద్మాంజలి, వేజళ్ల శశికళ వ్యవహరించారు. గణేష్ యూత్ సభ్యులు కనగాల నాగభూషణం, బొద్దులూరి వేణు, గొల్లపూడి సాయిగిరి, ఎల్ఎంఎల్ ఖాదర్, కె.విష్ణు, గుమ్మడి రవీంద్ర బహుమతులు అందజేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతితో పాటు పట్టుచీర అందజేశారు. నాల్గో బహుమతి కింద 12 మందికి పట్టుచీరలు, 5వ బహుమతి కింద 30 మందికి చీరలు, ప్రోత్సాహక బహుమతులుగా 55 మందికి చీరలు పంపిణీ చేశారు.

సంస్కృతి పరిరక్షణ : రాజకుమారి

అనంతరం విజేతలకు బహుమతి ప్రధానోత్సవ సభలో మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ అంతరించిపోతుందనుకున్న సంస్కృతి, సాంప్రదాయాలను నేటి యువత కాపాడేందుకు ముందుకు వస్తుండటం శుభ పరిణామమన్నారు. సంప్రదాయాలకు విలువ ఇస్తూ యువతలో స్ఫూర్తి కలిగించేలా మహిళలను ప్రోత్సహిస్తున్న ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ అభినందనీయులన్నారు. 19 ఏళ్లుగా మొక్కవోని దీక్షతో పోటీలు జరుగుతున్నాయని, దీనికి గణేష్ యూత్ మురళి బృందం సహకారం అందించడం అభినందనీయమన్నారు. అంగలకుదురు గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మాట్లాడుతూ సెల్‌ఫోన్లకే అంకితమవుతున్న చిన్నారుల ఆలోచనలు, అలవాట్లను దారి మళ్లించేందుకు ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు దోహదపడతాయన్నారు.

గుంటూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియం వేదికగా ఆదివారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీ జరిగింది. ముగ్గులు వేసేందుకు వచ్చిన వారితో.. వాటిని తిలకించేందుకు తరలివ చ్చిన వారితో ప్రాంగణం సందడిగా మారింది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై: సన్‌ఫీస్ట్ మ్యాజిక్ మామ్స్ బిస్కెట్, టేస్ట్ పార్టనర్ స్వస్తిక్ మసాలా, ప్రేయర్ పార్టనర్ పరిమళ్ మందిర్ భారత్‌వాసి అగరబత్తీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ జరిగింది. కాగా గుంటూరులో వికాస్ హాస్పిటల్స్ సహాయ సహకారాలను అందిం చగా సుమారు 190 మంది మహిళలు పోటీలో పాల్గొన్నారు. విజేతలకు ఎమ్మెల్యే గల్లా మాధవి, వికాస్ హాస్పటల్ చైర్మన్ గల్లా రామచంద్రరరావు బహుమతులు అందజేశారు.

ముగ్గులు తెలుగు సంస్కృతికి ప్రతీక : ఎమ్మెల్యే మాధవి

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఇంటి ముందు వేసే ముగ్గులేనని, ఇవే కుటుంబ వ్యవస్థలకు అద్దం పడతాయని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. ప్రాచీన కాలం నుంచి కొనసాగుతున్న ముగ్గుల సంస్కృతిలో అంతర్లీనంగా ఎన్నో మంచి అంశాలతో పాటు ధాతృత్వ గుణం ఉందన్నారు. సప్తవర్ణాలతో తీర్చిదిద్దిన ముగ్గులు మనోఉల్లాసాన్ని కలిగిస్తున్నాయని చెప్పారు. వికాస్ హాస్పిటల్ చైర్మన్ గల్లా రామచంద్రరావు ప్రసంగిస్తూ తమలో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను ఇలా ముగ్గుల ద్వారా మహిళలు తెలియజేయడం శుభపరిణామన్నారు. న్యాయనిర్ణేతలుగా మద్దుకూరి మధుభారతి, కొత్తపల్లి రాజీవని, మద్ది సునీత వ్యవహరించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్ రామచంద్రరావు, బ్యూరో ఇన్‌చార్జి గింజుపల్లి భాస్కరరావు, ఎడిటోరియల్, అడ్వర్టైజ్‌మెంట్, సర్క్యులేషన్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

ప్రథమ: కే చందన, ద్వితీయ: కేఎన్ మల్లేశ్వరి, తృతీయ: ఆర్ గీతాంజలి

కన్సోలేషన్: ఎం పద్మలత, కే అనసూయ, కే మాధవి



వాజపేయి విగ్రహావిష్కరణలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే మాధవి

మహోన్నతమైన వ్యక్తి వాజపేయి

- విలువలతో కూడిన రాజకీయాలు చేసిన మహనీయుడు
- విగ్రహావిష్కరణలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన రాజకీయాలు దేశ ప్రజలకు పరిచయం చేసిన మహోన్నతమైన వ్యక్తి భారతరత్న అటల్ బిహారీ వాజపేయి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. స్థానిక లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో వాజపేయి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్వీఆర్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో మాధవ్ మాట్లాడుతూ వాజపేయి ఐక్యరాజ్యసమితి వేదికగా హిందీలో ప్రసంగం చేసి ప్రపంచానికి భారతదేశ ఆత్మగౌరవం వికసింప చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. నాదేశం కోసం జీవిస్తాం.. అవసరమైతే మరణిస్తాం అనే నినాదంతో కచ్ ఉద్యమం, గోవధ నిషేధ చట్టం కోసం పోరాటం చేశారన్నారు. వాజపేయి స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు వాజపేయిని గౌరవిస్తాయన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ వాజపేయి కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని ఆయన దేశం గర్వించే మహోన్నత నాయకుల్లో ఒకరన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ వాజపేయి జీవితం చిరస్మరణీయమన్నారు. జీఎంసీ మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి వాజపేయి జీవిత చరిత్రను ఈతరం ప్రజలకు తెలిపే విధంగా, ఆయన చేసిన సేవలను భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా కృషి చేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్‌నారాయణ మాట్లాడుతూ రాజకీయ జీవితంలో ఒక్క అవినీతి మకిలి లేకుండా, ఒక్క శత్రువు లేకుండా గడిపిన వాజపేయి జీవితం అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో యాత్ర కన్వీనర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు వనమా పూర్ణచంద్రరావు, యడ్లపాటి రఘునాథబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు

తేనెలొలికిన తెలుగు

- తెలుగు మాధుర్యాన్ని చాటిన మహాసభలు
- అతిరథమహారధులతో సభా ప్రాంగణం కళకళ
- ముఖ్యఅతిథిగా హాజరైన మారిషస్ దేశ అధ్యక్షుడు
- నేడు ముగింపు.. హాజరుకానున్న సీఎం చంద్రబాబు





మారిషస్ దేశ అధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ దంపతులను సన్మానిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, గజల్ శ్రీనివాస్, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి తదితరులు

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తేనెలొలికే తెలుగు భాషలో ఉన్న మాధుర్యం, ఔన్నత్యాన్ని చాటుతూ.. వీనులు విందు చేసేలా గజల్స్, అన్నమయ్య సంకీర్తనలు, కవి సమ్మేళనాలతో.. భాషాప్రియులు ఆనందడోళికల్లో మునిగి తేలేలా.. ఆంధ్ర సారస్వత పరిషత్ మూడో ప్రపంచ తెలుగు మహాసభలు రెండో రోజు ఆదివారం అత్యద్భుతంగా సాగాయి. గుంటూరు శివారు శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక నగరి ప్రాంగణం తెలుగుదనంతో పులకించిపోయింది. దేశవిదేశాల నుంచి తరలి వచ్చిన భాషా ప్రియులైన అతిరథమహారథుల తో సభా ప్రాంగణం కళకళలాడింది. వివిధ ప్రాంతాల నుంచి పిల్లలతో కలిసి వచ్చిన పెద్ద లు వివిధ కార్యక్రమాలను ఆస్వాదించారు. కరతాళ ధ్వనులతో తమ ఆనందాన్ని వ్యక్తప రిచారు. కొందరైతే తెలుగుదనం ఉట్టిపడేలా వస్త్రధారణతో కార్యక్రమాలకు హాజరయ్యారు. ఉదయం నుంచి వివిధ వేదికలపై జరిగిన గజ ల్స్, అన్నమయ్య సంకీర్తనలు, కవి సమ్మేళనాలు ఆలకిస్తూ తన్మయం పొందారు. శ్రీనాథ కవి వేదికపై సాహిత్య సదస్సులను తిలకించేందుకు పలువురు ఆసక్తి చూపారు. నరసింహ దాసు వేదికపై స్వామి వార్ల కల్యాణాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, గణపతి హోమం వంటి కార్యక్రమాలు ఆధ్యాత్మిక చింతనని పెంచాయి. ప్రదర్శన శాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుస్తక, హస్తకళలు, ప్రాచీన తెలుగు వైభవ ప్రదర్శనలు, పురాతన వస్తువులను ఆసక్తిగా సందర్శించారు. వచన కవిత్వం, నవీన కవితా రీతులు, పద్య కవిత్వం, తెలుగు గజల్స్‌కి కూడా విశేష ఆదరణ లభించింది.

మారిషస్ అధ్యక్షుడికి భారత మిత్ర అవార్డు

రెండో రోజు సభకు ముఖ్య అతిథిగా మారిషస్ దేశ అధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ సతీసమే తంగా హాజరయ్యారు. మారిషస్‌లో తెలుగు భాష, సంస్కృ తి తమ జీవితంలో అంతర్భాగమయ్యాయని ఆయన తెలిపా రు. తరతరాలుగా భాష, సాహిత్యం, సాంస్కృతిక సంప్రదా యాలను విశేషమైన అంకితభావంతో కాపాడుతూ సామా జిక, ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోన్నదని చెప్పారు. కాగా మారిషస్ దేశాధ్యక్షుడు ధరంబీర్ గోకుల్‌కు ఆంధ్ర సా రస్వత పరిషత్ తరపున భారత మిత్ర అవార్డుని ప్రదానం చేశారు. పంచలోహ వేంకటేశ్వరస్వామి ప్రతిమని బహూకరించారు. గజమాలతో గోకుల్ దంపతులను ఘనంగా సత్కరించారు. అలానే పలువురికి ధరంబీర్ గోకుల్ చేతుల మీదగా మెమెంటోలు



తెలుగు సహాసభలకు హాజరైన భాషా ప్రియులు

(మిగతా 6లో)



సభలో మాట్లాడుతున్న ఉత్తరాఖండ్ జ్యోతిర్‌మఠ్ శంకరాచార్య ముకుందానంద్ గిరి

తెలుగులోనే మాట్లాడాలి

● త్రిపుర గవర్నర్ ఎన్ ఇంద్రసేనారెడ్డి



గుంటూరు(తూర్పు), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భాష పరిరక్షణ ఇంటి నుంచే ప్రారంభం కావాలని, ప్రతి ఒక్కరూ ఇంటిలో, కుటుంబ సభ్యులతో మాతృ భాషాలోనే మాట్లాడేందుకు.. ప్రాధాన్యం ఇవ్వాలని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి పిలుపునిచ్చారు. గుంటూరులోని శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీ ప్రాంగణంలో జరుగుతున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలలో ఆదివారం రెండో రోజున సాయంత్రం జరిగిన తెలుగు వైభవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. తిట్లు కూడా తెలుగు భాషలోనే ఉండాలని చమత్కరించారు. త్రిపురలో బాధ్యతలు తీసుకున్న వెంటనే తెలుగు వారిని గుర్తించే కార్యక్రమాన్ని చపట్టినట్లు చెప్పారు. వారిని ఒకే వేదికపై తెచ్చి సమావేశాలు నిర్వహించామన్నారు. సంక్రాంతి, ఉగాది పండుగలను లోక్‌భవన్‌లో నిర్విహించి, ఆ ప్రసాదాలను ముఖ్యమంత్రి, ఇతర అధికారులకు పంపుతున్నామని చెప్పారు. త్రిపురలో ఉన్నత విద్యను అభ్యసించే తెలుగు విద్యార్థులకు, అధికారులకు బెంగాలి వారితో భాషా సమస్యలు తలెత్తినప్పుడు ప్రత్యేకంగా స్పోకెన్ బెంగాలీ అనే పుస్తకాన్ని అందుబాటులోని తీసుకువచ్చామని తెలిపారు. ఇదే పుస్తకాన్ని వేరే భాషాలలో అందుబాటులోకి తీసుకువస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయన్నారు. తెలుగు భాష పట్ల మమకారాన్ని, అభిమానాన్ని పెంచుతూ భాషా వ్యాప్తికి కృషి చేస్తున్న ఆంధ్ర సారస్వత పరిషత్తుకు డాక్టర్ గజల్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్నట్టు చెప్పారు. లిపి లేకపోయిన సభలు, వేదికలలో సంస్కృతిని ప్రదర్శిస్తే దానికి అనుగుణంగానే భాష విరాజల్లుతుందన్నారు. ముఖ్యంగా ప్రవాసాంధ్రులు వారి ఇళ్లలలో మాతృభాషలో మాట్లాడాలని, అప్పుడే పిల్లలకు భాషా ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు.

నేటి నుంచి డిపార్టుమెంటల్ పరీక్షలు

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డిపార్టుమెంటల్ పరీక్షలు ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడికొండూరు మండలం పేరేచర్లలో గల అయాన్ డిజిటల్ జోన్ (యూనివర్సల్ కాలేజ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ క్యాంపస్), వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలో ఉన్న మలినేని పెరుమాళ్ళ ఎడ్యుకేషనల్ సొసైటీ, కొర్నెపాడులో ఉన్న ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ కాలేజీలలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. జిల్లాకు చెందిన ముగ్గురు అధికారులను సమన్వయ అధికారులుగా నియమించామని చెప్పారు.

సారస్ ఏర్పాట్ల పరిశీలన



ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రెడ్డి కళాశాల ఎదుట ఈ నెల 6 నుండి 18వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి సారస్ (అఖిల భారత డ్వాక్రా బజార్) ఏర్పాట్ల ను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం పరిశీలించారు. ప్రదర్శన శాలల ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని, పోలీస్ శాఖ తరపున నుంచి చేపట్టబోయే ఏర్పాట్లు, బందోబస్తు , ట్రాఫిక్ నియంత్రణ చర్యల గురించి ఎస్పీ వివరించారు. గుంటూరుఆర్‌డీవో శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసులు, సౌత్ డీఎస్పీ భానోదయ, ఎస్‌బీ సీఐ అళహరి శ్రీనివాస్, నల్లపాడు సీఐ వంశీధర్ పాల్గొన్నారు.

తేనెలొలికిన తెలుగు



ప్రపంచ తెలుగు మహాసభల సమ్మేళనంలో పాల్గొని పురస్కారాలు అందుకున్న కవులు



ఆకట్టుకున్న నాట్య రూపకం

(5వ పేజీ తరువాయి)

అందజేయించి సన్మానించారు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన స్పీకర్

తెలుగు మహాసభల్లో పాల్గొనాల్సిందిగా ఆంధ్ర సారస్వత పరిషత్ నేతలు ఆహ్వానపత్రాలతో తొలుత రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి వద్దకు వెళ్లారు. అప్పుడు ఆయన మాట్లాడుతూ తాను మహాసభలలో పాల్గొనడమే కాదని, మూడు రోజులు ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే ఉండి అన్ని కార్యక్రమాలు పరిశీలిస్తానని చెప్పారు. ఆ మాటకు కట్టుబడి స్పీకర్



సాహితీ సదస్సులో ప్రముఖ వైద్యులు గురవారెడ్డి తదితరులు

అయ్యన్నపాత్రుడు తెలుగు మహాసభల ప్రాంగణంలో రెండో రోజు కూడా ఉన్నారు. భారతదేశం లాంటి పుణ్యభూమిలో జన్మించాలని ప్రతీ ఒక్కరూ కోరుకొంటారని ఉత్తరాఖండ్ జ్యోతిర్‌మఠ్ శంకరాచార్య ముకుందానంద్ గిరి అన్నారు. భారతదేశం వసుధైక కుటుంబం అని చెప్పారు. తెలుగు వాళ్లు ఎక్కడున్నా వారందరిని భాష ఐక్యం చేస్తుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. అలాంటి భాష రక్షణ, ఔన్నత్యం, మాధుర్యం కోసం ఈ సభలను నిర్విహించుకుంటున్నామన్నారు.

పర భాష కోసం మాతృ భాషని తగ్గించొద్దు : జస్టిస్ ఎన్.జయసూర్య



మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటిని సన్మానించిన ధరంబీర్ గోకుల్

పరభాషని నేర్చుకునేందుకు మాతృభాషని తగ్గించుకోవాల్సిన అవసరం లేదని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ జయసూర్య తెలిపారు. మాతృభాషని ఆదరిస్తూనే ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పు లేదన్నారు. ఇటీవల కాలంలో మాతృభాషని ఎక్కువగా విస్మరిస్తూ ఇతర భాషలు, ముఖ్యంగా ఆంగ్లం నేర్చుకుంటే ఉపయోగం ఉంటుందన్న భావనలో పలువురు ఉన్నారన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. మా తెలుగుతల్లికి మల్లె పూదండ.. మా కన్న తల్లికి మంగళారతులు అన్న పాట మనం వింటుంటే ప్రతీ ఒక్క తెలుగువాడి శరీరం పులకరించిపోతుందన్నారు. అది తెలుగు భాషకు ఉన్న గొప్పదనమన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను మాతృభాష విషయంలో ప్రోత్సహించాలని సూచించారు. గజల్స్, సాహితీవేత్తల విశ్లేషణ వింటుంటే ఎవరికైనా తెలుగు భాషపై పట్టు సాధించాలన్న ప్రేరణ కలుగుతుందన్నారు. భవిష్యత్తులో తాను తన తెలుగు భాషని బాగా వృద్ధి చేసుకుని ఇలాంటి తెలుగు మహాసభల్లో పాల్గొంటానని చెప్పారు.

వలస వెళ్లినా తెలుగును మరువలేదు : ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఆంధ్ర సారస్వత పరిషత్ మొట్టమొదటి మహాసభలు జరిగినప్పుడు అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ హాజరయ్యారని, ఇప్పుడు మారిషస్ దేశ రాష్ట్రపతి ధరంబీర్ గోకుల్ రావడం తెలుగువారి అదృష్టమని కృష్ణా జిల్లా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బ్రిటీష్ పాలనలో ఉత్తరాంధ్ర ప్రజలు వ్యవసాయ కూలీలుగా మారిషస్ తీసుకెళ్లారని, ముగ్గురితో ప్రారంభమైన వలసలు 20 వేలకు పైగా చేరాయన్నారు. కూలీలుగా అష్టకష్టాలు పడి మారిషస్ అభివృద్ధికి కృషి చేశారని, 150 ఏళ్ల క్రితం వెళ్లినా భాష, సంస్కృతిని వారు మరిచిపోలేదన్నారు. వెళ్లేటప్పుడే పెద్దబాల శిక్షని తీసుకెళ్లి అక్కడ వారి పిల్లలతో వల్లె వేయించారని



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్యకు మెమెంటో అందజేస్తున్న ధరంబీర్ గోకుల్

చెప్పారు. మహారామ్ భజన 10 వేల మందితో చేశారన్నారు. మారిషస్‌లో ఏ ఇంటి ముందు అయిన ముగ్గు, తులసీ కోట ఉంటే అది కచ్చితంగా తెలుగు వారిదేనన్నారు. మారిషస్‌తో పాటు మలేషియాలోని తెలుగు వాళ్లు కూడా జాతిని నిలబెట్టుకుంటూ కొనసాగుతున్నారన్నారు. అక్కడ ఏ తెలుగు కార్యక్రమం జరిగినా ప్రభుత్వ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందన్నారు. ఇక్కడేమో తెలుగు బోధన గురించి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉండగా మారిషస్‌లో ఒకటో తరగతి నుంచి పీజీ వరకు తెలుగు భాషని బోధిస్తున్నారన్నారు. మాతృభాషని తిరస్కరిస్తే మాతృమూర్తిని విస్మరించినట్లే అవుతుందన్నారు.

తెలుగును పిల్లలకు నేర్పించాలి: ఎమ్మెల్యే రామాంజనేయులు

తెలుగు భాషకు సౌందర్యం ఎక్కువని, ప్రతీ అక్షరాన్ని పలికిస్తుందని, పిల్లలకు నేర్పించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. ప్రపంచంలో ఏడు వేల భాషలుంటే తెలుగు భాష 15వ స్థానంలో ఉందన్నారు. త్యాగరాజ కీర్తనలు, అన్నమయ్య సంకీర్తనలు వింటుంటే తెలుగు విశిష్టత తెలుస్తుందన్నారు. తెలుగు భాషని గ్రాంధీకం నుంచి వాడుక భాషలోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు రాంమూర్తి పంతులని చెప్పారు.

నేడు ముగింపు

ప్రపంచ తెలుగు మహాసభలు సోమవారంతో ముగియనున్నాయి. ఉదయం జరిగే సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, గోవా గవర్నర్ పీ అశోక్‌గజపతిరాజు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగిస్తారు. మధ్యాహ్నం నుంచి జరిగే కార్యక్రమాల్లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఇతర ప్రముఖులు హాజరౌతారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడిని సన్మానిస్తున్న ధరంబీర్ గోకుల్





అలరించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	170, 179, 190
చికెన్ విత్ స్కిన్(కిలో)	330.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	340.00

పెదకూరపాడు ప్రజల రుణం తీర్చుకోవడమే లక్ష్యం

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
- ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు
- భారీగా ద్విచక్ర వాహన ర్యాలీ
- రక్తదానం చేసిన యువగళం సభ్యులు



ఎమ్మెల్యే ప్రవీణ్ దంపతులకు గజమాలతో శుభాకాంక్షలు

పెదకూరపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తనను ఆదరించి గెలిపించిన పెదకూరపాడు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోవడమే తన లక్ష్యమని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని 75 తాళ్లూరులో టీడీపీ పెదకూరపాడు మండలాధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, మాజీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, పరస తాళ్ళూరు వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ ఏటుకూరి రత్నకుమార్ ఆధ్వర్యంలో భాష్యం ప్రవీణ్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ తన పట్ల నియోజకవర్గ ప్రజలు చూపిన అభిమానం ఎప్పటికీ మరచి పోలేనన్నారు. కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటానని, నియోజక వర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా సేవకే నా జీవితం అంకితమన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను ముందుంటానన్నారు. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొనేందుకు.. వంద రోజులు వంద గ్రామాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఎక్సవేటర్ ద్వారా భాష్యం ప్రవీణ్‌ను గజమాలతో సత్కరించారు. పుట్టిన రోజు కేకును ఎమ్మెల్యే ప్రవీణ్ కట్ చేసి స్వీట్లు తినిపించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి.. ప్రవీణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే ప్రవీణ్ పని చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా యువగళం టీమ్ రక్తదానం చేసింది. వేలాదిగా తరలి వచ్చిన వారికి.. నిర్వాహకులు భోజనాలను ఏర్పాటు చేశారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు వెన్నా సాంబశివారెడ్డి, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ కుర్ర అప్పారావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ, జిల్లా నాయకులు వేగుంట రాణి, తెలుగు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ ముంతాజ్, ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గుడిపూడి చినరాజు, నాయీ బ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ అంద్ర ప్రసాదు, మాజీ ఎంపీపీలు గల్లా బాబూరావు, బెల్లంకొండ రామగోపాలరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, నియోజక వర్గ టీడీపీ నాయకులు మక్కెన సాగర్, బెల్లంకొండ సురేష్, కొల్లి వెంకటరెడ్డి, జొన్నవరపు రామ కోటిరెడ్డి, మేదరమెట్ల చౌమిత్ చౌదరి, గంగినేని లీలావతి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు, కొండవీటి శ్రీనివాసరావు, నర్రా గోవిందు, కొల్లి లక్ష్మీనరసమ్మ, బ్రహ్మారెడ్డి, క్రోసూరు మండల టీడీపీ నాయకులు బెల్లంకొండ సురేష్ ఎమ్మెల్యే ప్రవీణ్‌ను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



జన్మదిన కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, పక్కన గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు, రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి తదితరులు



పరస నుంచి ద్విచక్ర వాహనాలతో 75 తాళ్ళూరుకు భారీ ర్యాలీ



ఎమ్మెల్యే ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు పోలీస్ గ్రీవెన్స్ రద్దు

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్) రద్దు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభలకు సీఎం చంద్రబాబు హాజరవుతున్న దృష్ట్యా బందోబస్తు ఏర్పాట్ల నేపథ్యంలో రద్దు చేశామన్నారు.






రెండో బహుమతి పొందిన ముగ్గు, విజేత కేఎన్ మల్లేశ్వరికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి, గళ్లా రామచంద్రరావు, ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్ రామచంద్రరావు





తృతీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత ఆర్ గీతాంజలికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి, గళ్లా రామచంద్రరావు, ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్ రామచంద్రరావు



ఉత్సాహంగా ఉల్లాసంగా

- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు
- వయో భేదాన్ని మరిచి హాజరైన అతివలు
- ఆకట్టుకున్న కాసుల కృష్ణంరాజు పప్పెట్‌షో
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి తదితరులు







ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు మధుభారతి, రాజీవని, సునీత



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు (విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు లోగిళ్లలో సంక్రాంతి ముందే వచ్చిందా అన్నట్లుగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు జరిగాయి. ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి. అపార్టుమెంట్ సంస్కృతి పెరిగిపోతున్న తరుణంలో ముగ్గులు వేయడానికి కనీసం స్థలం కూడా లేని దుస్థితి ఉన్నా, మహిళల్లో సృజనాత్మకత నైపుణ్యాలు మాత్రం తగ్గలేదు. రంగుల హరివిల్లును మరిపించేలా వారు వేసిన ముగ్గులు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చాయి. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన పోటీలు మధ్యాహ్నం 12 గంటల వరకు సాగాయి. ఈ సమయంలో ప్రముఖ మిమిక్రీ కళాకారులు కాసుల కృష్ణం రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పప్పెట్‌షో ఆహూతులకు నవ్వుల జల్లు పంచింది. అనంతరం న్యాయ నిర్ణేతలు మధుకూరి మధుభారతి, కొత్తపల్లి రాజీవని, మల్లి సునీత తదితరులు పోటీల్లో గెలుపొందిన విజేతలను ప్రకటించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి, వికాస్ హాస్పటల్ ఛైర్మన్ గళ్లా రామచంద్ర రావు చేతుల మీదుగా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పోటీలకు వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక బహుమతులు ఆంధ్రజ్యోతి యాజమాన్యం అందజేసింది. ఈ సందర్భంగా వయో భేదాన్ని మరిచి చిన్నారులు, మహిళలు, యువతులు ఆడిపాడారు. శాస్త్రీయ, సంప్రదాయ సంగీతానికి అనుగుణంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.







బహుమతి ప్రదానోత్సవ సభలో పాల్గొన్న మహిళలు





సాంస్కృతిక కార్యక్రమాలలో సందడిచేస్తున్న మహిళలు, చిన్నారులు



కన్సోలేషన్ బహుమతులు పొందిన ముగ్గులు, ఇన్‌సెట్‌లో విజేతలు పద్మలత, కే అనసూయ, కే మాధవి

సాయి ఆదిత్య స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు




పాఠశాలలో వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గుంటూరు (విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రింగు రోడ్డులోని సాయి ఆదిత్య స్కూల్‌లో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పెమ్మసాని శ్రీరత్న మాట్లాడుతూ, సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే నేర్పించాలని సూచించారు. విద్యార్థులకు పండుగల విశిష్టతను తెలియజేయాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో వేడుకలు నిర్వహించారు. ముగ్గుల్లో గొబ్బెమ్మలు పెట్టి, భోగిమంటలు వేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ మోదేపల్లి రవీంద్రబాబు, సూరె రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ సీతా మహాలక్ష్మీ, శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీయం ఈమని దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణను త్వరగా చేపట్టాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డు విస్తరణ పనులను వేగంగా జరిగేలా చూడాలని ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళికా అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్‌లో పర్యటించి విస్తరణ పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులను వేగంగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అన్నారు. విస్తరణ ప్రభావిత భవనాల తొలగింపును ట్రాఫిక్, చుట్టుపక్కల వారికి సమస్య రాకుండా చేపట్టాలని సూచించారు. పర్యటనలో డీఈఈ వెంకట రమణ, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు మాదల చైతన్య ఆర్థిక తోడ్పాటు



విద్యార్థికి చెక్కును అందజేస్తున్న మాదల చైతన్య

గుంటూరు(తూర్పు), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల పేద విద్యార్థులకు జన చైతన్య ప్రాపర్టీస్ అధినేత మాదాల చైతన్య అండగా నిలబడ్డారు. స్థానిక కొరిటెపాడుకు చెందిన షేక్ అయేషా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక తన ఇద్దరు పిల్లలు షేక్ మునీర్, షేక్ అమీర్ ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని మాదాల చైతన్య దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించిన మాదాల చైతన్య ఆ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం మాదాల చైతన్య మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో అసమానతలు తొలిగిపోతాయని అన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు ఆర్థిక సమస్యలతో చదువును అపుతున్నారని, అందుకే ఇటువంటి సేవలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయాన్ని అందజేసిన మాదల చైతన్యకు విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్‌ల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

గుంటూరు(తూర్పు), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్ కోరారు. స్థానిక సంపత్‌నగర్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలపై త్వరలోనే ముఖ్యమంత్రిని కలవనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి సుబ్బారాయుడు, జయరామ్, గొడుగు శంకర్, రాజు, సాంబశివరావు, రాంబాబు, శేఖర్, నరసింహారావు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవ సమాజానికి నిజమైన స్ఫూర్తి

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



స్కాలర్‌షిప్పు పొందిన విద్యార్థులతో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ సత్యనారాయణ, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

పెదకాకాని, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్వార్థానికి అతీతంగా సాగుతున్న సేవ సమాజానికి నిజమైన స్ఫూర్తి అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం 495 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఎంపీ పాకా సత్యనారాయణ, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలసి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు శాసన సభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, విశ్రాంత అడిషనల్ కమిషనర్ వై.సత్యనారాయణ, కళారత్న అవార్డు గ్రహీత బొర్రా గోవర్ధన్, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సిక్కిం మాజీ డీజీపీ సుధాకర్, సేవాసంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ప్రముఖులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ఏ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పీఏ కిరణ్‌కుమార్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కోటంరాజు గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎండీ గౌస్, వీ.సర్వేశ్వరరెడ్డి, ఎన్.హీనాప్రియ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అభినందించారు.

ఉపాధ్యాయుల కోసం ఎస్‌పీటీఎల్‌వో కృషి అభినందనీయం

గుంటూరు (విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, అధ్యాపకుల్లో నైపుణ్యాలను ప్రోత్సహించేలా సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌పీఎల్‌టీవో) చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన వేదికలో జరిగిన నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

గుంటూరు(తూర్పు), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని సీఎంఆర్ యూనివర్సిటీ మార్కెటింగ్ ఏడీ రాజకుమార్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలో ఆదివారం జరిగిన ప్రైవేటు విద్యాసంస్థలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయుల సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రీజనల్ డైరెక్టర్ వివేకన్, దుర్గా రమేష్, కల్యాణ్ చక్రవర్తి, కిరణ్‌కుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల కృషి

గుంటూరు(విద్య), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్న ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలకు ప్రభుత్వం చేయూత అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని గొట్టిపాటి కల్యాణ మండపంలో నిర్వహించిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రరెడ్డి, ట్రెజరర్ సాదినేని శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు, నూజివీడు అధ్యక్షుడు సబ్బినేని శ్రీనివాసరావు, ఎన్నారై విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు పాల్గొన్నారు.

కొరిటెపాడులో బాలిక అదృశ్యం

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొరిటెపాడులో పల్నాడు ప్రాంత బాలిక అదృశ్యమైంది. అచ్చంపేట మండలం, కస్తల గ్రామానికి చెందిన 17 సంవత్సరాల బాలిక కిడ్నీ సంబంధిత వ్యాధికి చికిత్స తీసుకొంటూ కొరిటెపాడు, సాకేతపురంలోని బంధువుల ఇంట్లో నివసిస్తుంది. ఈనెల 3న బాలిక ఎవరికి చెప్పకుండా వెళ్ళిపోయింది. బాలిక తల్లి షేక్ అనార్కలి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో 14 మంది అరెస్టు

● ఐదు కేజీలు స్వాధీనం

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న నలుగురితో పాటు సేవిస్తున్న పది మందిని పెదకాకాని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు ఐదు కేజీల గంజాయి స్వాధీనం చేసుకు న్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరపరచి వివరాలు వెల్లడించారు. పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పాడుబడిన ఓ రేకుల షెడ్డులో నలుగురు గంజాయితో కలిగి ఉన్నారనే సమాచారంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. గంజాయి కొనుగోలు, విక్రయం, వినియోగిస్తు న్నట్లు వారు అంగీకరించారు. ప్రస్తుతం ఏలూరులో ఉంటున్న మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన ముత్యాల రమణారావు అలియాస్ రాఖీ అలియాస్ రాకేష్, పెదకాకానిలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన నూనె యోహాను, తక్కెళ్ళపాడుకు చెందిన పేరం ఓంకార్, నంబూరుకు చెందిన వేమూరి షారోన్ అలియాస్ రాకేష్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి గంజాయి కొనుగోలు చేసి సేవిస్తున్న పెదవడ్లపూడి చెందిన షేక్ సిద్దయ్య అలియాస్ సిద్దు, నంబూరుకు చెందిన మొక్కాల సుధాకర్, పలకలూరి రాకేష్, కేసాని వెంకటేశ్వరరావు, నంబూరు నాగేశ్వరరావు, కుంభ సాయికిరణ్, విశాల్, తక్కెళ్ళపాడుకు చెందిన కె.సువర్ణరాజు, నాగగోపి, పెదకాకానిలోని పాతూరుకు చెందిన షేక్ సమీర్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. కేసులో విశేష ప్రతిభ కనబరిచిన బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలు, రివార్డులు అందించారు. నార్త్ డీఎస్పీ మురళీ కృష్ణ, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ అలహరి శ్రీనివాస్, పెదకాకాని సీఐ నారాయణ స్వామి, ఎస్సైలు మిరాజ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత గొడవలకు రాజకీయ రంగు : సౌత్ డీఎస్పీ

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కొందరు తమ వ్యక్తిగత గొడవలకు రాజకీయరంగు పులమడంపై సౌత్ డీఎస్పీ భానోదయ ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌడవరం శివారు దాసరిపాలెం ఫ్లాట్స్ చంద్ర రాజేశ్వరరావు నగర్‌లో కొంతకాలంగా వేల్పుల శ్రీదేవి, మరికొందరి మధ్య నెలకొన్న వివాదాన్ని ఆమె తన స్వార్థం కోసం రాజకీయాలు అంటగడుతున్నారని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం డీఎస్పీ బానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్ సిబ్బంది సీఆర్ నగర్‌ను సందర్శించి అక్కడి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 15 మందికి శిక్షలు

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 15 మందికి కోర్టు శిక్షలు విధించింది. మద్యం సేవించి వాహనాలు నడిపిన 10 మందిలో ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.7 వేలు, మిగిలిన 8 మందికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. నిబంధనలు అతిక్రమించిన నలుగురు ఆటో డ్రైవర్లకు జైలు శిక్ష విధించారు. మద్యం మత్తులో కారు నడిపినందుకు బెల్లంకొండకు చెందిన కారు డ్రైవర్ అరవింద్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

విభిన్న ప్రతిభావంతులు ఉన్నతంగా జీవించేలా ప్రభుత్వం కృషి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతులు విద్య, ఉపాధి అవకాశాలతో పాటు ఉన్నతంగా జీవించడానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సంక్షేమ కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేస్తుందని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని జిల్లా విభిన్న ప్రతిభావంతులు కార్యాలయం ఆవరణలో ఆదివారం జరిగిన సర్ లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలలో ఆమె పాల్గొన్నారు. సర్ లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న విజువల్లీ చాలెంజ్డ్ అభ్యర్థులకు అవసరమైన అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కొలసాని శ్రీనివాసరావు, నరసింహారావు, రామకృష్ణ రెడ్డి, జాన్ సైదా,బాలాజీ విభిన్న ప్రతిభావంతులు శాఖ ఏడి దుర్గాబాయి, కార్పొరేటర్ పద్మశ్రీ, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు, కన్నా మాస్టర్ పాల్గొన్నారు.

ట్రూడౌన్ చార్జీలతో యూనిట్‌కు రూ.13 పైసలు తగ్గింపు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్



ట్రూడౌన్ చార్జీల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ట్రూడౌన్ అమలు ద్వారా విద్యుత్ చార్జీలు యూనిట్‌కు రూ.13 పైసలు తగ్గాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల విషయంలో సీఎం నారా చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఆదివారం ఆయన ప్రజలకు వివరించారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేనప్పటికీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. జగన్ రెడ్డి పాలనలో అక్వా రైతులకు యూనిట్ రూ.3.50 వసూలు చేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూనిట్ రూ.1.50కు తగ్గించిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ రూఫ్‌టాప్‌లు, బీసీ వర్గాలకు కేంద్రం ఇస్తున్న సబ్సిడీపై అదనంగా రూ.20 వేల అధిక సబ్సిడీని కూటమి ప్రభుత్వం అందిస్తోందని నసీర్ వివరించారు.

ట్రూ అప్ చార్జీలు తగ్గించిన ఘనత సీఎం చంద్రబాబుదే


● పిల్లి మాణిక్యరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి మాణిక్యరావు, టీడీపీ నేతలు

గుంటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతలు లేకుండా, ప్రజలపై విద్యుత్ భారం పడకుండా ట్రూ అప్ చార్జీలు తగ్గించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు అన్నారు. ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో పిల్లి మాణిక్యరావు విలేకరులతో మాట్లాడారు. 2019లో సౌర విద్యుత్‌పై దృష్టి సారించిన చంద్రబాబు, విండ్ పవర్, సోలార్ విద్యుత్‌తో మిగులు విద్యుత్ రాష్ట్రానికి మిగిల్చారన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు అను కూలంగా లేకపోయినా విద్యుత్ రంగాన్ని పక్కా ప్రణాళికతో చంద్రబాబు ముం దంజలో ఉంచారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిన శ్రీనివాసరావు (చిట్టిబాబు) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ట్రూ అప్ భారాన్ని ప్రజలపై తొలగించి ప్రభుత్వమే భరిస్తోం దన్నారు. సమావేశంలో కంచర్ల శివరామయ్య, వేములకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవ్య



ప్రభుత్వాధికారిగా బిజీగా ఉంటూనే... ఒకవైపు క్రీడల్లో రాణిస్తూ, మరోవైపు సామాజిక సేవలో పాలుపంచుకుంటున్న బహుముఖ ప్రజ్ఞాశాలి **బలగా గీతాలక్ష్మి.** అనకాపల్లి జిల్లా చోడవరం సబ్ రిజిస్ట్రార్ అయిన ఆమె ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో మూడు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటారు. ఎంచుకున్న రంగం ఏదైనా తనదైన ముద్ర వేస్తున్న ఆమె 'నవ్య'తో మాట్లాడారు.

ఆటల్లోనూ అదరగొడుతున్నారు!

"మాది ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా అర్తమూరు గ్రామం. మా నాన్నగారు స్వామినాయుడు హిందీపండిట్. అమ్మ అనసూయ గృహిణి. చిన్న వయసునుంచి చదువుతోపాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకున్నాను. మా నాన్నగారి ప్రోత్సాహమే దీనికి కారణం. విద్యార్థినిగా ఉన్నప్పుడు జాతీయ స్థాయిలో ఖోఖో, లాంగ్ జంప్ పోటీల్లో పాల్గొన్నాను. 2000లో డీఎస్సీకి ఎంపికై, 2009 వరకూ ఉపాధ్యాయురాలుగా పని చేశాను. ఆ తరువాత గ్రూప్-2కు ఎంపికై... సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టాను. ఉద్యోగ బాధ్యతల వల్ల కొన్నాళ్లపాటు క్రీడలకు విరామం ఇవ్వాల్సి వచ్చింది. మళ్లీ మూడేళ్ల క్రితం మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ప్రవేశించి, వరుసగా పతకాలు సాధిస్తున్నాను. 2024లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు పతకాలు గెలిచాను. తాజాగా గుంటూరులో నిర్వహించిన 45వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్‌లో మూడు స్వర్ణ పతకాలు (45 ఏళ్ల ప్లస్ విభాగం) సాధించాను. క్రీడలతో పాటు పర్వతారోహణ అంటే నాకు ఎంతో ఇష్టం. కష్టమైనప్పటికీ పట్టుదలతో ప్రయత్నించాను. మొదట తూర్పు కనుమల్లో ఎత్తయిన 5,540 అడుగుల జిందఘడ శిఖరాన్ని ఎక్కాను. 2024 అక్టోబర్‌లో హిమాలయాల్లో 12,110 అడుగుల చంద్రశిల శిఖరాన్ని, 2025 ఏప్రిల్‌లో 11,830 అడుగుల ఎత్తయిన దయారాబుగేల్ పర్వతాన్ని అధిరోహించాను. జాతీయ స్థాయితో పాటు, ఏషియన్ మాస్టర్స్ గేమ్స్‌లో సైతం పతకాలు సాధించాలన్నది నా లక్ష్యం.



సామాజిక సేవలో...

ప్రస్తుతం అనకాపల్లి జిల్లా చోడవరం సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్నాను. నేను బాధ్యతలు తీసుకొనే సమయానికి మా కార్యాలయం దయనీయ స్థితిలో ఉండేది. దాన్ని చక్కగా తీర్చిదిద్దే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాను. కార్యాలయ ఆవరణలో మొక్కలు పెంచి, చిన్న పార్కును అభివృద్ధి చేశాం. రిజిస్ట్రేషన్లకు వచ్చేవారు కూర్చోవడానికి దాతల సాయంతో బల్లలు, వారు చదువుకోవడానికి పుస్తకాలతో చిన్న లైబ్రరీ ఏర్పాటు చేశాను. వాటిని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, స్థానిక ఎమ్మెల్యే రాజు స్వయంగా పరిశీలించి, నన్ను అభినందించారు. సామాజికంగానూ నాకు వీలైన సేవ చేస్తున్నాను. సేవా సంస్థలతో కలిసి చోడవరంతో పాటు వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాల నిర్వహణ, వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు వాటిలో కొన్ని. కళాశాల్లో విద్యార్థినులతో సమావేశాలు జరిపి, మోటివేషన్ క్లాసుల ద్వారా పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలో వివరిస్తున్నాను.

> **వ్యాయామం తప్పనిసరి**
>
> నేను ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ చేశాను. ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నాను. నా భర్త చంద్రరావు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. మాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి పదో తరగతి, అబ్బాయి ఆరో తరగతి చదువుతున్నారు. మహిళలు ఇంటిపనిలో, వంటపనిలోనే కాదు, అన్ని రంగాల్లో రాణించగలరు. దానికి కావలసిందల్లా ప్రణాళిక, సమయపాలన. సమయాన్ని అనవసరమైన విషయాలకు వృథా చేయకుండా... ప్రతి పనినీ ప్రణాళిక ప్రకారం చేస్తూ వెళ్లాలి. అంతేకాదు... మహిళలందరూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. దానివల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడంతో పాటు, ఏకాగ్రత పెరుగుతుంది."

• వేపాడ జోజి, చోడవరం



అతివల అందాన్ని రెట్టింపు చేసే బ్యూటీ సెలూన్లు ప్రతి చోటా ఉన్నాయి. కానీ 'ది నెస్ట్' అన్నిటికన్నా విలక్షణం. యాసిడ్ దాడి బాధితులకు అక్కడ ప్రత్యేక సౌందర్య సేవలు ఉచితంగా లభిస్తాయి. "ఇది బాధితుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే చిన్న ప్రయత్నం" అంటున్నారు దాని వ్యవస్థాపకురాలైన అడ్వకేట్ **హరితా మెహతా.**

వారి కోసం... ఒక చిన్న ప్రయత్నం

"యాసిడ్ దాడిలో బాధితులైన మహిళలు శారీరకంగా ఎంతో బాధ అనుభవిస్తారు. అయితే, తమ రూపం వికృతంగా మారిందనే వేదన... శారీరకమైన బాధకన్నా పెద్ద నరకం. తమను తాము అద్దంలో చూసుకోవడానికి కూడా వారు భయపడుతూ ఉంటారు. వీధుల్లోకి వచ్చి జనం ముందు తిరగడానికి ఇష్టపడరు. తమను తామే బందీలుగా చేసుకుంటారు. ఈ విషయాన్ని చాలా దగ్గరగా గమనించాను. నేను ఢిల్లీ హైకోర్టులో సీనియర్ న్యాయవాదిని. మహిళా హక్కుల కార్యకర్తను కూడా. పలు సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశాను. 'ఢిల్లీ కమిషన్ ఫర్ ఉమెన్' (డిసిడబ్ల్యు)తో కలిసి పని చేశాను.






యాసిడ్ బాధిత మహిళలకు బ్యూటీ, వెల్‌నెస్ సేవలన్నీ ఉచితం. ఇది కేవలం సెలూన్ కాదు... ఒక ఆశ్రయం.

కావలసింది సానుభూతి కాదు....


మహిళలపై అత్యాచారాల కేసుల్లో వివరాలు సేకరించడానికి ఎయిమ్స్ లాంటి ప్రదేశాలకు వెళ్లినప్పుడు... యాసిడ్ బాధిత మహిళల దుస్థితిని ప్రత్యక్షంగా చూశాను. వారి రోదనలు నన్ను తీవ్రంగా కదిలించాయి. మెహెర్ ఫౌండేషన్ ద్వారా వారికి సాయం అందించేదాన్ని. బాధితులతో మాట్లాడినప్పుడు...ఎన్నో విషయాలు అర్థమయ్యాయి. వారికి కావలసింది సానుభూతి కాదు. నిజానికి అది వారిని మరింత కుంగదీస్తోంది. ఈ ప్రపంచంలో ఎక్కడా తమకు స్థానం లేదనే నిరాశలో ఉన్న ఆ మహిళల్లో ఆత్మస్థైర్యం నింపడం, సమాజంలో హుందాగా జీవించడానికి వీలు కల్పించడం, అంతకన్నా ముఖ్యంగా దాడుల్లో దెబ్బతిన్న తమ రూపాల పట్ల ఉన్న న్యూనతను తొలగించడం ముఖ్యం అని గ్రహించాను. అలా 'ది నెస్ట్' ఏర్పాటుకు బీజం పడింది.

అందానికి నిర్వచనం...

ఢిల్లీలో ఇటీవల నేను ఏర్పాటు చేసిన ఈ బ్యూటీ సెలూన్ అన్ని విధాలుగానూ విలక్షణమైనది. ఇందులో అందరికీ సేవలు అందిస్తాం. అయితే అనవసరమైన చూపులు వారి మీద ప్రసరించకుండా... వ్యక్తిగత వివిఐపి గదుల్లో సేవలు అందుకోవచ్చు. అద్దం ముందు ఎలాంటి సంకోచం లేకుండా కూర్చోవచ్చు. వారి హుందాతనానికే ప్రాధాన్యత ఇస్తున్నాం. సేవలు అందించేవారు వారిని ఎంతో గౌరవంగా చూస్తారు. ఇక్కడ అందానికి నిర్వచనం ఆకట్టుకొనే రూపం కాదు... ఆత్మ గౌరవం, ఆత్మ స్థైర్యం. 'సమాజంలో మేమూ భాగమే' అనే భావన వారిలో కలిగించడమే మా ధ్యేయం. సెలూన్ ద్వారా వచ్చే లాభాలను యాసిడ్ దాడి బాధితుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలన్నది నా ఆలోచన. దీని గురించి తెలిసి వనరులు సమకూర్చడానికి కొందరు ముందుకు వస్తున్నారు. సహానుభూతి, సమ్మిళితత్వం ద్వారా అందాన్ని పునర్నిర్వచించడానికి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచడానికి నేను చేపట్టిన ఈ చిన్న ప్రయత్నం గొప్ప ఫలితాలు ఇస్తుందనే నమ్మకం నాకుంది."



ముత్యాల ముగ్గు





శ్రావణి తలారి,
భీమునిపాడు, నంద్యాల

21 చుక్కలు ఒకటి వచ్చే వరకు





19 చుక్కలు 10 వచ్చే వరకు మధ్యచుక్క

ఆర్. ఇందిర,
కురుపాం,
విజయనగరం జిల్లా

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

పిల్లలకు ఇవి నేర్పించాలి

పిల్లలు సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని తల్లిదండ్రులు కోరుకుంటూ ఉంటారు. అందుకోసం పిల్లలకు చిన్నప్పటి నుంచి ఏ అంశాలు నేర్పించాలో తెలుసుకుందాం...



- రోజూ ఉదయాన్నే నిద్ర లేవడం, వ్యాయామం చేయడం, పోషకాహారం తీసుకోవడం, సమయానుసారం నిద్రించడం అలవాటు చేయాలి.
- శ్రద్ధగా పాఠాలు చదవడంతోపాటు ఆటలు ఆడడం, పుస్తక పఠనం, ఆసక్తి ఉన్న కళలను నేర్చుకోవడం లాంటి వాటి ఆవశ్యకతను తెలియజెప్పాలి. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించాలి.
- కుటుంబ సభ్యులతోపాటు బంధుమిత్రులు, పెద్దలు, తోటివారితో గౌరవంగా ఎలా మెలగాలో తెలియజేయాలి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, కోపాన్ని అదుపులో ఉంచుకోవడం, సౌమ్యంగా మాట్లాడడం నేర్పించాలి.
- గెలిచినప్పుడు పొంగిపోవడం, ఓడినప్పుడు కుంగిపోవడం కాకుండా భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం నేర్పించాలి. సవాళ్లను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో వివరించాలి.
- నిజాయితీగా మెలగడంతోపాటు కష్టపడే మనస్తత్వాన్ని అలవాటు చేయాలి. డబ్బు విలువను తెలియజెప్పాలి. డబ్బును పొదుపు చేయడం, ఖర్చు చేయడం లాంటి ఆర్థిక నిర్వహణ పాఠాలను పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి.
- పిల్లల్లో స్నేహభావాన్ని పెంచుతూ పరస్పర సహకారంతో మెలగడం నేర్పించాలి. ఇచ్చిపుచ్చుకునే ధోరణిని అలవాటు చేయాలి.
- ఆత్మవిశ్వాసంతో వ్యవహరించడం, భావ వ్యక్తీకరణ, చిన్న చిన్న బాధ్యతలను నిర్వర్తించడం లాంటి వాటిని విధిగా నేర్పించాలి.

దంతాల పసుపుదనం పోయేదెలా?



కొంతమందికి దంతాలు పసుపు రంగులోకి మారుతుంటాయి. వాటిని తెల్లగా మార్చే చిట్కాలివే...

- ఒక పళ్లెంలో రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి కొన్ని నీళ్లు చిలకరించి పేస్టులా చేయాలి. దీంతో దంతాలను సున్నితంగా తోమాలి. ఆపైన గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే దంతాల పసుపుదనం తొలగిపోతుంది.
- బాగా పండిన స్ట్రాబెర్రీ పండ్లు నాలుగింటిని గిన్నెలోకి తీసుకుని చెంచాతో మెదిపి గుజ్జులా చేయాలి. దీంతో తోముకుంటే గార, పసుపుదనం తొలగి దంతాలు తెల్లగా మెరుస్తాయి. స్ట్రాబెర్రీలో ఉండే మాలిక్ యాసిడ్ మంచి బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల యాపిల్ సైడర్ వెనిగర్, రెండు చెంచాల నీళ్లు తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమంలో టూత్‌బ్రష్‌ను ముంచి దానితో దంతాలు తోముకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.
- నారింజ తొక్కలు లేదంటే అరటిపండు తొక్కలను చిన్న ముక్కలుగా చేసి బాగా ఎండబెట్టి మెత్తటి పొడిలా చేయాలి. దీంతో తోముకున్నా దంతాలు తెల్లగా మారతాయి.
- రెండు రోజులకోసారి మూడు చెంచాల కొబ్బరి నూనెను నోట్లో వేసుకుని కనీసం పది సెకన్లపాటు పుక్కిలిస్తే ప్రయోజనం ఉంటుంది.
- తరచూ జామ, యాపిల్, క్యారెట్, స్ట్రాబెర్రీలను తింటూ ఉంటే దంతాలు పసుపు రంగులోకి మారవు.
- కాఫీ, టీలను ఎక్కువగా తాగకూడదు. మద్యపానం, ధూమపానం లాంటి అలవాట్లకు దూరంగా ఉంటే దంతాలు ఎప్పుడూ తెల్లగా మెరుస్తుంటాయి.

సంకల్పం

అందరి బంధువులు

వీధుల్లో విశ్రమించేవారు... ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమయ్యేవారు... ఏ దిక్కూ లేక బతుకు భారంగా మారినవారికి ఆధారం అయ్యారు. ఆకలితో ఉన్నవారి కడుపు నింపి... అణగారిన కుటుంబాల పిల్లలకు విద్య, విలువలు నేర్పి... చక్కని భవితను అందిస్తున్నారు... నళిని, దామోదరన్ దంపతులు. మూడున్నర దశాబ్దాలుగా జీవితాన్ని సేవకే అంకితం చేసి... తమ చుట్టూవున్న సమాజ అభ్యున్నతి కోసం సొంత నిధులను వెచ్చిస్తున్న ఈ అందరి బంధువుల ప్రయాణం... నళిని మాటల్లోనే.



"ఇప్పుడు మావారు దామోదర్‌కు డెబ్బై రెండేళ్లు. నాకు అరవై ఏడు. పెళ్లయిన నాటి నుంచీ మా ఇద్దరి అభిప్రాయాలూ ఒక్కటే... సామాజిక సేవలో. అయితే దీన్ని మేం సేవగా అనుకోలేదు. అది మా జీవన విధానంలో భాగంగా భావించాం. ముప్పై ఏళ్ల కిందట మొదలైంది మా ఈ ప్రయాణం. తమిళనాడు రాష్ట్రం... దిండిగల్ మా స్వస్థలం. మావారు దామోదరన్ చార్టెడ్ అకౌంటెంట్. రియల్టర్ కూడా. రైతు బిడ్డ. ఓ స్నేహితుడి సాయంతో 1982లో సీఏ పూర్తి చేసిన ఆయన... రియల్ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టారు. అందులో మంచి లాభాలు రావడంతో... ఆ రంగంపై మరింత దృష్టి సారించారు. కొన్నేళ్ల తరువాత వెనక్కి తిరిగి చూసుకొంటే... ఈ ప్రయాణంలో తనకు ఎంతో ఇచ్చిన ఈ సమాజం గురించి ఆలోచించడం మరిచిపోయానని ఆయనకు అనిపించింది. అదే సేవ వైపు నడిపించింది. మా పెళ్లి తరువాత తన ఆలోచనలను నాతో పంచుకున్నారు. ఇరువురి అభిప్రాయాలూ కలవడంతో... నేను కూడా ఆయన మార్గంలోనే నడవాలని నిర్ణయించుకున్నాను.





రోజూ వందమందికి...

అది 1990. మావారు బిజినెస్ పని మీద తరచూ వివిధ ప్రాంతాలకు వెళుతుంటారు. ఎక్కడికి వెళ్లినా ఆయన్ను బాగా ఆలోచింపజేసిన అంశం... బిచ్చగాళ్లు. ఇంత అన్నం కోసం అభ్యర్థించడం, వారిలో చాలామంది మానసిక రోగులు కూడా ఉండడం చూసి బాధపడ్డారు. ఇంటికి వచ్చాక కూడా వారి గురించి మాట్లాడేవారు. చివరకు ఒకరోజు అనుకున్నాం... వాళ్లందరి ఆకలి తీర్చాలని. నాటి నుంచి మా పట్టణంలోని ఆసుపత్రులు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, వీధుల్లోని బిచ్చగాళ్లు, అనాథలు, ఏ ఆధారం లేని వృద్ధులకు కడుపు నిండా భోజనం పెడుతున్నాం. ప్రతిరోజూ వందమందికి ఉచితంగా ఆహారం అందిస్తున్నాం. చాలా సంవత్సరాలు నేను వండి, ప్యాకింగ్ చేసేదాన్ని. ఆయన తన స్కూటర్‌పై పెట్టుకుని పంపిణీ చేసేవారు. తరువాత ఒక వంటమనిషిని, డెలివరీ కోసం కొంతమంది హెల్పర్స్‌ను పెట్టుకున్నాం.

ఫ్యామిలీ కౌన్సెలింగ్...

కొన్నాళ్ల తరువాత మేం ఫ్యామిలీ కౌన్సెలింగ్ కూడా ప్రారంభించాం. ఎందుకంటే... చిన్న వయసులోనే భర్తను పోగొట్టుకున్న మహిళలు మానసిక ఒత్తిడికి లోనై భవిష్యత్తును అంధకారం చేసుకొంటున్నారు. ఇలాంటివి ఎన్నో నా దృష్టికి వచ్చాయి. అలాంటివారిని గుర్తించి, కౌన్సెలింగ్ ఇస్తున్నాను. ధైర్యం చెప్పి, వృత్తి విద్యలు నేర్పించి, ఉపాధి మార్గాలు చూపిస్తున్నాను. దీనివల్ల చాలామందికి ప్రయోజనం చేకూరింది. నేను ఎకనామిక్స్‌లో డిగ్రీ చదివాను. టైలరింగ్‌లో డిప్లమా కూడా పూర్తయింది. ఇన్నేళ్లుగా ఈ మార్గంలో నడవడం వల్ల విభిన్న పరిస్థితులు, మనుషులు, వారి స్థితిగతులపై ఒక అవగాహన ఏర్పడింది. అందరికీ ప్రయోజనకరంగా ఉండేలా నాలుగు నెలల టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సును తయారు చేశాను. 2018 నుంచి విడతలవారీగా ఉచిత శిక్షణ ఇస్తున్నాను. ఇప్పటికి 28 బ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఒక్కో బ్యాచ్‌కు ఇరవై మంది మహిళలు ఉంటారు. ఏదిఏమైనా... వేరొకరి అవసరం తీర్చడం, జీవితాన్ని నిలబెట్టడానికి మించిన ఆత్మసంతృప్తి మరెందులోనూ లభించదు. ఆ సంతృప్తి, సంతోషమే మాకు పిల్లలు లేరన్న లోటు కూడా తెలియకుండా చేస్తోంది."

> **ఉత్తీర్ణత పెరిగింది...**
>
> ఉచిత భోజన పంపిణీతో మొదలైన మా సేవను క్రమంగా మరిన్ని రంగాలకు విస్తరించాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, స్టేషనరీ అందించాం. ఆ సమయంలో పాఠశాలలను సందర్శించినప్పుడు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం గమనించాం. కొన్ని స్కూళ్లకు బెంచీలు ఇచ్చాం. అలాగే చదువులో విద్యార్థులను ప్రోత్సహించేందుకు 400 మార్కులు దాటినవారికి ఫీజులో యాభై శాతం మేమే చెల్లిస్తామని ప్రకటించాం. అది అద్భుత ఫలితాలను ఇచ్చింది. అనూహ్యంగా ఉత్తీర్ణత శాతం పెరిగింది. మధ్యతరగతి కుటుంబాలపై భారం తగ్గింది.

26,700 పైన బుల్లిష్

(జనవరి 5-9 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ట్రెండ్ గైడ్

నిఫ్టీ గత వారం 26,340-25,879 పాయింట్ల మధ్యన కదలాడి 287 పాయింట్ల లాభంతో 26,329 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 26,010, 25,953, 25,467, 24,970 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 26,700 బ్రేక్‌డౌన్ స్థాయి: 26,000
నిరోధ స్థాయిలు: 26,525, 26,625, 26,725
(26,425 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 26,125, 26,025, 25,925
(26,225 దిగువన బేరిష్)

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	150	విజయవాడ	152
వరంగల్	150	గుంటూరు	157
కరీంనగర్	150	ఒంగోలు	157
మహబూబ్‌నగర్	150	చిత్తూరు	151
కర్నూలు	150	నెల్లూరు	156
విశాఖపట్నం	143	అనంతపురం	156
గోదావరి	152		

వెనెజువెలాపై దాడితో
పసిడి, వెండి ధరలు ఎటు..?



రూ.9,000 కోట్ల బకాయిలకు మార్గం సుగమం..

న్యూఢిల్లీ: గత ఏడాది బంగారం, వెండి మదుపరులకు బంపర్ లాభాలు పంచాయి. పసిడి పెట్టుబడులు 73.45 శాతం లాభాలు పంచితే, వెండిలో పెట్టుబడులు 164 శాతం లాభాలు పంచాయి. అయితే వెనెజువెలాపై అమెరికా తాజా దాడితో వచ్చే కొద్ది రోజుల్లో బంగారం, వెండి, చమురు ధరలపై ఈ ప్రభావం ఎలా ఉంటుంది? అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. మార్కెట్ వర్గాలు మాత్రం స్వల్పకాలిక ఆటుపోట్లు తప్ప ఇప్పటికిప్పుడు ఈ ప్రభావం మార్కెట్లపై పెద్దగా ఉండకపోవచ్చంటున్నారు. కాకపోతే ప్రస్తుత అనిశ్చితి నేపథ్యంలో సోమవారం పసిడి, వెండి ధరలు కొద్దిపాటి లాభాలతోనే ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే కేంద్ర బ్యాంకులు, గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌ల కొనుగోళ్లు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, డాలర్ మారకం రేటు, అమెరికా వడ్డీ రేట్లు, సరఫరా-డిమాండ్ వ్యత్యాసాలే ముున్ముందు ఈ రెండు లోహాల ధరలను ప్రభావితం చేయనున్నాయి. ఇటీవల కొద్దిగా కరెక్షన్‌కు లోనైన వెండి ధర మళ్లీ పుంజుకుంటోంది. వెండి ఎగుమతులపై చైనా ఆంక్షలు ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పెరుగుతున్న పారిశ్రామిక వినియోగం కూడా ఇందుకు దోహదం చేస్తోంది. దీంతో ఈ ఏడాది చివరికల్లా ఔన్స్ (31.1 గ్రాములు) మేలిమి బంగారం 5,400 డాలర్లకు, ఔన్స్ వెండి 100 డాలర్లకు చేరే అవకాశం ఉందని జేపీ మోర్గాన్ అంచనా వేస్తోంది. మరోవైపు ముడి చమురు ధరలో మాత్రం పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. కాగా ప్రస్తుతం బ్రెంట్ రకం బ్యారల్ ముడి చమురు 60.75 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

అమెరికా ఆంక్షల కారణంగా 2020 నుంచి వెనెజువెలాతో మన దేశానికి పెద్దగా ఆర్థిక, వాణిజ్య సంబంధాలు లేవు. దీంతో సోమవారం మన స్టాక్ మార్కెట్‌పై తాజా పరిణామాల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని మార్కెట్ వర్గాల అంచనా. అయితే వెనెజువెలా నుంచి ఓఎన్‌జీసీ విదేశ్‌తో సహా అనేక కంపెనీలకు దాదాపు 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.9,000 కోట్లు) బకాయిలు రావాల్సి ఉంది. వెనెజువెలాలో అంతర్గత పరిస్థితులు త్వరగా చక్కబడితే ఆ బకాయిల వసూళ్లు గాడిన పడే అవకాశం ఏర్పడుతుంది. అమెరికా ఆంక్షలు కూడా ఎత్తివేస్తే ఆ దేశం నుంచి భారత్‌కు పెద్దమొత్తంలో చమురు దిగుమతులకు మార్గం సుగమమవుతుంది. అదే జరిగితే చమురు ధరలపై రష్యా, పశ్చిమాసియా దేశాలతో మన దేశం బేరసారాలు సాగించేందుకు వీలవుతుంది. రష్యా నుంచి చమురు దిగుమతులు తగ్గితే భారత-అమెరికా వాణిజ్య ఒప్పందానికి మార్గం సుగమమవుతుంది. అయితే వెనెజువెలాపై అమెరికా ఆంక్షలు కొనసాగితే మాత్రం ప్రస్తుత పరిస్థితే కొనసాగుతుంది.

హైదరాబాద్‌లో రెయిన్‌బో జెల్ల చేపల ఉత్పత్తి కేంద్రం

న్యూఢిల్లీ: శీతల ప్రాంతాల్లో మాత్రమే పెరిగే రెయిన్‌బో ట్రౌట్ (ఇంద్రధనుస్సు జెల్ల) చేపల ఉత్పత్తికి తెలంగాణ సిద్ధమవుతోంది. ఈ చేప పిల్లల ఉత్పత్తి కోసం స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ లిమిటెడ్ సంస్థ రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేసింది. కేంద్ర మత్స్య, పశు సంవర్థక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సోమవారం ఈ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. చర్మంపై ఇంద్రధనుస్సు ఆకారంలో మచ్చ ఉండడం ఈ జాతి జెల్లల ప్రత్యేకత. అధిక ధర ఉండే ఈ జెల్లలు శీతల ప్రాంతాల్లోని నదీ జలాలు, కాలువలు, సరస్సుల్లో మాత్రమే పెరుగుతాయి. మన దేశంలో హిమాలయాల ప్రాంతంలోని నదులు, కాలువలు, సరస్సుల్లో మాత్రమే ప్రస్తుతం ఇవి లభిస్తున్నాయి. ఉష్ణమండల ప్రాంతంలో నియంత్రిత ఉష్ణోగ్రతలతో వీటి పెంపకం కందుకూరు మండలంలోనే తొలిసారిగా ప్రారంభం కానుంది.

27న బ్యాంక్ ఉద్యోగుల సమ్మె!

న్యూఢిల్లీ : బ్యాంకింగ్ ఉద్యోగులు మరోసారి సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఐదు రోజుల పని దినాల కోసం ఈ నెల 27న దేశవ్యాప్తంగా సమ్మెకు దిగనున్నారు. 2024 మార్చిలో కుదిరిన వేతన ఒప్పందంలో ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) ఇందుకు ఒప్పుకున్నా.. ఇప్పటికీ అమలు చేయనందున ఈ సమ్మెకు దిగుతున్నట్టు తొమ్మిది ఉద్యోగ సంఘాలకు ప్రాతినిధ్యం వహించే యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ప్రకటించింది. ప్రస్తుతం బ్యాంకింగ్ ఉద్యోగులకు ఆదివారాలతో పాటు ప్రతి నెలా రెండో, ఆఖరి శనివారాలు సెలవులు. అయితే ఒకటి, మూడో శనివారాలను కూడా ఇందులో కలపాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఆర్‌బీఐ, ఎల్‌ఐసీ, జీఐసీ వంటి సంస్థలు ఇప్పటికే వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేస్తున్న విషయాన్ని ఉద్యోగ సంఘాలు గుర్తు చేస్తున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	600	విజయవాడ	620
వరంగల్	602	గోదావరి	625
చిత్తూరు	683	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 90	

9 నుంచి బీసీసీఎల్ ఐపీఓ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బొగ్గు ఉత్పత్తి దిగ్గజం కోల్ ఇండియా (సీఐఎల్) అనుబంధ సంస్థ.. భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్) పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 9న ప్రారంభమై 13న ముగియనుంది. ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఉండనుంది. ఈ ఓఎఫ్ఎస్ ద్వారా కోల్ ఇండియా 46.57 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఇష్యూ ధర, లాట్ పరిమాణాన్ని సోమవారం నాడు ప్రకటించనుంది. కాగా పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా ప్రభుత్వం బీసీసీఎల్‌ను మార్కెట్లో లిస్ట్ చేస్తోంది.

ఆచితూచి అడుగేయండి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు మరోసారి జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతున్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లు నిలకడగా సాగుతున్నాయి. అయితే వెనిజువెలా ఉద్రిక్తత మినహా మిగిలిన ఘర్షణలు స్తబ్దుగా మారాయి. ఈ వారం మెటల్, పీఎస్‌యూ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థలు, కమోడిటీస్, ఆటో, ఎనర్జీ, మీడియా రంగ షేర్లు పటిష్ఠతను కనబరిచే అవకాశం ఉంది. అయితే ఇన్వెస్టర్లు ఆచితూచి షేర్లను ఎంపిక చేసుకోవటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

ఇండియన్ బ్యాంక్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 15 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం జోరు ప్రదర్శిస్తోంది. చివరి ఐదు ట్రేడింగ్ సెషన్లలో 12 శాతం మేర పెరిగింది. 10,20,50 మూవింగ్ యావరేజెస్‌ను అధిగమించింది. గత శుక్రవారం రూ.861 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.850 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.925/940 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.840 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పీఎఫ్‌సీ: పదిహేను నెలల క్రితం జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు దాదాపు 45 శాతం మేర పతనమైంది. ప్రస్తుతం టర్న్ అరౌండ్ అవుతోంది. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.375 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.365 శ్రేణిలో ఎంటరై రూ.425 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.350.

హిందాల్కో: గత ఏడాది మే నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. దాదాపు 65 శాతం మేర రాబడిని అందించింది. నిఫ్టీతో పోల్చితే జోరును ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం రూ.925 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.920 శ్రేణిలో ప్రవేశించి రూ.965/980 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.900.

హిందుస్థాన్ జింక్: గత సెప్టెంబరు నుంచి ఈ షేరు 50 శాతానికి పైగా పెరిగింది. ప్రస్తుతం దీర్ఘకాలిక అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. జీవితకాల గరిష్ఠం వైపు పరుగులు తీస్తోంది. గత శుక్రవారం రూ.628 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.601 వద్ద రూ.725 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.600.

ఐఆర్ఈడీఏ: గత ఏడాది జూలై నుంచి ఈ షేరు భారీగా పతనమవుతూ వస్తోంది. ఏకంగా 57 శాతం మేర క్షీణించింది. ప్రస్తుతం కీలకమైన మద్దతు స్థాయి రూ.130 వద్ద టర్న్ అరౌండ్ అయ్యింది. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ గణనీయంగా పెరుగుతోంది. గత శుక్రవారం రూ.146 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.140 ఎగువన ప్రవేశించి రూ.160 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.139.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కొత్త శిఖరాల్లో పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ 26,000 స్థాయిలో బలమైన పునరుజ్జీవం సాధించి వారం ముగిసే నాటికి 286 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయి 26,330 చేరువలో ముగిసింది. కీలక స్థాయి 26,000 వద్ద మూడు నెలల సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం బలమైన రివర్సల్ సాధించడం ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది. అలాగే మిడ్‌క్యాప్-100 సూచీ సైతం బలమైన ర్యాలీ సాధించి గతంలో ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయిని సైతం ఛేదించి 61,365 వద్ద ముగిసింది. టెక్నికల్‌గా మార్కెట్ పాజిటివ్‌గా ప్రారంభం కావచ్చు. సరికొత్త గరిష్ఠ స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీకి మానసిక అవధి 26,550. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించగలుగుతుంది. సరికొత్త గరిష్ఠ స్థాయిల్లో ప్రవేశిస్తున్న కారణంగా పుల్‌బ్యాక్ అవకాశం కూడా ఉంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

బేరిష్ స్థాయిలు: జీవితకాల గరిష్ఠ స్థాయి కావడం వల్ల భద్రత కోసం 26,300 వద్ద మార్కెట్ మద్దతు తీసుకోవడం తప్పనిసరి. విఫలమైతే బలహీనపడే అవకాశాలున్నట్టు భావించి అప్రమత్తం కావాలి. ప్రధాన మద్దతు స్థాయిలు 26,150, 26,000. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 1,140 పాయింట్లు లాభపడి కీలక స్థాయి 60,000 కన్నా స్వల్పంగా పైన ముగిసింది. మరింత పాజిటివ్ ట్రెండ్‌లో పురోగమించినట్టయితే కొత్త శిఖరాలకు చేరుతుంది. మానసిక అవధులు 60,600, 61,000. మద్దతు స్థాయి 60,000 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతగా భావించి అప్రమత్తం కావాలి.

పాటర్న్: ప్రస్తుత అప్‌ట్రెండ్‌ను కొనసాగించాలంటే 26,300 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఈ స్థాయిలో డబుల్ బాటమ్ పాటర్న్ ఏర్పడింది. సానుకూలత కోసం దాని కన్నా పైన నిలదొక్కుకోవాలి. 26,000 స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం:	26,480, 26,550
మద్దతు:	26,300, 26,150

స్పోర్ట్స్

ఒలింపిక్స్ నిర్వహణకు సంసిద్ధం

జాతీయ వాలీబాల్ పోటీల ప్రారంభంలో ప్రధాని మోదీ







వారణాసి: ఒలింపిక్స్ నిర్వహణకు దేశం పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నొక్కి చెప్పారు. మెగా టోర్నమెంట్లకు ఆతిథ్యమివ్వడం ద్వారా పెద్ద సంఖ్యలో క్రీడాకారులు ఎక్కువగా పోటీలలో తలపడే అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. వారణాసిలో 72వ జాతీయ సీనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌ను వీడియో మాధ్యమం ద్వారా ప్రధాని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ '2030 కామన్వెల్త్ క్రీడలు భారత్‌లో జరగబోతున్నాయి. అలాగే 2036లో ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాం' అని అన్నారు. 'గత 10 సంవత్సరాల్లో మనం 20 ప్రధాన అంతర్జాతీయ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం క్రీడారంగంలో దేశానికి పెరుగుతున్న ప్రాబల్యాన్ని సూచిస్తుంది' అని మోదీ చెప్పారు.

వాలీబాల్‌కు దేశ అభివృద్ధికి సారూప్యం: వాలీబాల్ కేవలం క్రీడ కాదని మోదీ అన్నారు. ఆ ఆటకు దేశ అభివృద్ధికి సారూప్యం ఉందని చెప్పారు. 'పట్టుదలకు, సామర్థ్యానికి వాలీబాల్ ఆట ప్రతీకగా నిలుస్తుంది. పరస్పర సహకారం, సమర్థత, జట్టు సన్నద్ధతపైనే విజయం ఆధారపడి ఉంటుందని ఈ ఆట తెలియజేస్తుంది. అలాగే దేశం కూడా అందరి సహకారంతోనే అభివృద్ధి దిశగా పయనిస్తుంది' అని మోదీ పేర్కొన్నారు.

యూపీ కెప్టెన్ లానింగ్



ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టీమ్ యూపీ వారియర్స్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా మాజీ సారథి మెగ్ లానింగ్ పగ్గాలందుకొంది. గత మూడు సీజన్లలోనూ లానింగ్ సారథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఫైనల్ చేరింది. అయితే, ఈ సీజన్ వేలానికి ముందు ఆమెను ఢిల్లీ విడుదల చేయగా.. యూపీ రూ. 1.90 కోట్లకు దక్కించుకొంది. శుక్రవారం నుంచి డబ్ల్యూపీఎల్ నాలుగో అంచె జరగనుంది.

గిల్‌ను తప్పించడం ఆశ్చర్యకరం



న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్ టీమ్ నుంచి శుభ్‌మన్ గిల్‌ను తప్పించడంపై ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఈ వార్తను తాను తొలుత నమ్మలేదన్నాడు. 'ఇటీవలి కాలంలో గిల్ ఫామ్‌లో లేడని తెలుసు.కానీ, వేటు వేస్తారని ఊహించలేదు. అయితే, అతడినే తప్పించారంటే భారత జట్టులో ఎంతమంది ప్రతిభావంతులున్నారో అర్థం చేసుకోవాల'ని పాంటింగ్ అన్నాడు.

పుష్పిత గౌడ్ డబుల్ సెంచరీ

ఆంధ్ర 437 పరుగుల రికార్డు విజయం

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ అండర్-15 మహిళల వన్డే ట్రోఫీ ఎలీట్ గ్రూప్‌లో ఆంధ్ర 437 పరుగుల భారీ తేడాతో సౌరాష్ట్రను చిత్తు చేసింది. నాగ్‌పూర్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 3 వికెట్లకు 472 పరుగులు చేసింది. ఓపెనర్లు పుష్పితగౌడ్ డబుల్ సెంచరీ (205; 99 బంతుల్లో 31 బౌండరీలు, 6 సిక్సర్లు), దీక్ష సెంచరీ (128) చెలరేగి తొలి వికెట్‌కు 249 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. గ్రీష్మ 98 పరుగులు చేసింది. అనంతరం సౌరాష్ట్ర 19.2 ఓవర్లలో 35 రన్స్‌కే కుప్పకూలింది. దీనిలో 14 ఎక్స్‌ట్రాలున్నాయి. ఈ మ్యాచ్‌లో 472 పరుగులు చేసిన ఆంధ్ర 2023-24లో నాగాలాండ్‌పై ఢిల్లీ చేసిన 466 పరుగుల రికార్డును అధిగమించింది.



భారత్‌లో వరల్డ్‌కప్ ఆడబోం!

మా జట్టు వేదికలను మార్చండి ● ఐసీసీకి బంగ్లాదేశ్ విజ్ఞప్తి

ఢాకా: ఐపీఎల్ నుంచి బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ విడుదల వ్యవహారం మరింతగా ముదురుతోంది. బీసీసీఐకి దీటుగా సమాధానమిచ్చే క్రమంలో.. భారత్‌లో జరిగే టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌ల్లో ఆడబోమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తేల్చి చెప్పింది. ఈమేరకు అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకోగా, తమ జట్టు ఆడే వేదికలు మార్చాలంటూ ఐసీసీకి విజ్ఞప్తి సైతం చేసింది. షెడ్యూల్ ప్రకారం ఈ జట్టు తమ గ్రూప్ మ్యాచ్‌ల్లో మూడింటిని కోల్‌కతాలో, ఒకటి ముంబైలో ఆడాల్సి ఉంది. భద్రతా కారణాలరీత్యానే తామీ నిర్ణయం తీసుకున్నట్టు బీసీబీ పేర్కొంది. 'ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో తమ జట్టు ఆటగాళ్లకు భారత్‌లో తగిన భద్రత లభించదనే సందేహం నెలకొంది. అందుకే బంగ్లా ప్రభుత్వ సూచనల మేరకు టీ20 వరల్డ్‌కప్ కోసం మా జట్టు భారత్‌లో పర్యటించదు' అని బీసీబీ తేల్చింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై సాగుతున్న నిరంతర దాడులపై భారత్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో ఐపీఎల్‌లో ఏకైక బంగ్లా ప్లేయర్ ముస్తాఫిజుర్‌ను వెంటనే తొలగించాలంటూ కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై అభిమానులు ఒత్తిడి తెచ్చారు. అటు బీసీసీఐ కూడా అతడిని విడుదల చేయాలని ప్రకటించడంతో ఇరు దేశ క్రికెట్ సంబంధాలు మరింత సున్నితంగా మారాయి. కాగా ఐపీఎల్‌లో ఆడేందుకు ముస్తాఫిజుర్‌కు ఇచ్చిన ఎన్‌ఓసీని బంగ్లా క్రికెట్ బోర్డు వెనక్కి తీసుకుంది.

లిట్టన్ దాస్ నాయకత్వంలో..


ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొనే బంగ్లాదేశ్ క్రికెట్ జట్టును ప్రకటించారు. వచ్చే నెల 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంకలో జరిగే ఈ మెగా టోర్నీలో టాపార్డర్ బ్యాటర్ లిట్టన్ కుమార్ దాస్ నేతృత్వంలో జట్టు బరిలోకి దిగనుంది. అలాగే 15 మందితో కూడిన ఈ జాబితాలో ఇటీవల ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌కు దూరమైన పేసర్ టస్కిన్ అహ్మద్‌ను ఎంపిక చేశారు. అయితే వికెట్ కీపర్ జకెర్ అలీ, మహీదుల్ ఇస్లాం అన్‌కోన్, నజ్ముల్ షంటో చోటు కోల్పోయారు.

మార్చడం అంత సులువు కాదు..!

భారత్‌లో టీ20 వరల్డ్‌కప్ ఆడేది లేదని తేల్చి చెప్పిన బంగ్లాదేశ్ జట్టు ప్రత్యామ్నాయంగా శ్రీలంకలో బరిలోకి దిగాలనుకుంటోంది. కానీ టోర్నీకి మరో నెల మాత్రమే సమయం ఉన్నందున ఈ వేదికల మార్పు అంత సులువు కాదని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి. 'ఒకరి ఇష్టానికి అనుగుణంగా మ్యాచ్‌ల వేదికలను మార్చలేం. ఎందుకంటే ప్రయాణపరంగా చాలా ఇబ్బందులు ఉంటాయి. ప్రత్యర్థి జట్ల గురించి కూడా ఆలోచించండి. వారి విమాన టిక్కెట్లతో పాటు హోటళ్లన్నీ బుక్ అయ్యాయి. లీగ్ దశలో ప్రతీ రోజు మూడు మ్యాచ్‌లుంటాయి. ఇందులో ఓ మ్యాచ్ శ్రీలంకలోనే జరుగుతుంది. బ్రాడ్‌కాస్టింగ్ సిబ్బంది కూడా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కాబట్టి అనుకున్నంత సులభమైతే కాదు' అని బోర్డు అధికారి తేల్చాడు.

'ఐపీఎల్ ప్రసారాలను నిషేధించాలి'

ఢాకా: తమ స్టార్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి తొలగించడంతో రగిలిపోతున్న బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) మరో కీలక నిర్ణయం తీసుకునేలా కనిపిస్తోంది. తమ దేశంలో ఈ లీగ్ ప్రసారాలను నిషేధించాలనుకుంటోంది. ఈమేరకు దేశ సమాచార, ప్రసారశాఖకు విజ్ఞప్తి చేసినట్టు ప్రభుత్వ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ వెల్లడించాడు. బంగ్లా క్రికెట్‌కు అవమానం జరిగితే ఇక ఎంతమాత్రం సహించబోమని, బానిసత్వ రోజులు ముగిసినట్టుగా ఆసిఫ్ హెచ్చరించాడు.



అద్భుతం.. మార్టిన్ కోలుకున్నాడు

మెల్‌బోర్న్: తన సహచరుడు డేమియన్ మార్టిన్ కోలుకున్నాడని ఆస్ట్రేలియా మాజీ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ వెల్లడించాడు. 'గత 48 గంటల్లో అద్భుతం జరిగింది. చికిత్సకు మార్టిన్ స్పందిస్తున్నాడు. అతడు మాట్లాడగలుగుతున్నాడు' అని తెలిపాడు. మెదడువాపు వ్యాధి బారిన పడిన 54 ఏళ్ల ఆస్ట్రేలియా మాజీ బ్యాటర్ మార్టిన్‌ను ఇక్కడి ఓ ఆసుపత్రిలో చేర్చారు. ఈ వ్యాధితో అతడి మెదడు, ఇతర అవయవాలు దెబ్బతినకుండా ఉండేందుకు మార్టిన్‌ను డాక్టర్లు తాత్కాలికంగా కోమాలోకి పంపిన సంగతి తెలిసిందే.

బాక్సర్లకు చేదు అనుభవం

అభాసుపాలైన బీఎఫ్ఐ



నిఖత్‌తో సహా పలువురు స్టార్ల బౌట్లు వాయిదా

గ్రేటర్ నోయిడా: జాతీయ సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటేందుకు ఎంతో ఉత్సుకతతో వేదిక వద్దకు చేరుకున్న బాక్సర్లకు చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం నుంచి నోయిడాలో జరగాల్సిన బాక్సింగ్ పోటీలు షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం రెండుగంటలకు ప్రారంభమవ్వాల్సి ఉండగా, సాయంత్రం 6.30 వరకు మొదలు కాకపోవడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. నిఖత్‌జరీన్ సహ పలువురి బౌట్లు సోమవారానికి వాయిదా పడ్డాయి. జాతీయ బాక్సింగ్ సమాఖ్య అసమర్థతతో పోటీల నిర్వహణ అభాసుపాలైంది. తొలి రోజు మూడు రింగ్‌ల్లో 42 పురుషుల, 38 మహిళల బౌట్లు జరగాల్సి ఉండగా, ఒక్కటే రింగ్ ఏర్పాటు చేయడంతో బాక్సర్లు గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. ఆ తర్వాత పురుషుల బౌట్లు ప్రారంభమైనా మహిళల బౌట్ల గురించి నిర్వాహకులను ఎన్నిసార్లు అడిగినా సరైన సమాచారం లేకపోవడంతో రాత్రి 8 గంటల వరకు వేచి చూసి బాక్సర్లు తిరిగి వెళ్లారు. దీనిపై బాక్సింగ్ సమాఖ్య స్పందిస్తూ రవాణా ఇబ్బందుల కారణంగా సమయానికి ఏర్పాట్లు చేయలేకపోయామని తెలిపింది. అయితే, ఈ టోర్నీకి స్పాన్సర్లు లేకపోవడంతో నిధుల కొరతతో ఏర్పాట్లు సమయానికి చేయలేకపోయారని తెలుస్తోంది. ఇక, పురుషుల బౌట్లలో 52 కిలోల విభాగంలో అమిత్ పంఘల్, సాగర్, లాల్‌రామ్ బట్ శుభారంభం చేశారు.



మరెక్కడైనా జరిగితే.. గగ్గోలే!

● మెల్‌బోర్న్ పిచ్‌పై గవాస్కర్

న్యూఢిల్లీ: యాషెస్ సిరీస్‌లో భాగంగా మెల్‌బోర్న్‌లో జరిగిన టెస్ట్ రెండోరోజే ముగిసింది. ఈ పిచ్‌కు ఐసీసీ ఓ డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. అయితే, ఆస్ట్రేలియాలో కాకుండా మరెక్కడైనా ఇలా జరిగే ఉంటే మాత్రం.. ఏదో అనర్థం జరిగిందని గగ్గోలు పెట్టేవారని భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ విమర్శించాడు. 'ఏదో మిన్ను విరిగి మీదపడినట్టు నానా రచ్చ చేసేవారు. గతంలో అయితే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా అంపైర్లు తప్పుడు నిర్ణయాలు తీసుకొంటే 'మానవ తప్పిదం' అనేవారు. కానీ, ఉపఖండ అంపైర్లు అలా చేస్తే 'మోసం' అంటూ గగ్గోలు పెట్టేవార'ని గవాస్కర్ రాశాడు.

రాణించిన బ్రూక్, రూట్

ఇంగ్లండ్ 211/3 — యాషెస్ ఐదో టెస్ట్

సిడ్నీ : హ్యారీ బ్రూక్ (78 బ్యాటింగ్), జో రూట్ (72 బ్యాటింగ్) అర్ధ శతకాలతో సత్తా చాటడంతో యాషెస్ ఐదో టెస్ట్‌లో తొలిరోజును ఇంగ్లండ్ ప్రశంసనీయంగా ముగించింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే డకెట్ (27), క్రాలీ (16), బెతెల్ (10) విఫలం కావడంతో 57/3తో కష్టాల్లో పడింది. ఈ దశలో బాధ్యతాయుతంగా ఆడిన రూట్, బ్రూక్ నాలుగో వికెట్‌కు అభేద్యంగా 154 పరుగులు జోడించారు. దాంతో వర్షం, వెలుతురు లేమి కారణంగా ఆట నిలిపివేసేసరికి పర్యాటక జట్టు మూడు వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది.

మ్యాచ్‌కు భారీ భద్రత

మూడు వారాల కిందట ఇక్కడి బోండి బీచ్‌లో ఉగ్రవాదులు దాడి చేసి 15 మందిని పొట్టన బెట్టుకున్న నేపథ్యంలో సిడ్నీ టెస్ట్‌కు భారీ భద్రత ఏర్పాటు చేశారు. రైఫిళ్లు ధరించిన పోలీసులు, అశ్విక దళంతోపాటు అల్లర్ల నిరోధక బృందం సభ్యులు డేగ కళ్లతో పహారా కాశారు. ఉగ్రవాదుల కాల్పులకు బలైన వారికి ఆటగాళ్లు మ్యాచ్ ప్రారంభానికి ముందు నివాళి అర్పించాయి. ఇక..కాల్పులకు తెగబడిన వ్యక్తినుంచి తుపాకీని లాక్కుని పలువురి ప్రాణాలను కాపాడిన అల్ అహ్మద్‌ను మైదానంలోకి ఆహ్వానించగా, ఫ్యాన్స్ లేచి నిల్చొని చప్పట్లతో అభినందించారు.

138 ఏళ్లలో తొలిసారి..

ఈ టెస్ట్‌కు ఒక్క స్పెషలిస్టు స్పిన్నర్ కూడా లేకుండా బరిలో దిగడం ద్వారా ఆస్ట్రేలియా చరిత్ర సృష్టించింది. సిడ్నీ క్రికెట్ మైదానంలో 1888 తర్వాత ప్రత్యేక స్పిన్నర్ లేకుండా ఆసీస్ జట్టు టెస్ట్ ఆడడం ఇదే తొలిసారి. టాడ్ మర్ఫీకి కాకుండా ఆల్‌రౌండర్ బ్యూ వెబ్‌స్టర్‌కు కంగారూలు తుది జట్టులో స్థానం కల్పించారు.

ఎక్స్‌పర్ట్ వాయిస్



ఆసక్తిపరులకే అనువైనది ఆతిథ్య రంగం



ఇంటర్‌లో ఏ గ్రూప్ తీసుకున్నప్పటికీ చేయదగ్గ కోర్సుల్లో హోటల్ మేనేజ్‌మెంట్ ఒకటి. ఆహారం అంతకుమించి ఆతిథ్యంపై ఆసక్తి ఉంటే, బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సును ఎంపిక చేసుకోవచ్చు. హోటల్ మేనేజ్‌మెంట్ ఒక కోర్సుగా రూపు తీసుకోవడానికి ముందు నుంచి ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్(ఐహెచ్‌ఎం) మాజీ ప్రిన్సిపాల్, ప్రస్తుతం పయనీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఛైర్మన్ సాక సుధాకుమార్ వివరించారు.

అతిథి దేవోభవ మన సంస్కృతిలోనే ఉంది. ఇంటికి వచ్చే బంధువుల నుంచి స్నేహితుల వరకు ఎవరికైనా చక్కని మర్యాద చేయడం కూడా మన ఆచారం. ఎంతో కొంత చెల్లించి పూటకూళ్ళమ్మ ఇంటిలో ఆహారం తీసుకోవడం, అక్కడికి దగ్గర్లో ఉండే సత్రాల్లో రాత్రికి ఉండటం ఈ రంగానికి సంబంధించిన మొదటి వాణిజ్య రూపం. అయితే ఆ ఆతిథ్య రంగం కాస్తా నేడు నక్షత్రాల హోటళ్ళ స్థాయికి చేరింది.

- నిజానికి ఈ ఆతిథ్యం ఒక శాస్త్రీయమై కోర్సుగా 1893లో స్విట్జర్లాండ్‌లో ఆరంభమైంది. అది కాస్తా మన దేశానికి వచ్చేసరికి 50 సంవత్సరాలకుపైనే పట్టింది. మన దేశంలో ముంబైలోని దాదర్‌లో 1954 ఐఎల్‌ఓ సహకారంతో మొదట సర్టిఫికెట్ కోర్సుగా ఆరంభమైంది. అనంతరం డిప్లొమాగా రూపుమార్చుకుంది. తదుపరి రోజుల్లో డిగ్రీ, పీజీ కోర్సులు ఆరంభమయ్యాయి.

- జాతీయ పోషకాహార నిపుణురాలైన తంగం ఎలిజెబెత్ ఫిలిప్ ఆతిథ్య విద్యకు ఆద్యురాలు. అత్యున్నత స్థాయిలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను తొలుత ఆమె ప్రతిపాదించారు. ఈ కోర్సు నిర్వహణ కోసం ప్రతి రాష్ట్రంలో ఒక కాలేజీని ఏర్పాటు చేయాలని కోరారు. అప్పుడు కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో 21 ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలను ఆరంభించింది. వీటన్నింటికీ అనుసంధానకర్తగా ఎన్‌సీహెచ్‌ఎంసీటీ(నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్)ని 1982లో నోయిడాలో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. కోర్సు ప్రమాణాలను నిలబెట్టే కృషిలో నిమగ్నమైంది. కోర్సుకు అవసరమైన సిలబస్ నుంచి పరీక్షలు, అలాగే అడ్మిషన్స్ వరకు అన్ని చర్యలను చేపట్టింది. ఇంజనీరింగ్‌కు ఐఐటీ, మెడిసిన్‌కు ఎయిమ్స్ మాదిరి ప్రాధాన్యం పొందింది. అలాగే గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఆఫర్ చేస్తున్న బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చేసిన విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌ను చేపట్టింది. టాప్ ర్యాంక్ ఉన్న హోటల్స్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా, కార్పొరేట్ ట్రైనీలుగా ఆరంభంలో అడుగుపెట్టేందుకు వీలు కల్పించింది.



- పాసైన విద్యార్థుల్లో 75 శాతం మంది జాబ్స్ పొందుతారు. మరో పాతిక శాతం మంది ఉన్నత చదువులను ఎంచుకుంటారు. నిజానికి ఐహెచ్‌ఎంలో సీటు పొందడమంటేనే జాబ్ వచ్చినట్లు లెక్క.
- ఆసక్తి అంతకుమించి అనురక్తితో చదివితేనే ఈ రంగం అద్భుతంగా ఉంటుంది. మూడేళ్ళ కోర్సులో భాగంగా నాలుగో సెమిస్టర్‌లో స్టార్ హోటల్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఉంటుంది. అక్కడి సిబ్బంది ఇచ్చే శిక్షణ, స్ఫూర్తితో ముందుకు వెళితే మున్ముందు కెరీర్‌లో ఇక తిరుగుండదు.
- జాబ్స్ విషయానికి వస్తే, హోటల్ రంగంలో ఫ్రంట్ ఆఫీస్ అంటే రూమ్ రిజర్వేషన్, గెస్ట్ చెక్‌ఇన్ - చెక్‌ఔట్, అకౌంట్స్, సేల్స్ వస్తాయి. అకౌంట్స్/ లాబీ మేనేజర్‌గా ఆపై హోటల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా ఎదుగుతారు.
- ఫుడ్ అండ్ బెవరేజ్ డిపార్ట్‌మెంట్ మరొకటి. ఇక్కడ ఆర్డర్ తీసుకోవడం నుంచి ఆహారాన్ని గెస్ట్‌కు అందించడం, టీమ్ లీడర్‌షిప్ ఉంటాయి. రెస్టారెంట్ మేనేజర్, ఎఫ్ అండ్ బి కంట్రోలర్, సేల్స్ హెడ్‌గా ఉన్నతికి అవకాశం ఉంటుంది.
- కిచెన్‌లో కొమిస్‌గా స్టార్ట్ అవుతుంది. అంటే ఎంట్రీస్థాయిలో కుక్ అని అర్థం. సెక్షన్ హెడ్, సూస్ చెఫ్(సెకండ్ ఇన్ కమాండ్), ఎగ్జిక్యూటివ్ చెఫ్, ఎఫ్ అండ్ బి డైరెక్టర్‌గా ఎదిగే అవకాశం ఉంటుంది.
- హౌస్ కీపింగ్ ఇంకో విభాగం. హోటల్‌ను నీట్‌గా మెయింటైన్ చేయడంలో వీరిది ప్రధాన పాత్ర. ఫ్లోర్ సూపర్వైజర్, ఎగ్జిక్యూటివ్ ఇన్ హౌస్‌కీపింగ్ చీఫ్‌గా వీరి ఉన్నతి ఉంటుంది. మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరిన వ్యక్తి 24 సంవత్సరాలు సర్వీస్‌లో ఉంటే హోటల్ రంగంలో అత్యున్నత స్థానంలో ఉండే అవకాశం లభిస్తుంది.
- హోటల్ రంగంలో చాలావరకు రాణించే అవకాశాలు ఉంటాయి. లేకుంటే రిటైల్ రంగంలోకి వెళ్ళవచ్చు. ఫెసిలిటీ మేనేజర్‌గా మారవచ్చు. అలాగే సేల్స్ అండ్ మార్కెటింగ్‌లోకి వెళ్ళచ్చు.

వీరికి అస్సలు వద్దు

- ఆరోగ్యం అంత బాగా లేని వారు, ఎలర్జీలతో బాధపడుతున్న వ్యక్తులు ఈ రంగంలోకి రాకూడదు.
- సీరియస్ లుక్, రిజిడ్ మెంటాలిటి ఉంటే పనికిరారు.
- ఛాందస భావాలు ఉన్న వ్యక్తులు ఇమడలేరు.
- మాంసాహారాన్ని ఇష్టపడని వారికి కూడా ఇది అనుకూలమైన ప్రొఫెషన్ ఎంత మాత్రం కాదు.

బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ అడ్మిషన్ టెస్ట్‌కు ఎన్‌టీఏ నోటిఫికేషన్

నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ - 2026కి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయ, రాష్ట్ర అలాగే ప్రైవేటు రంగంలోని మొత్తం 80 సంస్థలు అందించే బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులో ప్రవేశానికి ఈ టెస్టును ఉద్దేశించారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియర్ సంస్థ హైదరాబాద్‌లోని ఐహెచ్‌ఎంకు తోడు రాష్ట్ర స్థాయిలోని డాక్టర్ వైఎస్ఆర్ నిథిమ్, ఎస్ఐహెచ్‌ఎం, మెదక్; ఎస్ఐహెచ్‌ఎం, తిరుపతి; ప్రైవేటు రంగంలోని ఐహెచ్‌ఎం శ్రీశక్తి, హైదరాబాద్ కూడా ఉన్నాయి.

అర్హత: ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.

పరీక్ష విధానం: ఆబ్జెక్టివ్ టైప్ పరీక్ష ఇది. హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రశ్నలు ఉంటాయి. న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్‌లో ఒక్కోదానిలో 15, ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో 45, ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్‌లో 30 మొత్తం 120 ప్రశ్నలు అడుగుతారు. సమాధానం తప్పుగా గుర్తిస్తే నాలుగు మార్కులు ఇస్తారు. తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కట్ చేస్తారు.

పరీక్ష తేదీ: ఏప్రిల్ 25 **దరఖాస్తుకు ఆఖరు తేదీ:** జనవరి 25

వెబ్‌సైట్: https://exams.nta.nic.in/nchmjee/

దిక్సూచి

జాబ్ కార్నర్

హార్టికల్చర్ వర్సిటీలో ప్రొఫెసర్స్

సిద్దిపేట జిల్లాలోని ములుగులో ఉన్న శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ - టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.


పోస్టులు: అసోసియేట్ ప్రొఫెసర్ 44, ప్రొఫెసర్ 17

విభాగాలు: అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, అగ్రానమీ, బయోకెమిస్ట్రీ, క్రాప్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఫ్రూట్ సైన్స్, జీపీబీఆర్, ప్లాంట్ పాథాలజీ, పీఎస్ఎంఏ, స్టాటిస్టిక్స్, వెజిటిబుల్స్, ఫ్లోరికల్చర్

ఎంపిక: ఏపీఐ అండ్ పీబీఏఎస్ స్కోర్, ఉద్యోగానుభవం తదితరాలు

దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 31 **వెబ్‌సైట్:** www.skltghu.ac

బీఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్(జీడీ)



బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)లో స్పోర్ట్స్ కోటా కింద 549 కానిస్టేబుల్(జీడీ) పోస్టులు ఉన్నాయి. మహిళలకు 272, పురుషులకు 277 ప్రత్యేకించారు.

అర్హత: పదోతరగతి పాసై ఉండాలి. ప్రతిభావంతులైన క్రీడాకారులు అయి ఉండాలి. అలాగే జాతీయ/ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన లేదా ఆ పోటీల్లో పాల్గొని ఉండాలి

వయస్సు: 18-23 ఏళ్ళ మధ్య ఉండాలి.

ఎంపిక: ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, క్రీడల్లో చూపిన ప్రతిభ, డాక్యుమెంట్ల పరిశీలన, మెడికల్ టెస్ట్ ఆధారంగా.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 15

వెబ్‌సైట్: rectt.bsf.gov.in

ఎన్‌సీఆర్‌టీలో నాన్ - అకడమిక్ పోస్టులు

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్(ఎన్‌సీఈఆర్‌టీ) సహా వివిధ ప్రాంతీయ సంస్థల్లో ఏ, బీ, సీ నాన్-అకడమిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

పోస్టులు: గ్రూప్ ఎ - 9, గ్రూప్ బీ - 26, గ్రూప్ సీ - 138 మొత్తం 173 పోస్టులు.

వివరాలు: సూపరింటెండెంట్, ఇంజనీర్, ప్రొడక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్, బిజినెస్ మేనేజర్, సీనియర్ అకౌంటెంట్, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ తదితరాలు

అర్హత: పోస్టును అనుసరించి టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీకి తోడు ఉద్యోగానుభవం ఉండాలి.

ఎంపిక: పోస్టునుబట్టి రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 16

వెబ్‌సైట్: www.ncert.nic.in

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో వర్క్‌మన్

కొచ్చిన్ షిప్‌యార్డ్ వర్క్‌మన్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

పోస్టులు: సీనియర్ షిప్ డ్రాఫ్ట్‌మన్(మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్) 30, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్(మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్ ఇన్‌స్ట్రుమెంటేషన్) 53, లేబరేటరీ అసిస్టెంట్(మెకానికల్, కెమికల్) 6, స్టోర్ కీపర్ 9, అసిస్టెంట్ 34

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ/ డిప్లొమా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 12

వెబ్‌సైట్: www.cochinshipyard.in

సీయూఈటీ పీజీ

దేశంలోని కేంద్ర విశ్వవిద్యాలయాలకు తోడు బీహెచ్‌యూ సహా పలు సంస్థలు అందించే పీజీ కోర్సుల్లో చేరేందుకు ఉద్దేశించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ)కి ఎన్‌టీఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. 157 సబ్జెక్టుల్లో ఈ టెస్టును దేశ వ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో నిర్వహిస్తున్నారు. కంప్యూటర్ ఆధారిత ఈ పరీక్ష రాసేందుకు డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. మార్చిలో జరిగే ఈ పరీక్షలకు జనవరి 14లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: https://exams.nta.nic.in/cuet-pg/, www.nta.ac.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



రైతు గొప్పతనం చెప్పే చిత్రం

త్రిగుణ్

త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ, అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మిస్టర్. వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ దర్శకత్వంలో అరవింద్ మండెం నిర్మించారు. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో త్రిగుణ్ మాట్లాడుతూ 'ఈ మధ్య విడుదలైన చిన్న సినిమాలన్నీ అద్భుతమైన ఆదరణ దక్కించుకుంటున్నాయి. ప్రేక్షకులు మునుపటిలా థియేటర్లకు రావడం మంచి పరిణామం. ఆధునిక జీవితాన్ని, వ్యవసాయాన్ని ఎలా కలపొచ్చో ఈ సినిమాలో చాలా ఆసక్తికరంగా చూపిస్తున్నాం. వ్యవసాయం గొప్పతనాన్ని తెలుపుతూనే వినోదాన్నీ అందిస్తుంది. అందర్నీ ఆలోచింపజేస్తుంది' అని అన్నారు. మధుదీప్ మాట్లాడుతూ 'సినిమా హృదయానికి హత్తుకునేలా ఉంటుంది. మంచి విషయాన్ని ప్రేక్షకులకు చెప్పాలని చేసిన ప్రయత్నమే ఈ సినిమా. థియేటర్లలోంచి చిరునవ్వుతో బయటకు వస్తారు' అని చెప్పారు. అరవింద్ మండెం మాట్లాడుతూ 'అన్ని వర్గాల వారిని మెప్పించే కంటెంట్ ఉన్న చిత్రమిది. ఘనవిజయం సాధిస్తుంది' అని తెలిపారు.



'ఒక సగటు అభిమానిగా చిరంజీవిలో నాకు ఏం నచ్చుతాయో.. అలాంటి అంశాలతోనే 'మన శంకర వరప్రసాద్ గారు' కథను సిద్ధం చేశా. ఇది కేవలం ట్రైలర్ మాత్రమే. థియేటర్లలో రెండున్నర గంటలపాటూ నాన్‌స్టాప్ వినోదాన్ని చూస్తారు' అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. సంక్రాంతి సందర్భంగా ఈనెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం తిరుపతిలో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'మన శంకర వరప్రసాద్ గారు' మెగా రైడ్‌లా ఉంటుంది. టైమ్ మెషీన్‌లో ఒక రౌండ్ వేసి వింటేజ్ చిరంజీవిని చూస్తారు. ఇందులో ఆయన టైమింగ్, ఎనర్జీ మనకు బాగా నచ్చేస్తాయి. అభిమానులు ఆయనను ఎలా చూడాలనుకుంటున్నారో దృష్టిలో పెట్టుకునే శంకర వరప్రసాద్ పాత్ర రాశా. ఆయన తన నటనతో ఆ పాత్ర స్థాయిని మరో 100 రెట్లు పెంచేశారు. ఈ సినిమా చూశాక ప్రతి అభిమాని ఆనందంతో థియేటర్‌లోంచి బయటకు వస్తాడు. మన తరం వాళ్లంతా చిరంజీవి, వెంకటేశ్‌ను ఒకే ఫ్రేమ్‌లో చూడాలనుకున్నాం. మొత్తానికి ఈ చిత్రంతో అది నెరవేరింది' అని చెప్పారు.ఈ సినిమా సంక్రాంతికి బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుంది' అని సాహు గారపాటి తెలిపారు. 'ఈ చిత్రం మెగాస్టార్ చేసే ప్యూర్ మ్యాజిక్' అని సుష్మిత కొణిదెల పేర్కొన్నారు. ఇందులో చిరు లుక్స్, ఆయన చేసిన కామెడీ, యాక్షన్.. పలికిన సంభాషణలు అదిరిపోయాయి. వెంకీ కామియో అలరించింది. గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్, షైన్ స్క్రీన్స్ బ్యానర్లపై చిరంజీవి కుమార్తె సుష్మిత కొణిదెల, సాహు గారపాటి సంయుక్తంగా నిర్మించారు. నయనతార కథానాయిక. కేథరిన్ ట్రెసా, అభినవ్ గోమఠం, వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు.



జోడీ కుదిరిందా?

బాలీవుడ్‌లో అత్యంత ప్రేక్షకాదరణ పొందిన కామెడీ డ్రామా ఫ్రాంఛైజీ 'ఓ మై గాడ్'. ఈ సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలు ఘన విజయం సాధించాయి. 'ఓ మై గాడ్ 2' చిత్రానికి దర్శకత్వం వహించి విమర్శకుల ప్రశంసలు అందుకున్న అమిత్‌రాయ్ మూడో భాగానికి దర్శకత్వం వహిస్తున్నారు. మునుపటి చిత్రాల కన్నా మరింత బలమైన, ఆలోచింపజేసే కథతో అమిత్‌రాయ్ సిద్ధంగా ఉన్నారని సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రం పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో సెట్స్ పైకి తీసుకువెళ్లేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. మూడో భాగంలో అక్షయ్ కుమార్ సరసన ప్రముఖ నటి రాణీ ముఖర్జీ నటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. 90వ దశకంలో ప్రేక్షకులను అలరించిన ఈ ఇద్దరు స్టార్స్ తొలిసారి ఈ చిత్రంలో పూర్తి స్థాయిలో కలసి నటిస్తే బావుంటుందని అక్షయ్ అభిమానులు కోరుకుంటున్నారు. 'ఓ మై గాడ్ 3'లో నటించేందుకు రాణీ ముఖర్జీ అంగీకరించారని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడుతుందని ప్రచారం జరుగుతోంది. వీరిద్దరూ కలసి ఓ భారీ చిత్రంలో నటించడం ఇదే తొలిసారి కావడంతో ఈ కాంబినేషన్ బాక్సాఫీసు వద్ద మ్యాజిక్ క్రియేట్ చేయడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

ఆస్కార్ రేసులో దశావతార్



భారతీయ ప్రాంతీయ సినిమా ఖ్యాతిని ఖండాంతరాలకు విస్తరిస్తూ, మరాఠీ చిత్రం 'దశావతార్' అరుదైన ఘనతను సాధించింది. 2026 ఆస్కార్ అవార్డుల (98వ అకాడమీ అవార్డ్స్) పోటీలో నిలిచేందుకు అర్హత సాధించిన చిత్రాల జాబితాలో స్థానం దక్కించుకుంది. ఈ విషయాన్ని చిత్రబృందం, నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ప్రకటించాయి. మరాఠీ సినీ చరిత్రలో ఈ ఘనత సాధించిన తొలి చిత్రంగా 'దశావతార్' రికార్డులకెక్కింది. అంతేకాకుండా అకాడమీ స్క్రీనింగ్ రూమ్‌లో ప్రదర్శితం కానున్న తొలి మరాఠీ చిత్రం కూడా ఇదేనని చిత్రబృందం వెల్లడించింది. దర్శకుడు సుబోధ్ ఖనోల్కర్ తెరకెక్కించిన ఈ చిత్రం గతేడాది విడుదలై బాక్సాఫీసు దగ్గర మంచి వసూళ్లను రాబట్టింది.

స్నేహితుల కథ



అజయ్ వేద్, ప్రజన ప్రధాన పాత్రల్లో హేమసుందర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రిమ్ జిమ్'. 1990ల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాను జి.సచేతన్ రెడ్డి, డాక్టర్ మానస, శ్రీనివాస రావు నిర్మిస్తున్నారు. గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ కీలక పాత్రను పోషిస్తున్నారు. స్నేహం, ప్రేమ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. త్వరలోనే విడుదల కానుంది.

కొత్తదనంతో మెప్పించింది



శ్రీనందు

శ్రీ నందు కథానాయకుడిగా వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించిన 'సైక్ సిద్ధార్థ' ఇటీవలె విడుదలై హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో శ్రీ నందు మాట్లాడుతూ 'ఇలాంటి రోజు కోసమే 16 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. ఒక బ్లాక్‌బస్టర్‌తో మీ ముందుకు వచ్చి మాట్లాడాలి అని. ఈ విజయం క్రెడిట్ అంతా వరుణ్ రెడ్డి విజన్‌దే. అన్ని అంశాల్లోనూ కొత్తదనంతో ప్రేక్షకులను మెప్పించిందీ చిత్రం. థియేటర్లు హౌస్‌ఫుల్‌గా రన్ అవుతున్నాయి. ఇంతటి విజయం అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. హీరోయిన్ యామినీ భాస్కర్ మాట్లాడుతూ 'ఈ సినిమా విజయం సాధించినందుకు ఎంతో సంతోషంగా ఉంది. నా పాత్రకు మంచి గుర్తింపు దక్కడం ఆనందాన్నిస్తోంది' అని చెప్పారు. 'ప్రేక్షకులు సినిమాను మనస్ఫూర్తిగా ఆదరిస్తున్నారు. మంచి రివ్యూలు వస్తున్నాయి. సిద్ధార్థ క్యారెక్టర్ అద్భుతంగా పేలింది' అని వరుణ్ రెడ్డి తెలిపారు. రానా దగ్గుబాటి సమర్పణలో స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్యామ్ సుందర్ రెడ్డి, శ్రీ నందు ఈ సినిమాను సంయుక్తంగా నిర్మించారు.

నేను వదులుకొన్నవే ఆమెకు వరాలయ్యాయి

అలనాటి బాలీవుడ్ అగ్రతారలు ముంతాజ్, హేమమాలిని మధ్య 1970ల్లో నంబర్ వన్ స్థానం కోసం తీవ్ర పోటీ ఉండేదన్న విషయం తెలిసిందే. అయితే దశాబ్దాల తర్వాత ఆ పోటీకి సంబంధించిన చర్చ మళ్లీ ఇప్పుడు తెరపైకి వచ్చింది. హేమమాలిని కంటే తనకే ఎక్కువ అవార్డులు వచ్చాయని, తాను తిరస్కరించిన సినిమాల్లో నటించడం వల్లే హేమమాలినికి ఆ అవార్డులు దక్కాయనీ ఓ ఇంటర్వ్యూలో ముంతాజ్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ధర్మేంద్ర మరణించిన దుఃఖంలో హేమమాలిని ఉండగా ఆమెపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని తప్పు పడుతూ నెటిజన్లు ముంతాజ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ముంతాజ్ తన వ్యాఖ్యలపై స్పష్టత ఇచ్చారు.





ముంతాజ్

నేను తిరస్కరించిన సినిమాలకే హేమమాలినికి అవార్డులు

'ఒక జర్నలిస్ట్ ఇంటర్వ్యూలో నన్ను హేమమాలినితో పోల్చి తక్కువ చేయడం వల్లే నన్ను నేను సమర్థించుకోవాల్సి వచ్చింది. 'మీకన్నా హేమమాలినికే ఎక్కువ అవార్డులు వచ్చాయి' అంటూ ఆ జర్నలిస్ట్ మరొక నటితో పోల్చి నన్ను తక్కువ చేసి మాట్లాడుతుంటే మౌనంగా ఉండలేను కదా. 'నాకు కూడా చాలా అవార్డులు వచ్చాయి. కావాలంటే లెక్కపెట్టి చూసుకోండి' అని చెప్పాను. నేనేం తప్పు మాట్లాడలేదు కదా?' అని ప్రశ్నించారు. 'నేను తిరస్కరించిన సినిమాలకే హేమమాలినికి అవార్డులు వచ్చాయి. ఆ రోజుల్లో నేను షమ్మీకపూర్‌తో సినిమాలు చేయడం మానేశాను. ఆయనతో చేయాల్సిన రెండు సినిమాలను వదులుకున్నాను. ఆ తర్వాత హేమాజీని తీసుకున్నారు. నేను వదులుకున్నవే ఆమెకు వరాలయ్యాయి నేను వదులుకొన్న సినిమాల్లో నటించి ఎంతోమంది హీరోయిన్లు అవార్డులు తీసుకున్నారు. లెక్క తీస్తే అసలు విషయం తెలుస్తుంది. నేను అహంకారిని కాను. కానీ ఎవరైనా రెచ్చగొడితే, ఊరుకోను' అని ముంతాజ్ వివరణ ఇచ్చారు.

గ్రామీణ నేపథ్యంలో..



యువన్ కృష్ణ, రిదాన్ కృష్ణాస్, అమ్ము అభిరామి కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'జాకీ'. డా.ప్రగభల్ దర్శకత్వంలో ప్రేమ కృష్ణదాస్, సి దేవదాస్, జయ దేవదాస్ నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రం టీజర్‌ను ఆదివారం హీరో విజయ్ సేతుపతి విడుదల చేశారు. ఈ సందర్భంగా డా.ప్రగభల్ మాట్లాడుతూ 'ఈ సినిమాలోని ప్రతీ సన్నివేశం మనసుకు హత్తుకుంటుంది. చాలా పరిశోధించి ఈ కథను తయారు చేశాం. గ్రామీణ జీవితాన్ని, ప్రజల భావోద్వేగాలను, వారి సంప్రదాయ పొట్టేలు క్రీడను సహజంగా ఆవిష్కరించాం' అన్నారు.





దిగువ కాఫర్ డ్యాం వద్ద సీపేజీ జలాల డీవాటరింగ్

పోలవరం ఎగువ కాఫర్ డ్యాంలో..
వేగంగా సీపేజీ జలాల కాలువ

» వారంలో పనులు పూర్తవుతాయన్న అధికారులు

పోలవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యాం సీపేజీ జలాలను గోదావరి సహజ ప్రవాహంలోకి తరలించే కాలువ పనులు వేగవతంగా జరుగుతున్నాయి. ఎగువ కాఫర్ డ్యాం నుంచి వస్తున్న సీపేజీ జలాలను ఇప్పటివరకు దిగువ కాఫర్ డ్యాం వద్ద భారీ సామర్థ్యం ఉన్న మోటార్ల ద్వారా డీవాటరింగ్ చేస్తూ వచ్చారు. దీనివల్ల జరుగుతున్న కాలయాపన, అధిక వ్యయాన్ని అధిగమించేందుకు జలవనరుల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. దిగువ కాఫర్ డ్యాం వద్ద సీపేజీ జలాలు గోదావరి సహజ ప్రవాహంలోకి పోయేందుకు నిర్మించిన స్లూయిజ్ వరకు ఇటీవల ఎగువ కాఫర్ డ్యాం నుంచి కాలువ తవ్వకాలు ప్రారంభించారు. ఈ డ్యాంకు కుడివైపు గట్టు చివరి నుంచి స్లూయిజ్ వరకు కాలువ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే సీపేజీ జలాలను మోటార్ల ద్వారా డీవాటరింగ్ చేసే శ్రమ, వ్యయం కొంత మేర తగ్గడమే గాక ఆ నీరు గ్రావిటీ ద్వారా స్లూయిజ్‌లోకి అక్కడి నుంచి గోదావరి సహజ ప్రవాహంలో కలుస్తుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మరో వారం రోజుల్లో కాలువ తవ్వకం పనులు పూర్తవుతాయని చెప్పారు.

నీటి దోపిడీ ఆరోపణలు విడ్డూరం: సోమిరెడ్డి



నెల్లూరు(వైద్యం), జనవరి 4(ఆంధ్రజ్యోతి): సముద్రంలోకి వెళ్లే నీటిని ఏపీ దోచుకుంటోందని, తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ విమర్శించటం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నెల్లూరులో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 300 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిపోతున్నదని, ఈ నీటిని ఆంధ్ర వాళ్లు వాడుకుంటే సహించబోమని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అనటం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సముద్రంలో కలిసే నీటిని ఆంధ్రవాళ్లు వినియోగించుకోవద్దనటం కరెక్టు కాదన్నారు.

8, 9 తేదీల్లో అల్పపీడనం

విశాఖపట్నం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఈ నెల 8వ తేదీ తర్వాత శ్రీలంక సమీపంలో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. దీని ప్రభావంతో తొమ్మిదో తేదీ నుంచి తమిళనాడులో వర్షాలు కురుస్తాయని, దక్షిణ కోస్తా, రాయలసీమల్లోనూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఆదివారం మంచు దట్టంగా కురిసింది. రానున్న రెండు, మూడు రోజుల్లో అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, గుంటూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడనివ్వం: అచ్చెన్న

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా ఏపీలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తున్నట్లు ఆదివారం తెలిపారు. గత ప్రభుత్వంలో యూనిట్ విద్యుత్ రూ.5.19కు కొనుగోలు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రూ.4.70కే కొనుగోలు చేస్తోందన్నారు.

11న వడ్డే ఓబన్న జయంతి వేడుకలు: మంత్రి సవిత

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలను వ్యతిరేకంగా పోరాడిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఈ నెల 11న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఓబన్న జయంతిని అన్ని జిల్లా కేంద్రాలతో పాటు అనంతపురం పట్టణంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అర్ధ నగ్నంగా నిరసనకు దిగుతా!

» ఎస్టీ ఉద్యోగిని కావడం వల్లే నాపై వేధింపులు

» కోనసీమ డీఆర్డీఏ పీడీగా చేసిన సాయినాథ్

» విధుల్లో నిర్లక్ష్యం కారణంగా ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఇటీవల డీఆర్వో ఉత్తర్వులు



సాయినాథ్ జయచంద్ర

అమలాపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సెర్ప్, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.సాయినాథ్ జయచంద్రను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ డీఆర్వో కె.మాధవి ఉత్తర్వులు జారీచేశారు. కలెక్టర్ సిఫారసు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె ఇటీవలి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డీఆర్డీఏ పీడీగా పనిచేస్తున్న సాయినాథ్ అనధికారికంగా విధులకు గైర్హాజరు కావడం, ముందస్తు సమాచారం లేకుండా ఎక్కువ రోజులు సెలవుల్లో ఉండడంతో పాటు షెడ్యూల్ చేయబడిన సమావేశాలకు గైర్హాజరు కావడం వంటి కారణాలతో ప్రభుత్వానికి సరెండర్ చేశారు. పాలనా ప్రయోజనాల దృష్ట్యా తదుపరి చర్యల కోసం సాయినాథ్‌ను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవోకు సరెండర్ చేశారు. దీనిపై సాయినాథ్ జయచంద్ర ఆదివారం అమలాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎస్టీని అయినందు వల్లే తనను అకారణంగా చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. గతంలో పలువురు ప్రముఖుల వద్ద పనిచేసి ప్రశంసలు అందుకున్న చరిత్ర తనదన్నారు. కారణాలు చూపకుండా సరెండర్ చేయడం ఏంటని పరోక్షంగా కలెక్టర్‌ను నిలదీశారు. తనకు జరిగిన అన్యాయంపై అమలాపురంలో అర్ధనగ్నంగా కూర్చుని, నిరసన తెలియచేస్తానని ప్రకటించారు. దీనిపై ఇప్పటికే జిల్లాలోని పలువురు దళిత ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేశానని చెప్పారు. పనిచేసే వాళ్లనే పంపిస్తారా..! అంటూ వారు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారన్నారు. తనకు జరిగిన అన్యాయంపై మాల, మాదిగ, గిరిజన, లంబాడీలతో సహా అనేక జాతులకు చెందిన వారితో కలసి ఉద్యమిస్తానన్నారు.

నేడు 'స్వచ్ఛ సంక్రాంతి' గ్రామసభలు

» రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛ సంక్రాంతి-స్వచ్ఛ గ్రామ పంచాయతీలు' అనే కార్యక్రమానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో సోమవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. పంచాయతీల్లో శాస్త్రీయ విధానంలో ఘనవ్యర్థాల నిర్వహణను అమలు చేసి.. చెత్తరహిత, పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం 'స్వచ్ఛ సంక్రాంతి-స్వచ్ఛ గ్రామ పంచాయతీలు-2026' ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా గత డిసెంబరు 26 నుంచి ఈ నెల 4వరకు అన్ని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని మరింత ప్రభావవంతంగా అమలు చేసేందుకు ఈనెల 10 వరకు పొడిగించారు. ఈ కార్యక్రమం చివరి నాటికి గ్రామ పంచాయతీల్లోని నాడెప్ తొట్టెలన్నీ తడి చెత్తతో నింపుతారు. ఈ కార్యక్రమం కొనసాగింపుగా, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు సోమవారం అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో చేపట్టిన చర్యలను తెలియజేయడం, 'ముందు.. తర్వాత' ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల భాగస్వామ్యంతో స్వచ్ఛతను నిరంతర కొనసాగించేందుకు తీర్మానాలు ఆమోదిస్తారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరచిన ప్రతి జిల్లాలోని మూడు పంచాయతీలను గణతంత్ర దినోత్సవం సందర్భంగా సత్కరించేందుకు ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు/సాధారణ నిధులను ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం వినియోగించుకోవచ్చు. జిల్లా పంచాయతీ అధికారులు, డీడీవోలు, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటారు. ప్రజలు గ్రామసభల్లో పాల్గొని గ్రామాల పరిశుభ్రతకు సహకరించాలని అధికారులు సూచించారు.

ఢిల్లీ యూనివర్సిటీలో సంక్రాంతి సంబరం

» తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా కార్యక్రమాలు

» భోగి మంటలు, పిండి వంటలు, గంగిరెద్దుల విన్యాసాలతో వేడుకలు

» పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్, ఎంపీ ఈటల

న్యూఢిల్లీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిలోని ఢిల్లీ యూనివర్సిటీలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఢిల్లీ యూనివర్సిటీ తెలుగు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పేలా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భోగి మంటలు, పిండి వంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వర్సిటీ ప్రాంగణం కళకళలాడింది. పౌరవిమానయాన మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, తెలంగాణకు చెందిన ఎంపీ ఈటల రాజేందర్ ఈ వేడుకలకు హాజరయ్యారు. రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులను ఈ వేడుకల్లో భాగం చేయడం సంతోషంగా ఉందన్నారు. భావి తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలుగు విద్యార్థులు ఢిల్లీలో సంప్రదాయ వేడుకలు నిర్వహించడాన్ని గతంలో ప్రధాని మోదీ సైతం కొనియాడారని గుర్తుచేశారు. ప్రధాని ఆలోచనతో గత 11 ఏళ్లుగా మన సంప్రదాయాలు, విలువలు, కట్టుబాట్లు ప్రపంచవ్యాప్తంగా కీర్తించబడుతున్నాయని తెలిపారు. ఎంపీ రాజేందర్ మాట్లాడుతూ.. తెలుగు పండుగలకు శాస్త్రీయత, ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. బతుకమ్మ, బోనాలు మహిళల గౌరవానికి నిదర్శనమని తెలిపారు. తెలుగు సంస్కృతి, భారతీయ సంప్రదాయాలకు అద్దం పడుతుందన్నారు. ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగువారు తమ సంప్రదాయాల్ని చాటుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. పండుగలే కుటుంబ బంధాలను బలపరుస్తాయని, భవిష్యత్తు తరాలకు సంపదతోపాటు సంస్కృతి వారసత్వంగా ఇవ్వాలన్నారు.





భోగి మంట కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ ఎంపీ ఈటల తదితరులు, సంక్రాంతి సంబరాల్లో యువతుల నాట్యం

సీమ లిఫ్టు.. ఆపేసింది జగనే!

జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)ని ఆశ్రయించారు. డీపీఆర్, పర్యావరణ అనుమతుల్లేకుండా ఏకంగా పనులే ప్రారంభించారని తెలిపారు. పనులేమీ చేపట్టడం లేదని.. డీపీఆర్ తయారీకే తవ్వకాలు చేస్తున్నామని జగన్ ప్రభుత్వం పేర్కొంది. అయితే ఎన్‌జీటీ ఆ పథకంపై స్టే విధించింది. ఈ ఎత్తిపోతలకు కేంద్ర పర్యావరణ-అటవీ శాఖ నుంచి పర్యావరణ అనుమతులు తప్పనిసరని, అవి వచ్చాకే ప్రాజెక్టు పనులు చేపట్టాలని అదే ఏడాది అక్టోబరు 29న స్పష్టంచేసింది. ఈ ఉత్తర్వులు వెలువడ్డాక జగన్ మూడున్నరేళ్లు పైనే అధికారంలో కొనసాగారు. కానీ ఎన్‌జీటీ స్టే ఉత్తర్వులను ఎత్తివేయించేందుకు ఒక్క ప్రయత్నం కూడా చేయలేదు. వాస్తవం ఇలా ఉంటే.. తన వల్లే సీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోయిందని.. ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ రాష్ట్ర అసెంబ్లీలో వ్యాఖ్యానించడంతో.. ఈ పథకాన్ని చంద్రబాబే ఆపేశారని వైసీపీ ఒక్కసారిగా సామాజిక మాధ్యమాల్లో, కూలి-నీలి మీడియాలో విషప్రచారం మొదలుపెట్టింది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు.. ఎప్పుడేం జరిగిందో ప్రభుత్వ వర్గాలు ఆదివారం బహిర్గతం చేశాయి. కూటమి ప్రభుత్వానికి ఈ పథకంతో సంబంధమే లేదని.. జగన్ హయాంలోనే అది ఆగిపోయిందని ఏర్కొన్నాయి. దీంతో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల సాకుతో అయాచిత రాజకీయ లబ్ధి పొందాలనుకున్న వైసీపీ ఎత్తుగడ బూమ్‌రాంగ్ అయిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

జగన్ అనాలోచిత నిర్ణయాలతో..

వైసీపీ అధికారంలో ఉండగానే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేసిందని ప్రభుత్వ వర్గాలు పునరుద్ఘాటించాయి. జగన్ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రానికీ, ప్రధానంగా రాయలసీమకూ తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపాయి. 'అనుమతులు లేకుండా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టవద్దంటూ 2020 ఆగస్టులోనే కేంద్ర జలశక్తి శాఖ జగన్ ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలిచ్చింది. జలశక్తి మంత్రి నేతృత్వంలోని అపెక్స్ కౌన్సిల్ అనుమతి పొందాకే ప్రాజెక్టు పనులు చేపట్టాలని కేంద్రం నుంచి సుస్పష్టమైన ఆదేశాలు అందాయి. కేంద్ర పర్యావరణ అటవీ శాఖ అనుమతుల్లేకుండా ప్రాజెక్టు పనులు చేపట్టవద్దని 2020 అక్టోబరులో మరోసారి రాష్ట్రప్రభుత్వాన్ని ఎన్‌జీటీ నిర్దేశించింది. వీటిపై ట్రైబ్యునల్‌లో జగన్ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించలేదు. ఇప్పుడు చంద్రబాబుపై రాజకీయంగా బురదజల్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. తన హయాంలో జరిగినవాటిని కప్పిపుచ్చి.. రాజకీయ లబ్ధి పొందేందుకు ఎత్తువేశారు' అని ఆ వర్గాలు పేర్కొన్నాయి. జగన్ జమానాలో ఎన్‌జీటీ ఆదేశాలతో నిలిచిపోయిన ఈ ఎత్తిపోతల పథకాన్ని తిరిగి పట్టాలెక్కించేందుకు న్యాయపోరాటం చేస్తున్నామని.. ఈ నెల 22న బలమైన వాదనలు వినిపించబోతున్నామని తెలిపాయి.

102 ప్రాజెక్టులను ఆపేసిన జగన్..

సీమ ఎత్తిపోతల పథకాన్ని జగన్ ఎందుకు పూర్తి చేయలేకపోయారు.. కేంద్రం నుంచి ఎందుకు అనుమతులు తీసుకురాలేకపోయారో ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలని ప్రభుత్వ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. 'ఆయన సీఎంగా ఉండగానే.. 102 రాయలసీమ ప్రాజెక్టులను అర్ధాంతరంగా నిలిపివేస్తూ ప్రీ-క్లోజర్ ఆదేశాలిచ్చారు. 2014-19 మధ్య ఆ ప్రాంత సాగునీటి ప్రాజెక్టులపై టీడీపీ ప్రభుత్వం రూ.12,441 కోట్లు ఖర్చు చేయగా.. జగన్ తన ఐదేళ్ల ఏలుబడిలో రూ.2,011 కోట్లే ఖర్చుచేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.3,870 కోట్లతో 100 రోజుల్లోనే 738 కిమీ మేర హంద్రీ-నీవా కాలువ వెడల్పు పనులు చేపట్టి కుప్పం వరకూ నీటిని తరలించాం. సీమ ప్రాజెక్టులపై ప్రస్తుతం రూ.6,613 కోట్లు ఖర్చుచేస్తున్నాం. సీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చే ప్రణాళికలు అమలు చేస్తున్నాం. రిజర్వాయర్లలోని నీటి నిల్వలను సమర్థంగా వినియోగించేలా యాజమాన్య నిర్వహణ చేపట్టాం. కాలువలు, పైపులైన్ల ద్వారా ఉద్యాన పంటలకు నీరందించేందుకు కార్యాచరణ ప్రణాళిక కూడా సిద్ధంచేశాం' అని ఆ వర్గాలు స్పష్టంచేస్తున్నాయి.

అబద్ధాలు.. అభూత కల్పనలు..
అవినీతి, స్కాంలు

» వాటన్నిటికీ ప్యాంటూ చొక్కా తొడిగితే జగనే: నిమ్మల

అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలు, అభూతకల్పనలు, అవినీతి, కుంభకోణాలకు ప్యాంటు, చొక్కా తొడిగితే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవుతాడని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవాచేశారు. నిజానికి, నిబద్ధతకు సీఎం చంద్రబాబు నిలువెత్తు నిదర్శనమన్నారు. జగన్ అవినీతి పత్రికలో ఒక పేజీ అబద్ధాలు అచ్చేసినా.. రాష్ట్ర ప్రజలు నమ్మేస్థితిలో లేరని నిమ్మల ఆదివారం మీడియాతో అన్నారు. 'రాష్ట్ర చరిత్రలో రాయలసీమకు ఏ ముఖ్యమంత్రీ చేయనంత ద్రోహం జగన్ చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి 2020 మే ఐదో తేదీన ఆమోద ముద్ర వేసి.. అదే ఏడాది అక్టోబరు 29వ తేదీన ఎన్‌జీటీలో నిలిపివేత ఉత్తర్వులు వచ్చేలా చేశారు. రాయలసీమ నీటి ప్రాజెక్టులకు జగన్ తన ఐదేళ్ల ఏలుబడిలో పట్టించుకోలేదు. హంద్రీ-నీవాకు ఒక్కరూపాయి కూడా కేటాయించలేదు. సముద్రంలోకి ఏటా 3000 టీఎంసీలు వృథాగా పోతున్న గోదావరి జలాల్లో 200 టీఎంసీలు వాడుకుంటే తెలంగాణకు అభ్యంతరం ఏమిటి? తెలంగాణ రాష్ట్ర వివాదాలను ఆంధ్రప్రదేశ్‌లోకి చొప్పించి వైసీపీ రాజకీయ లబ్ధి పొందాలనుకుంటోంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నల్లమలసాగర్‌ను
అడ్డుకోండి

» సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్

» నేడు విచారించనున్న సీజేఐ ధర్మాసనం

» ఆంధ్రప్రదేశ్ తరపున వాదించనున్న రోహత్గీ

న్యూఢిల్లీ/అమరావతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టును నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరుగపనుంది. 'మిగులు/వరద జలాల పేరుతో గోదావరిపై ఏపీ అక్రమంగా నల్లమలసాగర్ ప్రాజెక్టును నిర్మించాలని చూస్తోంది. ఈ ప్రాజెక్టు డీపీఆర్ తయారీ, సెగ్మెంట్ 1 కింద ఉండే ప్రస్తుత కనెక్టివిటీ పనుల విస్తరణ, కుడి ప్రధాన కాలువ నిర్మాణ కార్యకలాపాలు చేపట్టకుండా స్టే ఇవ్వండి. కేంద్ర జలశక్తి, ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖల ద్వారా ఈ ప్రాజెక్టుకు సంబంధించి ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్), డీపీఆర్ మూల్యాంకనం చేయకుండా, చట్టబద్ధ అనుమతులు మంజూరు చేయకుండా, ఆర్థిక సహాయం అందించకుండా ఆదేశాలు ఇవ్వండి' అని తెలంగాణ విజ్ఞప్తి చేసింది. కేంద్ర జలశక్తి, ఆర్థిక, పర్యావరణ శాఖలతోపాటు కృష్ణా, గోదావరి బోర్డులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర జల సంఘాన్ని ప్రతివాదులుగా చేర్చింది. కాగా.. ఈ కేసులో బలమైన వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించుకుంది. ఆదివారం ఢిల్లీలో ఆయనతో రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులు సమావేశమై ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేశారు.

ఎగిరొచ్చిన ఎయిర్‌బస్

(మొదటి పేజీ తరువాయి)

విమానంలో ప్రయాణించారు. ట్రయల్ రన్‌పై పెద్దఎత్తున ప్రచారం జరగడంతో ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతో ఉత్సుకతతో ఎదురు చూస్తుండగా.. ఈ ఫ్లైట్ భోగాపురం ఎయిర్‌పోర్టులో విజయవంతంగా ల్యాండ్ అయింది. జలఫిరంగులతో దీనికి ఘన స్వాగతం పలికారు. ఈ వేడుకకు విశాఖ ఎంపీ శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా నుంచి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, లోకం కళ్యాణి మాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు.. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

వెల్‌కమ్ టు భోగాపురం ఎయిర్‌పోర్ట్

ఆదివారం ఢిల్లీలో బయల్దేరిన ఎయిరిండియా విమానం ఉదయం 11 గంటలకు భోగాపురం ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. 'భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి స్వాగతం' అనే అనౌన్స్‌మెంట్ వినిపించగానే.. ఆ క్షణంలో విమానంలో ఉన్న కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఇతర ప్రతినిధులతోపాటు అప్పటికే అక్కడకు చేరుకున్న ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, అధికారులు, దూరం నుంచి వీక్షిస్తున్న ప్రజలు భావోద్వేగానికి గురయ్యారు. తొలుతశాఖ రామ్మోహన్‌నాయుడు అభివాదం చేస్తూ విమానం దిగారు. తర్వాత విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఆపై పౌరవిమానయాన శాఖ ఉన్నతాధికారులు ఒక్కొక్కరూ దిగారు. ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు వారికి స్వాగతం పలికారు. కాగా... ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది జూన్ 26న ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం ఉంటుందని నిర్మాణ సంస్థ జీఎంఆర్ ప్రకటించడం విశేషం. కాగా విభజన హామీల్లో భాగంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఎయిర్‌పోర్టు నిర్మాణం.. మధ్యలో ప్రభుత్వం మారడం వల్లే జాప్యం జరిగిందని రామ్మోహన్‌నాయుడు మీడియాతో అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కేంద్ర పౌర విమానయాన మంత్రిగా అశోక్‌గజపతి రాజు ప్రారంభించిన ఈ విమానాశ్రయ నిర్మాణం పూర్తయిన సమయంలో తాను అదే శాఖ మంత్రిగా ఉండడం చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. వైసీపీ హయాంలో త్వరితగతిన పనులు చేపట్టిఉంటే ఈపాటికే ఇక్కడ విమానం ఎగిరేదన్నారు. ఎయిర్‌పోర్టు పనులను జగన్ అండ్ కో నీరుగార్చారని విమర్శించారు. ఈ విమానాశ్రయ నిర్మాణం ప్రధాని మోదీ దార్శనికతకు, సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి మచ్చుతునకగా అభివర్ణించారు. ఈ విమానాశ్రయంతో ఉత్తరాంధ్రతో పాటు విశాఖ నగరం రూపురేఖలే మారిపోతాయని చెప్పారు. అమరావతిలో ఎయిర్‌పోర్టు కోసం కూడా భూమిని చూస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు రాగానే అక్కడ కూడా ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపడతామని తెలిపారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో జగన్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారన్నారు. గతంలో బుర్రలేనోళ్లు భోగాపురం ఎయిర్‌పోర్టు కడతారని కామెంట్ చేసిన ఆయన ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండాలని అశోక్ గజపతిరాజు ఎల్లప్పుడూ కోరుకుంటారని, అందుకే ఎడ్యుకేషన్ నాలెడ్జ్ అకాడమీ కోసం రూ.వెయ్యి కోట్ల విలువైన 136 ఎకరాలను మాన్సాస్ ట్రస్ట్ నుంచి ఉచితంగా ఇచ్చారని గుర్తుచేశారు.

జగన్ మొసలి కన్నీరు: ఎంపీ కలిశెట్టి

భోగాపురం విమానాశ్రయంపై జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్లలో ఈ విమానాశ్రయానికి ఒక్క ఇటుకైనా పేర్చారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో పనులు పరుగులు పెడుతుంటే, క్రెడిట్ కోసం జగన్ పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు.

ట్రయల్ రన్ విజయంపై సీఎం హర్షం

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్వహించిన ట్రయల్‌రన్‌లో భాగంగా తొలి విమానం విజయవంతంగా ల్యాండింగ్ కావడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. 2014-19 మధ్యకాలంలో ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన ఈ విమానాశ్రయ నిర్మాణం ఈ ఏడాది జూన్ నాటికి మిగిలిన 4 శాతం పనులను కూడా పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ 18 నెలల్లో విమానాశ్రయ పనులు వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి రావడానికి కారణమైన ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.

భోగాపురాన్ని అడ్డుకుంది జగనే: లోకేశ్

ఏపీ చరిత్రలో ఈ రోజు (ఆదివారం) ఓ మైలురాయి అని మంత్రి లోకేశ్ అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం ఎంతో దోహదపడనుందని చెప్పారు. ఈ విమానాశ్రయాన్ని అడ్డుకున్న ఘనత ముమ్మాటికీ జగన్‌దేనని అన్నారు. 2014-19లో విమానాశ్రయాన్ని అడ్డుకునేందుకు ఎర్ర బస్సు కూడా రాని ఈ ఊరికి ఎయిర్‌పోర్టు ఎందుకని ప్రశ్నించిన జగన్‌కు.. ఇప్పుడు భోగాపురం ఘనత తనదేనని చెప్పుకోవడానికి సిగ్గుండాలని లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.



సాయిబాబా కుటుంబానికి చంద్రబాబు పరామర్శ

బేగంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు పిన్నమనేని సాయిబాబా కుటుంబ సభ్యులను టీడీపీ అధినే, ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదివారం పరామర్శించారు. బేగంపేట భగవంతాపూర్‌లోని సాయిబాబా ఇంటికి వచ్చిన చంద్రబాబు.. సాయిబాబా భార్య, కుమారులను యోగక్షేమాలను తెలుసుకున్నారు. సుమారు అర్ధగంట సేపు అక్కడే గడిపి సాయిబాబా కుటుంబ ఆర్థిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. చంద్రబాబు వెంట టీడీపీ నేతలు కంభంపాటి రామ్మోహన్‌రావు, బక్కని నర్సింహులు, తీగల కృష్ణారెడ్డి, కాట్రగడ్డ ప్రసూన, నర్శిరెడ్డి, అరవింద్‌కుమార్‌గౌడ్, కట్టా రాములు, మండూరి సాంబశివరావు, వల్లారపు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడిగా పిన్నమనేని సాయిబాబా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గానూ పని చేశారు.

విద్యుత్ చార్జీలు మరింత తగ్గిస్తాం

» తక్కువ ధరకు 80 గిగావాట్లు కొంటున్నాం: మంత్రి పార్థసారథి



నూజివీడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో విద్యుత్ చార్జీలు మరింత తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే చార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని చెప్పారు. సోలార్, విండ్, బయో విద్యుత్ రంగాల్లో 80 గిగావాట్ల విద్యుత్‌ను తక్కువ ధరకు తీసుకునే విధంగా అగ్రిమెంట్ చేసుకుంటున్నామన్నారు. సూర్యఘర్ పథకం కింద పేదలకు సౌర విద్యుత్ యూనిట్లు అందిస్తున్నామని, ఎస్సీ, ఎస్టీలకు నూరుశాతం సబ్సిడీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం చలనశీల ఆలోచనల సమాహారం

» సవరించుకునే హక్కు రాజ్యాంగ నిర్మాతలే కల్పించారు : వెంకయ్యనాయుడు

» 'ముక్కలైన స్వాతంత్ర్యం', 'మన రాజ్యాంగం-మన ఆత్మగౌరవం' పుస్తకాల ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం పట్ల విశ్వాసమంటే.. దానిలోని అన్ని విషయాలనూ పూర్తిగా నమ్మి, ఆచరించేందుకు సిద్ధపడటమేనని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. బీజేపీ నాయకుడు రామ్‌మాధవ్ ఆంగ్లంలో రచించిన 'ముక్కలైన స్వాతంత్ర్యం', 'మన రాజ్యాంగం-మన ఆత్మగౌరవం' పుస్తకాల తెలుగు అనువాదాలను ఆదివారం విజయవాడ పుస్తక మహోత్సవంలో వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం రాతి మీద రాత కాదని, అది చలనశీలమైన ఆలోచనల సమాహారమన్నారు. అవసరాలకు అనుగుణంగా సవరించుకునే వెసులుబాటు హక్కును రాజ్యాంగ నిర్మాతలే భావితరాలకు కల్పించారని తెలిపారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులనే కాక, అందులో పేర్కొన్న విధులను గుర్తించి యువత ఆచరించాలని సూచించారు. సత్యానికి దగ్గరగా, సంచలనాలకు దూరంగా ఉండే రచనలు పెరగాలని ఆకాంక్షించారు. సామాజిక బాధ్యత కలిగిన పౌరులంతా పుస్తకాలను బహుమతులుగా ఇవ్వాలని, పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించాలని కోరారు. రామ్ మాధవ్ మాట్లాడుతూ వ్యక్తులకైనా, సమాజాలకైనా కాలక్రమేణా అభిప్రాయాలూ, విశ్వాసాలూ మారడం సహజం, అనివార్యమన్నారు. దేశ విభజన తాలూకు దుష్పరిణామాలను నేటికీ అనుభవిస్తున్నామని చెప్పారు. దీనికి కారణమైన పరిణామాలను నేటితరం తెలుసుకోవాలన్నారు. వాటిని 21వ శతాబ్ది యువతకు తెలియజేయాలనే ప్రధాని మోదీ కోరిక మేరకు తాను ఈ రచనలకు పూనుకున్నానని చెప్పారు. ప్రచురణకర్త ఎమెస్కో విజయకుమార్ మాట్లాడుతూ ప్రచురణ రంగం ప్రజాస్వామ్యయుతంగా పనిచేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్ ఆదిత్య మాట్లాడుతూ నేటి తరానికి స్వాతంత్ర్య కాలం నాటి చరిత్రను, అప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలను సమగ్రంగా, సంక్షిప్తంగా అందించడంలో రామ్ మాధవ్ రచనలు చాలా ఉపయోగపడతాయన్నారు. పుస్తకాల సంపాదకుడు జి.వల్లీశ్వర్ కూడా ప్రసంగించారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు, చిత్రంలో వల్లీశ్వర్, విజయకుమార్, రామ్‌మాధవ్ తదితరులు

ఆత్మగౌరవ పర్వం..

వెయ్యేళ్ల అఖండ విశ్వాసం



సోమనాథ్ ఆలయంపై దాడికి వెయ్యేళ్లు పూర్తి.. పుణ్యక్షేత్రానికి పూర్వవైభవం దిశగా అవిరళ కృషి


సోమనాథ్... ఈ మాట చెవినబడగానే మన మనసు పులకరిస్తుంది. సగర్వ భావన కలుగుతుంది. ఇది భారతీయాత్మ అనంత స్పందన. ఈ అద్భుత ఆలయం పశ్చిమ భారత తీరంలోని గుజరాత్ రాష్ట్రం ప్రభాస్ పటాన్ అనే ప్రదేశాన్ని పావనం చేస్తోంది. దేశంలోని 12జ్యోతిర్లింగాల ప్రాశస్త్యాన్ని 'ద్వాదశ జ్యోతిర్లింగ' స్తోత్రం ప్రస్తుతిస్తుంది. 'సౌరాష్ట్రే సోమనాథం చ...' అంటూ ఆరంభమయ్యే ఈ స్తోత్రం, తొలి జ్యోతిర్లింగ నెలవుగా సోమనాథ్ నాగరికత, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ శ్లోకం జ్యోతిర్లింగ మహత్తును ఇలా చాటిచెబుతుంది.

సోమలింగం నరో దృష్ట్వా సర్వపాపైః ప్రముచ్యతే!
లభతే ఫలం మనోవాంఛితం మృతః స్వర్గం సమాశ్రయేత్!!

అంటే "సోమనాథ్ శివలింగ దర్శన మాత్రాన జీవుడు పాప విముక్తుడై సదాశయాలను నెరవేర్చి, మరణానంతరం స్వర్గ ప్రాప్తినొందుతాడు" అని అర్థం. కానీ, లక్షలాది భక్త జనం భక్తిప్రపత్తులతో నీరాజనాలు అర్పించిన ఈ సోమనాథ్‌పై దురదృష్టవశాత్తూ విదేశీ దురాక్రమణదారులు దండయాత్రలు చేశారు. ఈ నేపథ్యంలో సోమనాథ ఆలయానికి 2026 సంవత్సరం ప్రత్యేకమైనది. ఈ ఐతిహాసిక పుణ్యక్షేత్రంపై తొలి దాడికి ఈ ఏడాదిలో వెయ్యేళ్లు పూర్తవుతున్నాయి. గజనీ మహమ్మద్ 1026 జనవరిలో క్రూర, హింసాత్మక దండయాత్రలో భాగంగా ఈ ఆలయంపై దాడి చేశాడు. ప్రజల భక్తివిశ్వాసాలకు, నాగరికతకు సుసంపన్న ప్రతీక అయిన ఈ ఆలయాన్ని ధ్వంసం చేయజూశాడు. అయితే, సోమనాథ్‌కు పూర్వ వైభవం దిశగా ఏళ్లపాటు సాగిన అవిరళ కృషి ఫలితంగా వెయ్యేళ్ల తర్వాత కూడా ఈ ఆలయ దివ్య దీప్తి ప్రపంచవ్యాప్తంగా ప్రకాశిస్తోంది. ఇటువంటి ప్రయత్నాల్లో ఒక ఘట్టానికి 2026లో 75 సంవత్సరాలు పూర్తవుతాయి. ఆలయ పునరుద్ధరణ అనంతరం 1951 మే 11వ తేదీన అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సమక్షాన నిర్వహించిన కార్యక్రమంలో భక్తులకు జ్యోతిర్లింగ భాగ్యం కల్పిస్తూ ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. సోమనాథ్‌పై వెయ్యేళ్ల నాటి తొలి దండయాత్ర, దురాక్రమణదారుల క్రూరత్వం, పుణ్యక్షేత్ర విధ్వంసం వంటి అమానుష ఘట్టాలను వివిధ చారిత్రక గ్రంథాలు సవివరంగా నమోదు చేశాయి. ప్రతి పంక్తిలోనూ బట్టబయలయ్యే హింస, క్రూరత్వం వెయ్యేళ్లు గడిచినా మరపురాని

> సోమనాథ ఆలయానికి 2026 సంవత్సరం ప్రత్యేకమైనది. ఈ పుణ్యక్షేత్రంపై తొలి దాడికి ఈ ఏడాదిలో వెయ్యేళ్లు పూర్తవుతున్నాయి. గజనీ మహమ్మద్ 1026 జనవరిలో క్రూర, హింసాత్మక దండయాత్రలో భాగంగా ఈ ఆలయంపై దాడి చేశాడు. ప్రజల భక్తివిశ్వాసాలకు, నాగరికతకు ప్రతీక అయిన ఈ ఆలయాన్ని ధ్వంసం చేయజూశాడు. అయితే, సోమనాథ్‌కు పూర్వ వైభవం దిశగా ఏళ్లపాటు సాగిన అవిరళ కృషి ఫలితంగా వెయ్యేళ్ల తర్వాత కూడా ఈ ఆలయ దివ్య దీప్తి ప్రపంచవ్యాప్తంగా ప్రకాశిస్తోంది. ఇటువంటి ప్రయత్నాల్లో ఒక ఘట్టానికి 2026లో 75 సంవత్సరాలు పూర్తవుతాయి.

విషాద భారాన్ని మన మనోఫలకంపై మోపుతాయి. భారతదేశంపైన, ప్రజల మనోధైర్యం మీద అది చూపిన పెను దుష్ప్రభావాన్ని ఒకసారి ఊహించండి. సముద్ర తీరంలోని సోమనాథ్ ఆలయం అమేయ ఆర్థిక శక్తితో సమాజానికి సాధికారతనిచ్చింది. నాటి సమాజంలోని సముద్ర వ్యాపారులు, నావికులు సోమనాథ్ వైభవ గాథలను దేశదేశాలకు విస్తృతంగా మోసుకెళ్లారు. అయినప్పటికీ, తొలి దాడికి సహస్రాబ్ది పూర్తయ్యాక కూడా సోమనాథ్ గాథ విధ్వంస నిర్వచనంగా నిలవకపోవడంపై నేనెంతో గర్విస్తున్నాను. ఈ ఆలయం నేడు కోట్లాది భరతమాత బిడ్డల అఖండ ధైర్యానికి నిర్వచనంగా నిలుస్తోంది.



- నరేంద్ర మోదీ
భారత ప్రధానమంత్రి,
శ్రీ సోమనాథ్ ట్రస్టు చైర్మన్

ఎన్నడో వెయ్యేళ్ల కిందట 1026లో మొదలైన మధ్యయుగపు అనాగరిక దండయాత్ర, ఇతరులను కూడా సోమనాథ్‌పై పదేపదే దాడులకు ప్రేరేపించింది. దేశ ప్రజలను, సంస్కృతిని దాస్య శృంఖలాల్లో బంధించే ప్రయత్నాలకు నాంది పలికింది. కానీ, ఆలయంపై దాడి జరిగిన ప్రతి సందర్భంలోనూ రక్షణ కుడ్యంలా నిలిచి, ఆత్మార్పణకూ వెరవని వీరపుత్రులు, పుత్రికలు ఎందరో ఉన్నారు. దాడి జరిగిన ప్రతిసారి మనదైన గొప్ప నాగరికతకు వారసులుగా వారు పుంజుకుంటూ తరతరాలుగా ఆలయ పునర్నిర్మాణం, పునరుజ్జీవనానికి పాటుపడుతూనే వచ్చారు. ఇటువంటి మహనీయులలో అహల్యాబాయి హోల్కర్ ప్రముఖులు. సోమ్‌నాథ్‌లో భక్తులు ప్రార్థనలు చేసుకునేలా ఆమె అందించిన కృషి వెలకట్టలేనిది. స్వామి వివేకానంద 1890దశకంలో సోమనాథ్‌ను సందర్శించినపుడు అనిర్వచనీయ అనుభూతికి లోనయ్యారు. నాటి తన అనుభవాన్ని 1897లో చెన్నై నగరంలో ఓ కార్యక్రమం సందర్భంగా ఈ విధంగా వెలిబుచ్చారు "దక్షిణ భారతంలోని ప్రాచీన ఆలయాలతోపాటు గుజరాత్‌లోని సోమనాథ్ వంటివి మనకు అపార జ్ఞానప్రదాతలు. ఎన్నో పుస్తకాలు వివరించలేని జాతి చరిత్రపై మనకు మరింత లోతైన అవగాహనను అందిస్తాయి. వంద దాడులను భరించిన గుర్తులతోనే కాకుండా వంద పునరుజ్జీవన చిహ్నాలతో ఈ ఆలయాలు ఎంత వైభవంగా నిలిచాయో గమనించండి. నిరంతర విధ్వంసం, శిథిలాల నుంచి నిరంతర పునరుజ్జీవనంతో మునుపటి ఠీవితో ఎంత శక్తిమంతంగా విలసిల్లుతున్నాయో చూడండి! అదే జాతీయ మనోభావన... జాతీయ జీవన స్రవంతి. అనుసరిస్తే అది అమేయ యశస్సు వైపు మనల్ని నడిపిస్తుంది. ఆ జీవన స్రవంతిని వీడితే ఫలితం మరణమే! ఆ మార్గం వదిలిపెడితే ఆత్మనాశనం, వినాశమే!"

స్వాతంత్ర్యానంతరం ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సోమనాథ ఆలయ పునర్నిర్మాణ పవిత్ర బాధ్యతను స్వీకరించారు. 1947లో దీపావళి వేళ ఆ ప్రాంతంలో ఆయన పర్యటించారు. అక్కడి పరిస్థితులను చూసి చలించిపోయిన సర్దార్ పటేల్.. అక్కడే ఆలయాన్ని పునర్నిర్మిస్తామని ప్రకటించారు. చివరికి 1951 మే 11న సోమనాథ్‌లో భవ్యమైన ఆలయ ద్వారాలు భక్తుల కోసం తెరచుకున్నాయి. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆ వేడుకకు హాజరయ్యారు. ఈ చారిత్రక ఘట్టాన్ని వీక్షించాలని కలలుగన్న యోధుడు సర్దార్ సాహెబ్ ఆ సమయానికి భౌతికంగా ఈ లోకంలో లేరు. కానీ, ఆయన స్వప్నం సాకారమై దేశం ఎదుట సగర్వంగా నిలిచింది. నాటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఈ పరిణామం పట్ల ఉత్సాహం చూపలేదు. విశిష్టమైన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి, మంత్రులు పాల్గొనడం ఆయనకు ఇష్టం లేదు. ఈ కార్యక్రమం భారత్‌పై ప్రతికూల ముద్ర వేసిందని నెహ్రూ వ్యాఖ్యానించారు. కానీ రాజేంద్ర ప్రసాద్ తన నిర్ణయానికి దృఢంగా కట్టుబడి ఉన్నారు. అనంతర పరిణామాలు చరిత్ర పుటల్లో ఉన్నాయి. సర్దార్ పటేల్‌కు ఎంతో అండగా నిలిచిన కె.ఎం. మున్షీని స్మరించుకోకపోతే సోమనాథ్ గాథ అసంపూర్ణమే అవుతుంది. 'సోమనాథ: ది ష్రైన్ ఎటర్నల్' గ్రంథంతో పాటు సోమనాథ్‌పై ఎన్నో సమాచార భరిత, విజ్ఞానదాయకమైన రచనలు చేశారు. నిజానికి, మున్షీ తన గ్రంథ శీర్షికలో చెప్పినట్టు ఆత్మనిత్యత్వాన్నీ, ఉన్నత భావాల శాశ్వతత్వాన్నీ బలంగా విశ్వసించే గొప్ప నాగరికత మనది. 'నైనం ఛిందన్తి శస్త్రాని' అని గీతలో చెప్పినట్టు.. అది ధ్వంసం చేయ శక్యంగాని అజరామరత్వమని మనం బలంగా నమ్ముతాం. మన నాగరికత అజేయ స్ఫూర్తికి సోమనాథ్‌ను మించిన ఉదాహరణ మరొకటి లేదు. ఎన్నో అవరోధాలనూ, ఆటుపోట్లనూ ఎదుర్కొని వైభవోపేతంగా నిలిచిన సోమనాథ్ కన్నా మిన్నగా మరేది దీన్ని వివరించగలదు?

వందల ఏళ్ల దాడులనూ, వలసవాద దోపిడీనీ తట్టుకొని నిలబడి..నేడు ప్రపంచ వృద్ధిలో అత్యంత ఆశాజనకమైన

> ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సోమనాథ ఆలయ పునర్నిర్మాణ పవిత్ర బాధ్యతను స్వీకరించారు. 1951 మే11న సోమనాథ్‌లో భవ్యమైన ఆలయ ద్వారాలు భక్తుల కోసం తెరచుకున్నాయి. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆ వేడుకకు హాజరయ్యారు. నాటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఈ పరిణామం పట్ల ఉత్సాహం చూపలేదు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి, మంత్రులు పాల్గొనడం ఆయనకు ఇష్టం లేదు. ఇది భారత్‌పై ప్రతికూల ముద్ర వేసిందని నెహ్రూ వ్యాఖ్యానించారు.

దేశంగా ఎదిగిన భారత ప్రగతిలోనూ ఇదే స్ఫూర్తి తొణికిసలాడుతోంది. నేడు భారత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందంటే.. మన విలువలు, భారతీయుల దృఢ సంకల్పమే దానికి మూలం. ప్రపంచం ఆశతో, ఆశాభావంతో భారత్‌ను చూస్తోంది. సృజనాత్మకత నిండిన మన యువతపై విశ్వాసంతో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతోంది. మన కళ, సంస్కృతి, సంగీతం, పండుగలు ఇప్పుడు విశ్వవ్యాప్తమవుతున్నాయి. యోగా, ఆయుర్వేదం ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తున్నాయి. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న కొన్ని అత్యంత తీవ్రమైన సవాళ్లకు భారత్ పరిష్కారాలను చూపుతోంది.

అనాది కాలం నుంచి వివిధ వర్గాల ప్రజలను సోమనాథ్ ఏకం చేస్తోంది. శతాబ్దాల కిందటే పూజ్య జైన సన్యాసి కలికాల సర్వజ్ఞ హేమచంద్రాచార్య సోమనాథ్‌కు వచ్చారు. అక్కడ ప్రార్థన అనంతరం.. 'భవబీజాంకురజననా రాగాద్యాః క్షయముపగతా యస్య' అనే శ్లోకాన్ని ఆయన చెప్పాడంటారు. అంటే "లౌకిక కర్మ బీజాలను నశింపజేసే వాడికీ.. రాగద్వేషాలనూ, సమస్త క్లేశాలనూ తుడిచిపెట్టే వాడికీ వందనాలు" అని అర్థం. నేడు మన మనస్సులోనూ, ఆత్మలోనూ ఒక బలమైన చైతన్యాన్ని రగిలించే అద్భుత శక్తి సోమనాథ్‌కు ఉంది. 1026లో మొదటి దాడి జరిగి వెయ్యేళ్లు గడిచినా.. సోమనాథ్ వద్ద సాగరం నేటికీ అంతే గంభీరంగా గర్జిస్తోంది. సోమనాథ్ తీరాన్ని తాకే అలలు అద్భుతమైన కథను చెబుతున్నాయి. ఆటంకాలెన్నెదురైనా...ఆ అలల మాదిరిగానే మళ్లీ సోమనాథ అభ్యుదయం తథ్యం.

నాటి దురాక్రమణదారులు నేడు గాలిలో కలిసిన ధూళి కణాలయ్యారు. వారి పేర్లు విధ్వంసానికి పర్యాయపదాలుగా మిగిలాయి. సోమనాథ్ మాత్రం దిగంతాలకు అతీతంగా దేదీప్యమై వెలుగులు విరజిమ్ముతోంది. 1026నాటి దాడితో ఏమాత్రమూ చెక్కుచెదరని ఆ అజేయమైన స్ఫూర్తిని మనకు గుర్తు చేస్తూనే ఉంటుంది. ద్వేషం, మతోన్మాదాలకు తాత్కాలికంగా ధ్వంసం చేసే శక్తి ఉండవచ్చు. కానీ సత్యం, ధర్మంపై అచంచలమైన విశ్వాసం అమరత్వాన్ని సృజించగలవు. సోమనాథ్ ఒక ఆశా గీతం.

వెయ్యేళ్ల కిందట దాడికి గురై, ఆ తర్వాత కూడా నిరంతర దాడులను ఎదుర్కొన్న సోమనాథ ఆలయం మళ్లీ మళ్లీ సగర్వంగా నిలిచినట్టే.. మనం కూడా పరాయి దండయాత్రలకు ముందున్న, వెయ్యేళ్ల కిందటి మన దేశ మహా వైభవాన్ని పునరుద్ధరించుకుని తీరుతాం. సోమనాథ మహాదేవుడి ఆశీస్సులతో, వికసిత భారత నవసంకల్పంతో మనం ముందుకు సాగుతున్నాం. విశ్వకల్యాణమే పరమావధిగా.. మన నాగరికతా స్ఫూర్తి దిశానిర్దేశం చేస్తోంది.

జై సోమనాథ్!

యువతే దేశ భవిష్యత్తు రూపకర్తలు: గవర్నర్



అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ధైర్యం, పట్టుదల, సంకల్పంతో దేశాన్ని మార్చే శక్తి యువతకు ఉందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అభిప్రాయపడ్డారు. ఆదివారం లోక్‌భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో జాతీయ యువజనోత్సవంలో పాల్గొననున్న యువతతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. రాష్ట్రానికి చెందిన బృందం... వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2026 కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుకు యువతే రూపకర్తలని, వికసిత్ భారత్-2047 దిశగా దేశం సాగిస్తున్న ప్రయాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. యువజన సర్వీసుల కమిషనర్ ఎస్.భరణి, గవర్నర్ జాయింట్ సెక్రటరీ పి.ఎస్.సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదాత కుటుంబానికి రూ.లక్ష సాయం!

- ఒకరికి తాత్కాలిక ప్రభుత్వ ఉద్యోగం కూడా..
- సీఎంకు ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ప్రతిపాదన

అవయవదానం చేసిన జీవన్మృతుల కుటుంబాల త్యాగాన్ని గుర్తిస్తూ రూ.లక్ష చొప్పున అందజేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ప్రతిపాదనలు పంపించారు. దీనివల్ల బాధిత కుటుంబాలకు కాస్త అయినా సాంత్వన చేకూరడమే కాకుండా.. అవయవదానాన్ని మరింత ప్రోత్సహించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. గత ఏడాదిలో 93 మంది జీవన్మృతుల ద్వారా సేకరించిన అవయవాలను 301 మందికి అమర్చినట్లు వివరించారు. ప్రజల్లో అపోహలు తొలగించి, అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు బాధిత కుటుంబాలకు అందించే సాయాన్ని లక్షకు పెంచాలన్న ప్రతిపాదనను పంపించామని పేర్కొన్నారు. దాతల కుటుంబాల ఆర్థిక నేపథ్యాన్ని అనుసరించి.. ఒకరికి ప్రభుత్వం తాత్కాలిక ఉద్యోగ అవకాశాన్ని కూడా కల్పిస్తే బాగుంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

సారా అమ్ముతున్నాడని కుల బహిష్కరణ

- కుటుంబంతో సహా మోకాళ్లపై నిలబెట్టి శిక్ష
- విక్రయాలు ఆపకపోతే జరిమానా హెచ్చరిక
- ఆత్మహత్య చేసుకుంటామంటూ బాధితుడి సెల్ఫీ వీడియో



మోకాళ్లపై కనకరావు కుటుంబ సభ్యులు (ఫైల్)

మునునూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సారా అమ్ముతున్న ఓ వ్యక్తిని విక్రయాలు నిలిపివేయాలని.. లేదంటే రూ.లక్ష జరిమానా చెల్లించాలని కులపెద్దలు ఆదేశించారు. వారి ఆదేశాలు ఖాతరు చేయనందుకు ఆ వ్యక్తితోపాటు ఆయన కుటుంబానికి కుల బహిష్కరణ విధించారు. మనస్తాపానికి గురైన ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడుతున్నామంటూ సెల్ఫీ వీడియో విడుదల చేయడం కలకలం రేపింది. ఏలూరు జిల్లా ముసునూరు మండలం లోపూడి గ్రామానికి చెందిన బోట్ల కనకరావు సారా విక్రయాలు సాగిస్తుండేవాడు. ఎక్సైజ్ అధికారులు అతనిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. కనకరావు ఇటీవలే జైలు నుంచి విడుదలవగా.. పది రోజుల క్రితం పంచాయితీ పెట్టిన కులపెద్దలు సారా విక్రయాలు మానేయాలని, లేకుంటే రూ.లక్ష జరిమానా విధిస్తామని తెలిపారు. జరిమానా కట్టకపోతే కుల బహిష్కరణ విధిస్తామని హెచ్చరించారు. కనకరావు వారి మాటను వ్యతిరేకించడంతో ఆగ్రహించిన కుల పెద్దలు కనకరావుతోపాటు ఆయన కుటుంబసభ్యులను మోకాళ్లపై నిలబెట్టి కుల బహిష్కరణ విధించారు. ఈ నెల 3న కనకరావు సామాజిక వర్గీయుల ఇళ్లకు వెళ్లి ఆ కుటుంబాన్ని వెలి వేశామని, ఎవరూ వారితో మాట్లాడవద్దని చెప్పారు. మనస్తాపానికి గురైన కనకరావు తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నామని, దీనికి కుల పెద్దలు సుదగాని రాంబాబు, చలమాల వెంకటేశ్వరరావు, ఆరేపల్లి నాగేశ్వరరావు, వీరంకి గంగరాజు, పంది శ్రీనివాసరావు, తాళం శ్రీరాములు.. కారణమని పేర్కొంటూ ఆదివారం ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం బాధిత కుటుంబం గ్రామంలో కనిపించడం లేదు. బాధితుడి తండ్రి బోట్ల నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కుల పెద్దలను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబం అచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

కలల ఇంటికి చైనా హంగులు

(మొదటి పేజీ తరువాయి)

అమరావతిలోని రియల్టర్ల దాకా, ఎగువ మధ్యతరగతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుంచి వ్యాపార వేత్తలు, సంపన్న వర్గాల వరకు చైనా షాపింగ్‌పై మక్కువ చూపుతున్నారు. దూరాన్ని లెక్కచేయకుండా 'చలో చైనా' అంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు దుకాణాల్లో దొరికే ఫర్నిచర్‌లో అధిక భాగం చైనా నుంచి దిగుమతి అయినవే. ఇక్కడ షోరూమ్ యజమానులు అక్కడ తక్కువ ధరకు కొని.. ఇక్కడ పన్నులు, షోరూమ్ నిర్వహణ, లాభం అన్నీ కలుపుకొని దాదాపు రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. అదే వినియోగదారుడు నేరుగా చైనా వెళ్తే.. మధ్యవర్తులు ఉండరు కాబట్టి ఆ వస్తువులన్నీ 30% నుంచి 60% తక్కువకే లభిస్తాయి. వేలాది డిజైన్లు దొరుకుతాయి. షాపింగ్ పూర్తయ్యాక చైనాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను చూసొచ్చే వీలూ ఉంటుంది.

ఇతర దేశాలతో పోలిస్తే..

ప్రపంచంలోనే అతిపెద్ద హార్డ్‌వేర్, ఫర్నిచర్, గృహోపకరణాల మార్కెట్లలో ఒకటి చైనా. అక్కడ ఉత్పత్తి భారీ స్థాయిలో ఉండడంతో.. బ్రాండెడ్ వస్తువుల స్థాయి నాణ్యత ఉన్న ఉత్పత్తులు సైతం అతి తక్కువ ధరకే లభిస్తాయి. అయితే ఫర్నిచర్ అనగానే చైనాతో పాటు ఇటలీ, వియత్నాం, టర్కీ కూడా గుర్తొస్తాయి. కానీ.. తెలుగు వారు చైనాలోని ఫోషన్, గ్వాంగ్‌ఝౌ నగరాలనే ఎందుకు ఎంచుకుంటున్నారంటే.. అక్కడ ఒకేచోట వేల ఫ్యాక్టరీలు ఉండటం వల్ల పోటీ ఎక్కువగా ఉండి ధరలు తగ్గుతాయి. ఇటలీలో రూ.10లక్షలు పలికే ఒక డిజైనర్ సోఫాను చైనా వారు అదే క్వాలిటీతో రూ.4లక్షలకే ఇస్తారు. టర్కీలో క్లాసిక్ ఫర్నిచర్ బాగుంటుంది. కానీ ధరలు చైనా కంటే 40శాతం ఎక్కువ. వియత్నాంలో చెక్క ఫర్నిచర్ మాత్రమే దొరుకుతుంది. చైనాలో గ్లాస్, మెటల్, లెదర్, మార్బుల్, చెక్క ఇలా ప్రతిదీ దొరుకుతుంది. ఇంటీరియర్ డెకార్స్, లైటింగ్ షాపింగ్‌కు ప్రసిద్ధిగాంచిన థాయ్‌లాండ్‌లో ధరలు.. చైనా కంటే 20-30 శాతం ఎక్కువ. మాడ్యులర్ ఫర్నిచర్‌కు ప్రసిద్ధి చెందిన మలేసియాలోనూ ధరలు చైనా కంటే 15-25 శాతం ఎక్కువే. లగ్జరీ ఫర్నిచర్, బ్రాండెడ్ గృహోపకరణాలకు పెట్టింది పేరైన దుబాయ్‌లో ధరలు చైనా కంటే 30-50 శాతం అధికం. అందుకే మనోళ్లు చైనా వైపు మొగ్గుచూపుతున్నారు. మాస్ ప్రొడక్షన్ (ఒకే చోట పెద్ద ఎత్తున ఉత్పత్తి), ఫర్నిచర్ తయారీకి కావాల్సిన ఫోమ్, లెదర్ తదితర ముడిపదార్థాలు అక్కడే ఉండడం వల్ల రవాణా ఖర్చులు తగ్గి తయారీ వ్యయం తక్కువగా ఉంటోంది. అలాగే.. ఇతర దేశాలకు ఎగుమతి చేసే వస్తువులపై చైనా ప్రభుత్వం వ్యాపారులకు రాయితీలు ఇస్తోంది. అందుకే పలు దేశాల ప్రజలు చైనాలో ఫర్నిచర్ కొనుగోలుకు ఎగబడుతున్నారు. కేవలం ఫర్నిచర్‌కు సంబంధించే ఏటా అక్కడ 4 ట్రిలియన్ల వ్యాపారం నడుస్తోందంటే పరిస్థితిని ఊహించవచ్చు.

చౌక అనే కాదు.. క్వాలిటీ కూడా

గతంలో కంటే ఇప్పుడు ఇంకా చైనా వచ్చి వస్తువులు కొనుగోలు చేసేవారి సంఖ్య పెరిగిందని, చైనాలో వస్తువులు చౌక మాత్రమే కాకుండా వేలాది డిజైన్లు అందుబాటులో ఉంటాయని చైనాలో స్థిరపడిన హైదరాబాదీలు అప్పారావు, మూర్తి 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. 'చైనాకు వచ్చే వాళ్లు నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయడానికి సహకరిస్తున్నాం. హోటల్స్, భోజనం, స్థానిక రవాణా, ఫ్యాక్టరీల సందర్శన వంటివి దగ్గరుండి చూసుకుంటున్నాం. నాణ్యత పరిశీలన నుంచి ప్యాకింగ్, కంటైనర్ లోడింగ్ వరకు సాయం చేస్తున్నాం' అని తెలిపారు.

దూరమైనా.. ధర తక్కువ..

ప్రపంచ ఫర్నిచర్ రాజధానిగా పిలిచే చైనాలోని 'ఫోషన్' నగరంలో.. దాదాపు 5వేలకు పైగా ఫ్యాక్టరీలు, కిలోమీటర్ల మేర విస్తరించిన భారీ షోరూమ్‌లు ఉంటాయి. 'లూవ్రే' వంటి భారీ మాల్స్‌లో రోజుకు 10 కిలోమీటర్లు నడిచినా ఆ మార్కెట్ పూర్తికాదు. మనకు నచ్చినట్లుగా తయారుచేయించుకునే వెసులుబాటూ ఉంటుంది.

ఎక్కడెక్కడ ఏవి ఫేమస్సంటే..

చైనాలోని గ్వాంగ్‌ఝౌ నగరం.. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు, మొబైల్, దుస్తులు, ఫ్యాషన్ వస్తువులకు ప్రధాన హబ్. ప్రపంచం నలుమూలల నుంచీ వ్యాపారులు వాటిని కొనుగోలు చేయడానికి అక్కడికెళ్తారు. అలాగే.. గిఫ్ట్ ఐటెమ్స్, బొమ్మలు, స్టేషనరీ, ప్లాస్టిక్ వస్తువుల రాజధాని 'యివ్వు' నగరంలో విరివిగా లభిస్తాయి. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ చిప్స్, గాడ్జెట్లు, స్మార్ట్ డివైసెస్‌కు ప్రధాన కేంద్రం షెన్‌జెన్.

మనోళ్ల పాగా..

చైనా ఫర్నిచర్, ఇంటీరియర్స్‌పై పెరుగుతున్న క్రేజ్ నేపథ్యంలో.. అక్కడికి వచ్చే తెలుగువారికి భాష సమస్య లేకుండా సహాయపడేందుకు మనోళ్లు చాలామంది ఏజెన్సీలు తెరిచారు. వీటిని సోర్సింగ్ ఏజెన్సీలంటారు. ఆ ఏజెన్సీల నిర్వహణకు 500కు పైగా తెలుగు కుటుంబాలు ఫోషన్, గ్వాంగ్‌ఝౌ నగరాల్లో స్థిరపడ్డాయంటే మనోళ్ల కొనుగోళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడి నుంచి అక్కడకి వెళ్లడానికి కూడా.. హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాల్లో పలు ఏజెన్సీలు ఏర్పాటయ్యాయి. వారిని సంప్రదిస్తే మొత్తం పర్యటన ప్రణాళిక, ఏర్పాట్లను వారే చూసుకుంటారు. వీసా ప్రాసెసింగ్ నుంచి చైనాలో వసతి, భోజనం, ఫ్యాక్టరీల సందర్శన.. అన్నీ చూసుకుంటారు. మనోళ్లు అక్కడ కొనే వస్తువుల నాణ్యతను తనిఖీ చేసి, దగ్గరుండి ప్యాక్ చేయించి లోడ్ చేయిస్తారు. ఇందుకుగాను 5-8శాతం సర్వీస్ చార్జ్ తీసుకుంటారు. ఇటీవలికాలంలో చైనాకు వచ్చే తెలుగువారి సంఖ్య పెరుగుతుండడంతో.. అక్కడ తెలుగు భోజన హోటళ్లు కూడా వెలిశాయి. కొన్ని ఏజెన్సీలు ప్రత్యేకంగా తెలుగు వంటవాళ్లను నియమించుకుని షాపింగ్‌కు వచ్చే వాళ్లకు చక్కటి ఆంధ్రా భోజనాన్ని వడ్డిస్తున్నారు. అక్కడ 'తెలుగు అసోసియేషన్' కూడా బలంగా ఉంది. చైనాలో చదువుకోవడానికి (ముఖ్యంగా ఎంబీబీఎస్) వెళ్లిన తెలుగు విద్యార్థులు పార్ట్‌టైం జాబ్‌గా షాపింగ్ గైడ్‌లుగా వ్యవహరిస్తున్నారు. మనవాళ్ల తరపున బేరమాడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

సురక్షిత రవాణా

చైనాలో కొన్న వస్తువులను ఇంటికి చేర్చడానికి సురక్షితమైన రవాణా వ్యవస్థ అందుబాటులో ఉంది. కొన్న వస్తువులన్నింటినీ ఒక చోట చేర్చి, వాటర్ ప్రూఫ్ ప్యాకింగ్ చేస్తారు. ఆ వస్తువుల పరిమాణాన్ని బట్టి 20 అడుగుల లేదా 40 అడుగుల కంటైనర్లను బుక్ చేస్తారు. సముద్ర మార్గం ద్వారా చైనా నుంచి విశాఖపట్నం, చెన్నై పోర్టులకు పంపుతారు. అక్కడ కస్టమ్స్ క్లియరెన్స్ తర్వాత నేరుగా ఇంటికి చేరుస్తారు. భారీ సరకుల రవాణాకు సముద్రమార్గాన్నే ఎంచుకుంటారు. ఖర్చు కూడా తక్కువగానే ఉంటుంది. ఇంటికి చేరడానికి 25 రోజుల నుంచి 40 రోజులు పడుతుంది. ఇక తక్కువ బరువుండే, ఖరీదైన సరుకుల రవాణాకు విమాన మార్గం అనుకూలం. ఖర్చు ఎక్కువైనా వేగంగా వచ్చేస్తాయి. అక్కడ మనం కొన్న వస్తువులను కేవలం 5 నుంచి 10 రోజుల్లో చేరవేస్తారు. ఇంకా చిన్న వస్తువులను.. కొరియర్ ద్వారా పార్శిళ్ల రూపంలో పంపిస్తారు. ఇందుకు 7 నుంచి 12 రోజులు పడుతుంది.

ఇవన్నీ చూసుకోవాలి సుమా..!

అంతదూరం(చైనా) వెళ్లి షాపింగ్ చేసేవారు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. చైనా వెళ్లే ముందే ఇంటి గదులు, కిటికీలు, తలుపుల కొలతలు కచ్చితంగా నోట్ చేసుకోవాలి. యూరప్ దేశాలు క్వాలిటీ బాగోలేదని తిరస్కరించిన స్టాక్‌ను కొందరు ఏజెంట్లు తక్కువ ధర ఆశచూపి అంటగట్టే ప్రయత్నం చేస్తుంటారు. కాబట్టి ఏజెంట్ ఎంపిక చాలా ముఖ్యం. అపరిచితులకు ముందే డబ్బులు చెల్లించకూడదు. పాత కస్టమర్ల రిఫరెన్స్ ద్వారా ఏజెంట్‌ను ఎంచుకోవాలి. ఎలక్ట్రానిక్ వస్తువులు కొనేటప్పుడు వాటి స్పేర్ పార్ట్స్ దొరుకుతాయో లేదో చూసుకోవాలి. ఇంటర్నేషనల్ వారంటీ ఉన్న బ్రాండ్లను ఎంచుకోవడం ఉత్తమం. షోరూమ్‌లో నాణ్యమైన వస్తువు చూపించి కంటైనర్ లోడ్ చేసేటప్పుడు నాసిరకం వస్తువు పెట్టే ప్రమాదం కూడా ఉంటుంది. అందుకే లోడింగ్ పర్యవేక్షణ తప్పనిసరి. చైనాలో కొన్న వస్తువులకు ఇండియాలో వారంటీ ఉండదు. కాబట్టి ఎలక్ట్రానిక్ వస్తువుల కంటే నాన్ ఎలక్ట్రానిక్ వస్తువులకే ప్రాధాన్యమివ్వాలి. టైల్స్, కమోడ్స్ వంటివి కొనేటప్పుడు షిప్పింగ్‌లో పగిలిపోయే అవకాశం ఉంటుంది. అందుకే ఉడెన్ క్రేట్ ప్యాకింగ్ (చెక్క పెట్టెలు) చేయించుకోవాలి. టూరిస్ట్ వీసాపై కంటే.. బిజినెస్ వీసాపై వెళ్లడం సురక్షితం. కనీసం రూ.15 లక్షల పైన షాపింగ్ ఉంటేనే చైనా వెళ్లడం లాభదాయకం. చైనాలో వస్తువు కొనేటప్పుడు అక్కడ చెల్లించే వస్తువు ధరతో పాటు ఇక్కడ పోర్టులో చెల్లించాల్సిన కస్టమ్స్ డ్యూటీని కూడా లెక్కల్లోకి తీసుకోవాలి. అప్పుడే బడ్జెట్ తలకిందులు కాకుండా ఉంటుంది.

హైదరాబాద్‌లో రూ.40లక్షలు.. చైనాలో రూ.22 లక్షలే!

మా విల్లా కోసం ఫర్నిచర్ కొనాలని స్థానిక షోరూమ్‌కు వెళ్తే.. నాకు నచ్చిన ఇటాలియన్ మోడల్ సోఫా సెట్, డైనింగ్ టేబుల్, బెడ్స్, హోమ్ థియేటర్ సీటింగ్ అన్నీ కలిపి రూ.40లక్షల పైనే చెప్పారు. నేను నా స్నేహితుడి సలహా మేరకు చైనా వెళ్తే.. అక్కడ ఇవే వస్తువులు ఇంకా మెరుగైన ఫినిషింగ్‌తో కేవలం రూ.14 లక్షలకే దొరికాయి. షిప్పింగ్, కస్టమ్స్ డ్యూటీ, ప్రయాణ ఖర్చులతో కలిపి రూ.22లక్షల్లో పనిపూర్తయింది.

- దుబ్బాకుల విరాజ్ యాదవ్,
రియల్ ఎస్టేట్ వ్యాపారి, హైదరాబాద్

వారం రోజుల ట్రిప్.. రూ.18లక్షలకే ఇల్లు మొత్తం సెట్

కొత్తగా కట్టిన మా విల్లాలో ఫర్నిచర్, ఇంటీరియర్స్ కోసం రూ.25లక్షలు బడ్జెట్ అనుకున్నాను. కానీ, చైనాకి వెళ్తే.. రానుపోను టికెట్లు, షిప్పింగ్, డ్యూటీ అన్ని కలిపి రూ.18 లక్షలకే నాణ్యమైన, ఆధునిక డిజైన్ల ఫర్నిచర్ తెచ్చుకోగలిగాను. ఒక వారం ట్రిప్ ప్లాన్ చేసుకుంటే ఇల్లు మొత్తం సెట్ చేసుకోవచ్చు.

- పిల్లి శ్రీనివాస్, వస్త్ర దుకాణ యజమాని, విశాఖ



చైనాలోని ఫర్నిచర్ మాల్

నాణ్యమైన వస్తువులేనా?

చైనా వస్తువులు అనగానే చాలా మందికి అవేవో చీప్ వస్తువులనే భావన ఉంటుంది. కానీ, 'పిండి కొద్దీ రొట్టె' అన్న చందంగా.. మనం ఎంచుకునే గ్రేడ్, పెట్టే ఖర్చు ఆధారంగా చైనీయులు మనకు ఏ స్థాయి నాణ్యత కావాలంటే అంత నాణ్యతతో వస్తువులు తయారుచేసిస్తారు. ఉదాహరణకు ఒక ప్లాస్టిక్ కుర్చీనే తీసుకుంటే.. అది ఎ, బి, సి అనే మూడు గ్రేడ్లలో లభిస్తుంది. 'ఎ' గ్రేడ్ అంటే అత్యున్నత నాణ్యత. 'బి' మధ్యస్థం. 'సి' గ్రేడ్ ఉత్పత్తులు కూడా చూడ్డానికి మెరిసిపోతాయిగానీ మన్నిక తక్కువ. మనం చీప్ వస్తువులనేది వీటినే. కాబట్టి, 'ఎ' గ్రేడు రకాన్నే ఎంచుకోవాలి. వాటికి డ్యూటీ, షిప్పింగ్ ఖర్చులు కూడా కలుపుకొన్నా.. ఇక్కడి కంటే తక్కువకే లభిస్తాయి. ఆ వస్తువు కంటెయినర్‌లోకి ఎక్కే ముందు.. ఏజెంట్లు లేదా థర్డ్‌పార్టీ ఇన్‌స్పెక్షన్ కంపెనీల ద్వారా తనిఖీ చేయించుకోవచ్చు. నాణ్యత లోపం ఉంటే.. రిఫండ్ లేదా రీప్లేస్‌మెంట్ ఒప్పందంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇక.. కొత్తగా 'వీడియో కాల్ షాపింగ్' కూడా మొదలైంది. మీరు చైనా వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఏజెంట్ షోరూమ్‌లో తిరుగుతూ వీడియో కాల్ చేస్తారు. నచ్చిన వస్తువును అక్కడికక్కడే సెలెక్ట్ చేసుకోవచ్చు. అలీబాబా, అమెజాన్ చైనా, ట్రేడ్ ఇండియా, కనెక్ట్2ఇండియా వంటి బీ2బీ (బిజినెస్ టు బిజినెస్) వంటి పోర్టల్స్ ద్వారా ఇక్కడి నుంచే ఆర్డర్ చేయవచ్చు. అయితే.. ఆన్‌లైన్‌లో కనిపించే రంగు, ఫినిషింగ్ నేరుగా చూసినప్పుడు ఉండకపోవచ్చు. అలాగే, షిప్పింగ్ చార్జీలు మొదట తక్కువ చెప్పి, వస్తువు పోర్టుకు వచ్చాక రకరకాల ఫీజుల పేరుతో ఎక్కువ వసూళ్లు చేసే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి జాగ్రత్త.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.